ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

fb/prajasakti

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

www.prajasakti.com

సంపుటి : 37 సంచిక : 220 | విజయవాడ, గురువారం 10 ఆగస్టు 2017 | 12 + 12 పేజీలు వెల : 4.00

నినాదం మారింది

క్విట్ ఇండియా ఉద్యమం 75వ వార్షిక చర్చలో మోడీ

- 'సాధిద్దాం లేదా మరణిద్దాం' నుంచి 'సాధించి తీరాలనే' స్థాయికి వచ్చాం
- చీకటి శక్తులతో ప్రజాస్వామ్యం ఖూనీ
- ఆరెస్సెస్, బిజెపిలపై సోనియా పరోక్ష విమర్శ



లోక్‌సభలో ప్రసంగిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ పిలుపుతో 1942లో ప్రారంభమైన 'క్విట్ ఇండియా' ఉద్యమం నినాదం మారిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ ఉద్యమానికి 75 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా లోక్‌సభలో బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. "సాధిద్దాం లేదా మరణిద్దాం" అనే నినాదంతో క్విట్ ఇండియా ఉద్యమం జరిగిందని, ఇప్పుడు ఆ నినాదం "సాధించి తీరుదాం"గా మారిందని, 125 కోట్ల మంది జనాభా ఇదే నినాదంపై నమ్మకంతో ఉన్నారని అన్నారు. "ఈ రోజు మనకు మార్గదర్శకత్వం వహించేందుకు గాంధీ లాంటి నేత మనకు లేరు. కానీ మనందరం కలసికట్టుగా పనిచేస్తే స్వాతంత్ర్య సమరయోధుల కలల్ని నిజం చేసుకోవచ్చు" అని పేర్కొన్నారు. పేదరికం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత అనే సమస్యల్ని దేశంలో ఎక్కువమంది ఎదుర్కొంటున్నారని, వీటిని పరిష్కరించడంలో అన్ని పార్టీల నేతలూ కలసికట్టుగా పనిచేయాలని మోడీ పిలుపునిచ్చారు. గాంధీ కల 'గ్రామ స్వరాజ్యం' ఇంకా కలగానే ఉండిపోయిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అసువులుబాసిన ప్రతి ఒక్కరి త్యాగాలను ఆయన కొనియాడారు. 1942 నుంచి 1947 వరకూ జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో అన్ని వర్గాలకు చెందిన వ్యక్తులూ పాల్గొన్నారు. ఆ ఉద్యమం ఇచ్చిన స్ఫూర్తి భారత్‌కు స్వాతంత్ర్యాన్ని సాధించడంతోనే ఆగిపోలేదని, ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో వలస పాలనకు తెరదించిందని అన్నారు. అదే స్ఫూర్తిని 2017 నుంచి 2022 మధ్యలో కొనసాగించి దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మోడీ కోరారు. క్విట్ ఇండియా వంటి ఉద్యమాల గురించి నేటి యువత తెలుసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్య పునాదులు ధ్వంసం : సోనియా గాంధీ

ప్రధాని మోడీ ప్రసంగం అనంతరం కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ మాట్లాడారు. బిజెపి-ఆరెస్సెస్‌లను లక్ష్యంగా చేసుకుని పరోక్షంగా విమర్శలు సంధించారు. ప్రజాస్వామ్య పునాదులను చీకటి శక్తులు ధ్వంసం చేస్తున్నాయన్నారు. సంకుచిత, మిగతా 9లో



న్యూఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద జరిగిన చలో పార్లమెంట్ ర్యాలీనుద్దేశించి ప్రసంగిస్తున్న అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎ విజయ రాఘవన్

మోడీ సర్కార్ విధానాలతో

ఉపాధి నిర్వీర్యం

- పూర్తి వేతనంతో పనులు కల్పించాలి
- పేదలకు భూమి పంపిణీ చేయాలి
- జాతీయ ఆహార భద్రత చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి
- 'మార్చ్ టు పార్లమెంట్'లో వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్
- సిఐటియు, ఎఐకెఎస్ మద్దతు
- సిపిఎం ఎంపిల సంఘీభావం

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మోడీ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.విజయ రాఘవన్ విమర్శించారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల ఫలితంగా గ్రామీణ ప్రజా జీవనం చిన్నా భిన్నం అవుతోందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ నిధులు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని, సుప్రీం కోర్టు జోక్యం చేసుకొంటే తప్ప మోడీ సర్కార్ చలించలేదని వ్యాఖ్యానించారు. బడ్జెట్లో నిధులు కేటాయింపు నామమాత్రంగానే ఉంటోందని, అంతకంతకు బడ్జెట్ కేటాయింపులు తగ్గుతున్నాయని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల పట్ల ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని మండిపడ్డారు. బుధవారం నాడిక్కడ "సేవ్ మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంజిఎన్ఆర్ఈజిఎ)" నినాదంతో మిగతా 9లో



ప్రజావ్యతిరేక విధానాలు పోవాలి

- రాజ్యసభలో సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ : ప్రజలను చీల్చి, వారిపై భారాలు మోపడమే లక్ష్యంగా ప్రభుత్వాలు అమలు చేస్తున్న విధానాలు దేశంలో పోవాలని సీతారాం ఏచూరి అన్నారు. క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా రాజ్యసభలో జరిగిన ప్రత్యేక చర్చలో ఆయన మాట్లాడుతూ వివిధ అంశాలను ప్రస్తావించారు. 'దేశ ప్రజలను చీల్చే మతోన్మాదం.. ప్రజలపై భారాలు మోపే ఆర్థిక సరళీకరణ విధానాలను దేశం నుండి తరిమి కొట్టాలి. అవి దేశం నుండి పోవాలి' అని ఆయన అన్నారు. 'ప్రజలను అమానుషంగా హింసించే మిగతా 8లో

ప్రాజెక్టులకు పైసల్లేవ్..!

- కొత్త పల్లవి అందుకున్న సిఎం 2



గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు

నవ్య అరకుకు నాంది

- పిపిపి పద్ధతిలో ఎకో టూరిజం
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యత
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ప్రకృతి అందాల అరకును నవ్య అరకుగా నాంది పలికేందుకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర గవర్నర్ ఇఎస్-ఎల్.నరసింహన్ పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా అరకు ఎన్‌టిఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ మాట్లాడుతూ.. అరకు పర్యాటక అభివృద్ధికి శాశ్వత ప్రాతిపదికన క్రాఫ్ట్ బజారును ఏర్పాటు చేయాలని కోరారు. సేంద్రియ ఎరువులతో పండించే కాఫీ, పసుపు, మిరియాలకు గొప్ప డిమాండ్ ఉందని, వాటిని ప్రముఖ ఆదాయ వనరులుగా గిరిజనులు మలుచుకోవాలని సూచించారు. అరకు అందాలు ప్రతిబింబించేలా రాష్ట్రంలోని అన్ని నగరాల్లో షోకేసులను ప్రారంభించాలన్నారు. ప్రకృతి సంపదతో ఉన్న గిరిజనులు నగర మిగతా 9లో



వర్ణిక కేసులో వికాస్ బరాల అరెస్టు

8

పెత్తందారు పైశాచికం

పాలేరు దారుణ హత్య

ప్రజాశక్తి - కంకిపాడు (కృష్ణా)

కృష్ణాజిల్లా కంకిపాడు మండలం గొడవర్రులో ఓ పెత్తందారు చేతిలో పాలేరు దారుణ హత్యకు గురయ్యాడు. తీవ్రంగా కొట్టడంతోపాటు విద్యుత్ షాక్ ఇచ్చి అనంతరం ఉరివేశాడు. సేకరించిన, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గొడవర్రు గ్రామానికి చెందిన పెత్తందారు బొబ్బా బోసు ఇంట్లో ఉన్న గేదెలు, ఆవులు, పందెం కోళ్లను చూసుకునేందుకు అదే గ్రామానికి చెందిన పేరుబోయిన రామకృష్ణ, నాగలక్ష్మి చిన్న కుమారుడు గోపి(17) నెలకు రూ.3 వేలకు పాలేరుగా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో పెత్తందారు బోసు గోపి ఇంటికి వెళ్లి ఇంకా పనికి రాలేదంటూ మందలించాడు. గోపి హడావుడిగా నిద్రలేచి పనికి వెళ్లాడు. పనులు చేసిన అనంతరం భోజనం చేసేందుకు మధ్యాహ్న సమయంలో ఇంటికి వెళ్లి తిరిగి 3 గంటలకు మళ్లీ వెళ్లాడు. ఇంటి గేటు వద్ద ఉన్న బోసు ఆగ్రహంతో 'ఇంటికి వెళ్లి ఆలస్యంగా వస్తావా' అంటూ గోపీని తన్నుకుంటూ ఇంట్లోకి లాక్కెళ్లాడు. అంతేగాక ఇంటి వరండాలో విద్యుత్ బోర్డులో గోపి చెయ్యిపెట్టి షాక్‌కు మిగతా 9లో



గోపి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మా పోటీతోనే నిధులు

- నంద్యాల ఉప ఎన్నికల ప్రచార ర్యాలీలో జగన్
- ఏకగ్రీవం అంటే ఒక్కరైనా ఇటువైపు చూసేవారా?
- ప్రశ్నించే వారందరినీ జగన్ మనుషులంటారు
- ధర్మానికి ఓటు వేసి అధర్మాన్ని ఇంటికి పంపాలి



ప్రజాశక్తి-నంద్యాల క్రైం

నంద్యాల ఉప ఎన్నికల్లో తమ పార్టీ పోటీకి దిగడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు మంజూరు చేశారని వైఎస్ఆర్‌సిపి అధినేత జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని రైతునగరం, కానాల, గోస్పాడు మండలం చింతకుంట తదితర గ్రామాల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉప ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిని నిలబెట్టినందుకే ఎపి కేబినెట్ మొత్తం నంద్యాల రోడ్లపై వాలిందన్నారు. తాము ఏకగ్రీవం అంటే ఒక్కరైనా నంద్యాల ముఖం చూసేవారా అని ప్రశ్నించారు. ఇన్ని రోజులు గుర్తుకు రాని నంద్యాల ప్రజలు ఇప్పుడెందుకు గుర్తొస్తున్నారని నిలదీశారు. చంద్రబాబు 2014 ఆగస్టు 15న సిఎం హోదాలో కర్నూలులో జాతీయ జెండా ఎగురవేసి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని ఎండగట్టారు. చంద్రబాబు కోసం వచ్చే మంత్రులంతా దెయ్యాలని, ధర్మానికి ఓటు వేసి అధర్మాన్ని ఇంటికి పంపాలని ప్రజలను కోరారు. రాబోయే 2019 సాధారణ మిగతా 9లో



పని ఫుల్.. సిబ్బంది నిల్

- అసెంబ్లీ సచివాలయంలో 179 పోస్టులు ఖాళీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల లేమితో శాసనసభ నిర్వీర్యమైపోతోంది. ఏకంగా 82 శాతం పోస్టులు ఖాళీగా ఉండిపోవడంతో విధులు నిర్వహించడమే భారంగా మారిపోతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఎపి అసెంబ్లీకి కేటాయించిన పోస్టుల్లో అధిక భాగం ఖాళీగానే ఉన్నాయి. వీటిని భర్తీ చేయించుకునేందుకు శాసనసభ సచివాలయం చేస్తున్న ప్రయత్నాలు ఇంకా ఫలించలేదు. దీంతో వచ్చే బడ్జెట్ సమావేశాల నిర్వహణ మిగతా 9లో

బిజెపికి భంగపాటు

- గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో నెగ్గిన అహ్మద్‌పటేల్ 8

ప్రజ్ఞ



1. సుప్రీం కోర్టుకు తదుపరి ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
2. గుజరాత్ నుంచి నూతనంగా రాజ్యసభకు ఎన్నికైంది ఎవరెవరు?
3. భారతదేశంలో ఆయుర్ధాయంలో తొలిస్థానంలో ఉన్న రాష్ట్రం ఏది?
4. అమెరికాలోని గువాంపై దాడి చేస్తాం అని హెచ్చరించిన దేశం ఏది?
5. ఐసిసి తాజా ర్యాకింగ్స్‌లో మొదటి స్థానంలో ఉన్న ఆల్‌రౌండర్ ఎవరు?

సమాధానాలు 7లో

వాతావరణం



కోస్తా, సీమలో భారీ వర్ష సూచన

ప్రజాశక్తి– విశాఖపట్నం ప్రతినిధి

ఈ నెల 12, 13 తేదీల్లో కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ పేర్కొంది. గురు, శుక్రవారాల్లోనూ అక్కడక్కడా ఓ మోస్తరు నుంచి చెదురుమదురు జల్లులు కురుస్తాయని, ముఖ్యంగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కడప, చిత్తూరుల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. హిమాలయాల నుంచి నైరుతి రుతుపవనాల ద్రోణి ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా వరకు రావడం, మరోవైపు చత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా దక్షిణ తమిళనాడు వరకు ద్రోణి స్థిరంగా కొనసాగుతుండటంతో తెలుగు రాష్ట్రాల్లో జల్లులు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. రుతుపవనాల ద్రోణి మరి కాస్తా కిందకు దిగితే రాష్ట్రమంతటా వర్షాలు కురుస్తాయని నిపుణులు చెబుతున్నారు. బుధవారం ఉదయానికి తిరువూరులో 9.5, రాయలసీమలోని రాయచోటిలో 11.0, ఆరోగ్యవరంలో 7.1, పమిడి 7.0, చాపాడు 6.3, వేంపల్లి 5.8, నంద్యాల 5.0, లక్కిరెడ్డిపల్లె 4.4, ప్రొద్దుటూరు 4.1, దువ్వూరు 3.5, మదనపల్లె 3.4 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. బుధవారం మధ్యాహ్నం విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో పలు చోట్ల జల్లులు పడ్డాయి.

నేడు విద్యా సంస్థల బంద్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు గురువారం మూతపడనున్నాయి. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలన్నీ బంద్‌కు పిలుపునిచ్చిన సంగతి విదితమే. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరుతూ ఈ బంద్ చేపడుతున్నారు. ప్రైవేటు విద్యా సంస్థల్లో భారీగా ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనిని నియంత్రించాలని ప్రభుత్వాన్ని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

ముగిసిన ఐసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఈ నెల 6, 7, 8 వ తేదీల నుంచి నిర్వహిస్తున్న ఐసెట్ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. అలాట్‌మెంట్ ఆర్డర్లను, సీట్ల కేటాయింపుల వివరాలను ఐసెట్ కన్వీనర్ జిఎస్ పాండాదాస్ విడుదల చేశారు. ఫైనల్ ఫేజ్ కౌన్సిలింగ్ అనంతరం 7789 సీట్లు ఖాళీగా మిగిలిపోయినట్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఎంబిసి కార్పొరేషన్ ఇన్‌చార్జి ఎండిగా నాగభూషణం

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ అత్యంత వెనుకబడిన తరగతుల(ఎంబిసి) సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఇన్‌చార్జి మేనేజింగ్ డైరెక్టర్‌గా బి నాగభూషణంను నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాగభూషణం ప్రస్తుతం బిసి సంక్షేమ శాఖలోని రజక కో–ఆపరేటివ్ ఫెడరేషన్‌కు ఎండిగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రాజెక్టులకు పైసల్లేవ్..!

- కొత్త పల్లవి అందుకున్న సిఎం
- ఆచితూచి వ్యవహరిస్తున్న కేంద్రం
- పోలవరం సహా అన్నీ ఇబ్బందులే



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రానికి నిధులివ్వడంలో కేంద్రం ఆచితూచి వ్యవహరిస్తుండటంతో ఆర్థిక పరిస్థితి డోలాయమానంగా మారింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి క్రమంగా పల్లవి మారుస్తున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాజెక్టులు కేంద్ర సాయంతో నడుస్తున్నాయని, వాటిని పరిశీలించడం తప్ప పని చేయించడం తన చేతుల్లో లేదని చెబుతున్నారు. రాష్ట్రంలో కేంద్ర నిధులతో చేపట్టిన అనేక ప్రాజెక్టులకు నిధుల సమస్య ఉత్పన్నమవుతోంది. వాటిని రప్పించుకునే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి పలు సమస్యలు ఎదురవుతున్నాయి. కేంద్రం ఆధ్వర్యంలో సాగుతున్న రోడ్డు ప్రాజెక్టులు, పై వంతెన ప్రాజెక్టులు కూడా సమస్యాత్మకంగానే మారాయి. రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 80 శాతం జీతాలకే సరిపోతోంది. మరోవైపు ప్రాజెక్టులకూ వేల కోట్ల నిధులు వెచ్చిస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం నిధులివ్వకపోతే సమస్యలు మరింత జటిలమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం విషయంలోనూ కేంద్రం నిదానంగానే స్పందిస్తోంది. రాష్ట్రం అదీ స్వయంగా ముఖ్యమంత్రే పర్యవేక్షణ చేస్తున్నా నిధులు విడుదల కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం నగరానికొచ్చిన గవర్నర్ నరసింహన్‌ను సిఎం చంద్రబాబునాయుడు కలిసి పోలవరానికి నిధులిప్పించాలని కోరారు. ఇప్పటికే ఆలస్యమవుతోందని, ప్రాజెక్టులు పూర్తి కాకపోతే రాజకీయంగానూ ఇబ్బంది ఎదురవుతుందని ఆయన ముందు మొరపెట్టుకున్నారు. రోడ్డు ప్రాజెక్టులు కూడా ఆలస్యమవుతున్నాయని, కేంద్ర నిధులతో చేపడుతున్న అనేక పనులు ఆగిపోయాయని చంద్రబాబు స్వయంగా ప్రకటించారు. అమరావతిలో కీలకమైన 16వ నెంబరు జాతీయ రహదారి అవుటర్ రింగురోడ్డు పనులు అమరావతి రాజధానిగా ప్రకటించినప్పటి నుంచీ లిచిపోయాయి. మాస్టర్‌ప్లానులోనూ ఈ రోడ్డును పేర్కొన్నారు. దీన్ని కాంట్రాక్టు తీసుకున్న గామన్ ఇండియా పనులు నిలిపేసింది. మూడేళ్లుగా కదలికలేదు. ఇటీవల ఆస్ట్రేలియా కంపెనీతో ఒప్పందం చేసుకుందని ప్రచారం సాగినా అదీ లేదు. 65వ నెంబరు జాతీయ రహదారిపై విజయవాడ కనకదుర్గ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని సోమా కంపెనీకి ఇప్పగించారు. పుష్కరాల నాటికి ప్రాజెక్టు పూర్తి చేస్తామని ప్రకటించారు. దీనిపై పెద్దఎత్తున హడావుడి చేశారు. వేల ఇళ్లను తొలగించారు. అయినా ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. ఇప్పటి వరకూ దీన్ని పూర్తిచేస్తామని, అవసరమైన నిధులివ్వాలని చెప్పిన ముఖ్యమంత్రి పనులు నిలిచిపోవడంతో సోమా కంపెనీ తమ మాట వినడం లేదంటున్నారు. నిధుల సమస్య ఉండటంతో సోమా కూడా పనులు చేయలేకపోతోందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. పోలవరం విషయంలో ఇప్పటి వరకూ రూ. మూడు వేల కోట్ల వరకూ రావాల్సి ఉందని, వస్తే సమస్య పరిష్కారమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబే పేర్కొంటున్నారు. దీనిపై కేంద్రం స్పందించడం లేదంటున్నారు. ఇప్పటివరకూ పనులు పూర్తవుతున్నాయని చెప్పిన చంద్రబాబు గవర్నర్‌ను నిధులు ఇప్పించాలని కోరడం చర్చనీయాంశమైంది. అక్కడ కాంట్రాక్టరుగా ఉన్న ట్రాన్స్‌ట్రాయ్‌ను మార్చే ఆలోచనలేదని తెలిపారు. ఒకవైపు నిధులివ్వడం లేదంటూనే, మరోవైపు పనులు జరగకపోయినా ట్రాన్స్‌ట్రాయ్‌ను మారిస్తే జాప్యమవుతుందని చంద్రబాబు చెబుతున్నారు. అవసరమైతే ఉప కాంట్రాక్టర్లను పెట్టి పనులు చేయిస్తామంటున్నారు. కోస్తా కారిడార్ వ్యవహారమూ మారింది. మరోవైపు రాష్ట్ర లోటు రూ. 4100 కోట్లు మాత్రమేనని, ఇప్పటికే రూ. 2300 కోట్లిచ్చామని, మిగిలింది మాత్రమే రాష్ట్రానికి కేటాయిస్తామని కేంద్రం చెబుతోంది. బ్యాంకర్ల విషయంలోనూ సిఎం అసంతృప్తిగానే ఉన్నారు. రుణమాఫీ విషయంలో తాము చెప్పింది బ్యాంకర్లు చేయలేదని, కేంద్రం కూడా పూర్తిస్థాయిలో సహకరించక పోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని చెప్పారు. ఎన్నిసార్లు చెప్పినా బ్యాంకర్లు విని వెళ్లిపోవడం మినహా చేస్తున్నదేమీ లేదని చంద్రబాబు చెబుతున్నారు. కేంద్రంతో కలిసుంటేనే నిధులొస్తాయని నిరంతరం చెబుతూ వస్తున్న చంద్రబాబు నిధులు ఇవ్వకపోయినా కేంద్రాన్ని ప్రశ్నించకపోవడమే విశేషం.

రాజకీయాలు ఇక మాట్లాడను

ఇదే చివరి ప్రెస్‌మీట్ : వెంకయ్య

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో



కొత్తగా వచ్చిన బాధ్యతల (ఉప రాష్ట్ర పతి) కారణంగా ఇక నుంచి రాజకీయాల గురించి మాట్లాడనని కేంద్ర మాజీమంత్రి ఎం వెంకయ్య నాయుడు తెలిపారు. ఇక నుంచి తాను రాజకీయాలకు అతీతమన్నారు. అయితే ప్రజ లకు సంబంధించిన అంశాలపై కూడా స్పందించకుండా ఉండటమనేది దీని అర్థం కాదని స్పష్టం చేశారు. గతంలో ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన మహనీయులు సర్వేపల్లి రాధాకష్ణన్, జాకీర్ హుస్సేన్ వంటి వారు చేసిన కార్యకలా పాలను గురించి తెలుసుకోవడానికి పుస్తకాల్ని అధ్యయనం చేస్తున్నానన్నారు. హైదారాబాద్‌లో బుధవారం ఆయన విలేకరులతో పిచ్చాపాటిగా మాట్లాడారు. కొత్త బాధ్యతల గురించి తెలుసుకునేందుకు తాను అధికారుల్ని సంప్రదిస్తానన్నారు. రాజ్యసభ చైర్మన్‌గా పెద్దల సభలో అర్థవంతమైన చర్చ జరిగేలా చూస్తాన న్నారు. ప్రతిపక్షాలు, అధికార పక్షం అని కాకుండా అందరికీ సమానంగా మాట్లాడే అవకాశమిస్తానన్నారు. పేదరికం, నిరక్షరాస్యత, ఆర్థిక తారతమ్యాలు, వివిధ వర్గాలపై ఉన్న వివక్ష, వాతావరణ నిర్లక్ష్యంలాంటి అంశాల పరిష్కారమే దేశ ప్రధాన అజెండాగా ఉండాలన్నారు. తాను ముక్కుసూటి మనిషిని కాబట్టే మీడియాలో ప్రాచుర్యం ఎక్కువగా లభించిందన్నారు. జవసత్వంతో రాజకీయాల్లోకి రావాలే తప్ప వారసత్వ రాజకీయాలు మంచివి కావని ఆయన స్పష్టం చేశారు. ఇదే తన చివరి విలేకరుల సమావేశమని వెంకయ్య తెలిపారు.



వర్షం నీటితో జలాశయాన్ని తలపిస్తున్న మొజాం జాహి మార్కెట్

హైదరాబాద్‌లో భారీ వర్షం

- లోతట్టు బస్తీలు జలమయం
- 5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

భాగ్యనగరం తడిసి ముద్దయ్యింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. నగర వ్యాప్తంగా సరాసరి 5సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. ఇళ్ళలోకి వరద చేరడంతో స్థానికులు నానా అవస్థలు పడ్డారు. ప్రధాన మార్గాల్లో రోడ్లపై మూడు అడుగుల వరకు వర్షపు నీరు నిలిచిపోయింది. నగరవాసులు రోడ్లపై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. భారీ వర్షాలను దృష్టిలో పెట్టుకొని జీహెచ్‌ఎంసీ ఎమర్జెన్సీ బృందాలను నియమించినా ప్రజలకు తిప్పలు తప్పలేదు.

ఇళ్లల్లోకి వరద నీరు

భారీ వర్షానికి నాలాలు పొంగి వరద నీరు ఇళ్ళలోకి వచ్చింది. సికింద్రాబాద్, మోండా మార్కెట్, రామ్‌నగర్, వారాసిగూడ, కూకట్‌పల్లి లోతట్టు ప్రాంతాలు, బంజారాబస్తీ, అడ్డగుట్ట, తుకారంగేట్, నాచారం, చింతల్‌బస్తీ, ఖైరతాబాద్ లోతట్టు బస్తీల్లో నాలుగు అడుగుల వరద నీరు నిలిచింది. బస్తీల్లో రోడ్లపై నీటిని తోడేందుకు బల్దియా ప్రత్యేక ఏర్పాట్లు చేసినా నాలాలు పొంగడంతో నీరు వెళ్ళడం కష్టంగా మారింది. నగర వ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి ట్యాంక్‌బండ్‌కు వరద పోటెత్తింది. భారీగా వరద వచ్చి చేరడంతో మారియట్ హోటల్ వద్ద సాగర్ నాలా పొంగి పొర్లుతోంది. నురుగులు కక్కుతూ ప్రవహిస్తున్న వరదను చూసేందుకు సందర్శకులు భారీగా తరలివచ్చారు.

ప్రజల్లోకి కార్యదర్శులు

- ఉన్నతాధికార యంత్రాంగానికి 'ప్రజలే ముందు' మార్గదర్శకాలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

'ప్రజలే ముందు' నినాదంతో కూడిన విధానాన్ని అమలు చేసేందుకు క్షేత్ర స్థాయి కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు శాఖాధిపతులు మాత్రమే క్షేత్ర స్థాయికి వెళుతుండగా, ఇకపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు కూడా క్షేత్ర స్థాయికి వెళ్లాలని పేర్కొంటూ రూపొందించిన మార్గదర్శకాలతో సాధారణ పరిపాలన శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామాల్లో రాత్రి బసలు

ప్రతి కార్యదర్శి నెలలో రెండుసార్లు గ్రామాలకు వెళ్లి, రాత్రి అక్కడే బస చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఆయా శాఖల అధిపతులు నెలకు ఏడు రోజులు గ్రామ సందర్శన చేయాలన్నారు. వారూ కనీసం రెండు రాత్రులు గ్రామాల్లో బస చేయాలని నిర్దేశించారు. ఆయా శాఖల జిల్లా అధికారులు కూడా వారానికి మూడుసార్లు గ్రామాలకు వెళ్లాలని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామాల్లోని ప్రజలతో తమ ఈ పర్యటనల సందర్భంగా అధికారులు చర్చించాలని సూచించారు. ఆయా పథకాలు కార్యక్రమాలు ప్రజలకు ఎలా అందుతున్నాయి, వాటి అమలులో చేయాల్సిన మార్పులు చేర్పులు ఏమైనా ఉన్నాయా? వంటి వివరాలతో ప్రతి నెలా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కార్యదర్శులు నివేదిక ఇవ్వాలని కూడా స్పష్టం చేశారు. ఇక మండల, డివిజన్ స్థాయి అధికారులు నెలలో 15 నుంచి 20 రోజులపాటు గ్రామాల్లో పర్యటించి, వారి జిల్లా అధికారులకు వివరాలు నివేదించాలని పేర్కొన్నారు.

శాఖల మధ్య సమన్వయం

గ్రామాలకు వెళ్లే కార్యదర్శి స్థాయి అధికారులు, ఆ గ్రామంలోని అన్ని శాఖలకు చెందిన అంశాలను సమీక్షించాలని, దీనివల్ల శాఖల మధ్య సమన్వయం కూడా సాధ్యమవుతుందని సూచించారు. ఇస్తున్న నిధులు, ఖర్చు, పనుల్లో నాణ్యత, లక్ష్య సాధన వంటి అంశాలపైనా కార్యదర్శులు దృష్టి సారించాలని సాధారణ పరిపాలన శాఖ సూచించింది. గ్రామాల్లో ప్రజలతో చర్చించేందుకు వివిధ శాఖల ఆన్‌లైన్ డేటాను ఉపయోగించుకోవాలని, ఈ పర్యటనల్లోని చర్చలు, నివేదికల కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా సిద్ధం చేస్తున్నామని పేర్కొంది.

మొత్తం నివేదికలను ప్రణాళిక శాఖ క్రోడీకరించి, తుది నివేదికను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి అందించాల్సి ఉంటుందని తెలిపింది. ఇదిలావుండగా 2019లో వచ్చే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచీ అధికార యంత్రాంగాన్ని పరుగులు తీయించేందుకే ఈ కసరత్తు అని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. వివిధ పథకాల అమలుకు సంబంధించి అవకతవకలు జరుగుతున్నాయనే సమాచారంతో ఇప్పటికే చంద్రబాబునాయుడు జన్మభూమి కమిటీలను ప్రక్షాళన చేస్తామని ఇటీవలే స్పష్టం చేసిన విషయం విదితమే.

ఉత్సవ విగ్రహాల్లా బిసి స్టడీ సర్కిళ్లు

- శిక్షణంతా ప్రైవేటుపరం
- డైరెక్టర్లతో సహా సిబ్బంది అంతా ఔట్‌సోర్సింగే
- అభ్యర్థుల భవితవ్యాన్ని పట్టించుకునే నాథుడేడీ

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని బిసి స్టడీ సర్కిళ్లను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న విమర్శలొస్తున్నాయి. ఐఎఎస్, ఐపిఎస్ వంటి సివిల్స్ ఉన్నత పరీక్షలకు అవసరమైన శిక్షణ ఇవ్వడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేసిన స్టడీ సర్కిళ్ల ద్వారా కనీసం కానిస్టేబుల్ పరీక్షలకు కూడా శిక్షణ ఇవ్వకపోవడంతో రాష్ట్రంలో బిసి స్టడీ సర్కిళ్ల ఉనికే ప్రశ్నార్థకంగా మారిందని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. దీనికి తోడు శిక్షణలన్నీ ప్రైవేటు సంస్థలకు అప్పగించడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సివిల్స్ పరీక్షలకు శిక్షణ అందించి పాలనా వ్యవస్థలో వెనుకబడిన తరగతులకు చెందిన వారిని కూడా భాగస్వాములు చేయాలనే మహోన్నత లక్ష్యంతో బిసి స్టడీ సర్కిళ్లను నెలకొల్పారు. ప్రతి ఏటా ఈ పరీక్షల కోసం స్టడీ సర్కిళ్ల ద్వారా ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు పూర్తి స్థాయి వసతులు కల్పించాలి. ఆయా రంగాల్లో నిష్ణాతుల ద్వారా శిక్షణ ఇప్పించాలి. గ్రంథాలయాన్ని కూడా అందుబాటులో ఉంచి అభ్యర్థులు చదువుకోడానికి అవసరమైన పుస్తకాల్ని అందజేయాలి. కానీ గత మూడేళ్లుగా ఆ దిశగా కార్యక్రమాలేవీ చేపట్టడం లేదు.

శిక్షణలన్నీ ప్రైవేటు సంస్థలకే

గత మూడేళ్ల నుంచి శిక్షణ కార్యక్రమాలన్నీ ప్రైవేటు సంస్థలకే అప్పగిస్తున్నారు. ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం ద్వారా సివిల్స్, గ్రూప్స్ వంటి పరీక్షలకు కూడా విద్యార్థులన్ని ఆయా ప్రైవేటు సంస్థలకు తరలించి శిక్షణ ఇప్పిస్తున్నారు. తాజాగా బ్యాంక్ పోటీ పరీక్షలకు కూడా ప్రైవేటు సంస్థల ద్వారానే ఇవ్వాలని నిర్ణయించారు.

శిక్షణతోనే సరిపెట్టుకుంటున్న సర్కారు

విద్యార్థులకు కేవలం శిక్షణిచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. శిక్షణా సమయంలో స్టైఫండ్ రూపంలో కొంత మొత్తాన్నిస్తున్నారే తప్ప విద్యార్థులకు శిక్షణ ఎంత వరకు ఉపయోగపడుతోంది, ఎంత మంది విద్యార్థులు విజయం సాధిస్తున్నారనే అంశాలపై దృష్టి సారించడంలేదు. కేవలం శిక్షణిచ్చి పంపించడంతో వారికి తమ ఇళ్ల దగ్గర చదువుకునే వాతావరణం లేక వెనుకబడిపోతున్నారు. బిసి విద్యార్థుల్లో అత్యధికం గ్రామాల నుంచి వచ్చిన వారే ఉంటారు. పోటీ పరీక్షలకు కావలసిన అవగాహన వీరికి పెద్దగా ఉండదు. వందల పోస్టులకు లక్షల సంఖ్యలో పోటీ ఉండడంతో అందుకు తగిన విధంగా లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నారు.

ఉత్సవ విగ్రహాల్లా స్టడీసర్కిళ్లు

సివిల్స్ పరీక్షల నుంచి కానిస్టేబుల్, బ్యాంక్ పోటీ పరీక్షల వరకు ప్రైవేటు సంస్థల ద్వారానే శిక్షణివ్వడంతో స్టడీ సర్కిళ్లు కేవలం ఉత్సవ విగ్రహాల్లా మారిపోతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బిసి స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేశారు. వీటిల్లో ఒక రాజమండ్రిలో ఉన్న సెంటర్ తప్ప మిగిలినవన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి.

ఆందోళనలో సిబ్బంది

డైరెక్టర్లతో సహా ఈ సెంటర్లలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అంతా ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. ప్రస్తుతం స్టడీసర్కిళ్ల ద్వారా ఎటువంటి కార్యక్రమాలూ చేపట్టకపోవడంతో సెంటర్లను ఎత్తేస్తారేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత శిక్షణ నిమిత్తం ప్రభుత్వం ఖర్చుపెడుతోన్న దానిలో సగం నిధుల్ని స్టడీసర్కిళ్ల కోసం వెచ్చిస్తే బిసి విద్యార్థుల పాలిట కల్పతరువులుగా మారే అవకాశముందని వారు అభిప్రాయపడుతున్నారు. సబ్‌ప్లాన్‌తో సహా సంక్షేమానికి కేటాయించిన నిధులు మురిగిపోతున్నాయి. సొంత భవనాలు నిర్మించి స్టడీసర్కిళ్లను పటిష్టం చేయాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

విభజన సమస్యలు ఒక్క రాత్రిలో పరిష్కారం కావు

రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు కుటుంబరావు


ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



ఒక్క రాత్రిలోనే సమస్యలన్నీ పరిష్కారం కావని, విభజన జరిగిన రాష్ట్రాల్లో సమస్యల పరిష్కారానికి సుమారు దశాబ్దాల కాలం పట్టిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు సి కుటుంబరావు పేర్కొన్నారు. విజయవాడలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ సమస్య ఉన్నా కాల్ సెంటర్ 1100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. మద్యం షాపుల వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందన్నారు. ఫిర్యాదులు వచ్చిన 1294 మద్యం దుకాణాలను మూసి వేసినట్లు ఆయన వెల్లడించారు. బెల్టు షాపుల ను ప్రభుత్వం కట్టడి చేస్తుందన్నారు. కడప, కర్నూలు, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, అనంతపురం, గుంటూరు జిల్లాల మద్యం దుకాణాలు, బెల్టు షాపుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. విశాఖపట్నం భూ కుంభకోణాన్ని త్వరగా పరిష్కరించాలని ఎక్కువ మంది ప్రజలు అభిప్రాయపడుతున్నారని, పారదర్శకత పాటించడంతో పాటు పట్టా హక్కులు పటిష్ట పరచాలని సూచించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి, కొందరు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులూ అవినీతికి పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అన్నిటినీ ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అన్న అమృత హస్తం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ వంటి వాటిపై తాము చేసిన సర్వే ద్వారా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నామని తెలిపారు. ఈ ఫీడ్‌బ్యాక్‌ల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవ చేసేందుకు ప్రభుత్వానికి అవకాశం లభిస్తోందన్నారు. విభజన సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌కు రూ.16 వేల కోట్ల లోటు ఉందని కుటుంబరావు వివరించారు.

మెడ్‌టెక్‌లో అవినీతి జరగలేదు : కామినేని

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



మెడ్‌టెక్ జోన్ టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ స్పష్టం చేశారు. మెడ్‌టెక్ పార్క్ విషయంలో మెడ్‌టెక్ జోన్ మాజీ ఉపాధ్యక్షులు జ్యూడిష్‌రాజ్ చెప్పగానే నివేదిక ఇవ్వాలని తాము చెప్పామన్నారు. సచివాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడ్‌టెక్ జోన్‌ను ఓపెన్ టెండర్ల ద్వారానే కేటాయించామన్నారు. ఐదేళ్లకు రూ. 1100 కోట్లు ఖర్చు చేయాలన్నారు. కొందరు సీఈఓ ఈ మెయిల్‌ను హ్యాక్ చేసి ఇన్వెస్టర్లకు నకిలీ మెయిల్స్ పంపించారన్నారు. ఇతర రాష్ట్రానికి లబ్ధి చేకూరేలా నకిలీ మెయిల్స్‌తో సైబర్ నేరానికి పాల్పడ్డారన్నారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. టెండర్లలో పాల్గొననివారే ఇలాంటి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఈ మూడేళ్ళలో కేంద్రం సహాయం చేసిన విధంగా ఏ రాష్ట్రానికీ, ఏ ప్రభుత్వమూ చేయలేదన్నారు. బిజెపి ప్రభుత్వం వల్లే పోలవరం ప్రాజెక్టు సాధ్యమైందన్నారు. కేంద్రం సహాయ సహకారాల్లేకుండా ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందదని ఆయన స్పష్టం చేశారు.

నేడు ఢిల్లీకి మంత్రి లోకేష్

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



పంచాయతీరాజ్ శాఖ మంత్రి నారా లోకేష్ గురువారం ఢిల్లీకి బయలుదేరి వెళ్ళనున్నారు. ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులు, గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సంస్థకు రావాల్సిన నిధుల విడుదల కోసం ఆయన కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శులు జితేందర్‌సింగ్, అమర్జీత్ సిన్హాలను కలుస్తారు. రాష్ట్రానికి సంబంధించిన ఉపాధి పథకం కింద మెటీరియల్ కాంపొనెంట్ నిధులు రూ.1,351.81 కోట్లు, లేబర్ బడ్జెట్ కింద రావాల్సిన రూ.600 కోట్లు త్వరితగతిన విడుదల చేయాలని కోరనున్నారు. 2,207 నివాస ప్రాంతాలకు 4,772 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం రూ.3,185 కోట్లు కావాలని కేంద్రాన్ని కోరనున్నారు. మరుగుదొడ్ల నిర్మాణానికి విడుదల కావాల్సిన రూ.165 కోట్లు, జాతీయ గ్రామీణ తాగునీటి పథకంలో భాగంగా రావాల్సిన నిధులు, సోలార్ ఆధారిత నీటి సరఫరా పథకాలకు, ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాల్లో నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు తదితర అంశాల్ని చర్చించనున్నారు.

నంద్యాల బరిలో 15 మంది

ప్రజాశక్తి–నంద్యాల

నంద్యాల ఉప ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల ఉప సంహరణ పర్వం బుధవారం ముగిసింది. మొత్తం 30 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలనలో ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లను ఎన్నికల అధికారి తిరస్కరించారు. మిగిలిన 24 మంది అభ్యర్థుల్లో స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లను దాఖలు చేసిన 9 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఎన్నికల బరిలో 15 మంది అభ్యర్థులు మాత్రమే నిలిచారు. ఇందులో టిడిపి అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి, యువజన శ్రామిక రైతు కాంగ్రెస్‌గా శిల్పామోహన్‌రెడ్డి (ఎస్.చంద్రమోహన్‌రెడ్డి), కాంగ్రెస్ నుంచి గడ్డం అబ్దుల్ ఖాదర్, బిసి యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థిగా గాజుల అబ్దుల్ సత్తార్, రాయలసీమ పరిరక్షణ సమితి నుంచి భవనాశి పుల్లయ్య, సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి రాఘవేంద్ర, నవతరం పార్టీ నుంచి రావు సుబ్రహ్మణ్యం, రాజ్యాధికార పార్టీ నుంచి రెడ్డప్ప వలిగట్ల, అన్న వైఎస్ఆర్ పార్టీనుంచి షేక్ మహబూబ్ బాష, స్వతంత్ర అభ్యర్థులుగా పి.గురువయ్య, బాలసుబ్బయ్య, భూపనపాటి నరసింహులు, ఎస్.రఘునాథరెడ్డి, నాగనవీన్ ముద్దం, సంగా లక్షికాంతరెడ్డిలు బరిలో నిలిచారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమం

వైఎస్ జగన్ ట్వీట్


ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మోసగాళ్లారా, దోపిడీ పాలకులారా, ప్రజావంచకులారా 'క్విట్ ఏపీ' అంటూ ఉద్యమించాల్సిన సమయమాసన్నమయ్యిందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక పాత్ర పోషించిన 'క్విట్ ఇండియా' స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. 'క్విట్ ఇండియా' ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ట్విట్టర్ ద్వారా స్పందించిన ఆయన ఒక భారతీయుడిగా క్విట్ ఇండియా ఉద్యమానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. నాటి క్విట్ ఇండియా ఉద్యమం నిరంతరం స్ఫూర్తినిస్తూనే ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

వర్షాభావ ప్రాంతాల్లో సిఎం పర్యటించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో



వర్షాభావ ప్రాంతాల్లో ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటించి వెంటనే కరువు నివారణా చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల కోసం నంద్యాలలో తిష్టవేసిన మంత్రుల్ని అక్కడి నుంచి పంపించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడలోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం దాసరిభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 237 మండలాల్లో వర్షాభావ పరిస్థితులున్నాయని రెవెన్యూ శాఖ చెబుతున్నా ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉందన్నారు. ఇటీవల తాను అనంతపురం జిల్లాలో పర్యటించానని, అనేక ప్రాంతాల్లో నీరందక వేరుశనగ, కంది, జొన్న పంటలు ఎండిపోవడం కనిపించిందన్నారు. రాష్ట్రంలో వేరుశనగ 23 లక్షల ఎకరాలకు గాను కేవలం 8.32 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారన్నారు. అవి కూడా ఎండిపోయాయన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల శ్రీశైలంకు నీరు రాలేదన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారానికి ఈనెల 16 నుండి ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. సమస్యలను 4 నెలల్లో పరిష్కరిస్తామన్న సీఎం హామీ అమలుకు నోచుకోలేదన్నారు. గరగపర్రు సమస్యకు ఈ నెల 17లోపు పరిష్కారం చూపాలన్నారు.

వంశధార ప్రాజెక్టు కోసం భూములు, ఆస్తులు వదులుకున్న నిర్వాసితుల పట్ల ప్రభుత్వం క్రూరంగా వ్యవహరిస్తోంది. ఉన్నపళంగా గ్రామాలను ఖాళీ చేయాలంటూ నిర్బంధం ప్రయోగిస్తోంది. ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదని, సమస్యలను పరిష్కరిస్తే తామే గ్రామాలను ఖాళీ చేసి వెళ్లిపోతామని ప్రాధేయపడుతున్నా ససేమిరా అంటోంది. కట్టుబట్టలతో పొమ్మంటోంది. గ్రామాలను ఖాళీ చేయని నిర్వాసితులకు చుక్కలను చూపెడుతోంది. నిర్వాసిత ప్రాంతాల్లో సంక్షేమ పథకాలను నిలిపేసింది. నిర్వాసితుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో వాటిని పునరుద్ధరించింది. గ్రామ పొలిమేరలు, రహదారుల్లో భారీగా పోలీసులను మోహరించి భయభ్రాంతులకు గురి చేస్తోంది. నిర్వాసితుల ఇష్టానికి వ్యతిరేకంగా పోలీస్ బందోబస్తు మధ్య పనులు పునఃప్రారంభించింది. నిర్వాసిత గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులు, వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజాశక్తి కథనం.


పనులు జరుగుతున్న ప్రాంతంలో మోహరించిన పోలీసులు

వంశధార నిర్వాసితులపై నిర్బంధం

- కోర్టు ఆదేశాలు భేఖాతరు
- పోలీసు బలగాల సాయంతో పనులు
- గ్రామాల నుంచి ఉన్న పళంగా పొమ్మంటున్న ప్రభుత్వం
- అపరిష్కృతంగా సమస్యలు
- పరిహారం, ప్యాకేజీల్లో జరగని న్యాయం
- 2013 భూసేకరణ వర్తింపజేయాలంటున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

భూసేకరణ చట్టం-2013 ప్రకారం ప్రభుత్వం ఏదైనా అవసరాల కోసం భూమి తీసుకుంటే ఐదేళ్లలోపు దానిని వినియోగించాలి. లేకుంటే వాస్తవ సాగుదారుడే దానికి హక్కుదారుడవుతాడని చట్టం చెప్తోంది. 2013 చట్టాన్ని అమలు చేసేది లేదంటూ ప్రభుత్వం ధిక్కరిస్తోంది. తమ భూములను ప్రభుత్వం నిర్ధిష్ట కాలపరిమితిలో వినియోగించనందున తాము 2013 భూసేకరణ చట్టానికి అర్హులమేనంటూ హిరమండలం మండలం బ్యారేజీ సెంటర్‌కు చెందిన కొంతమంది నిర్వా సితులు హైకోర్టును ఆశ్రయించారు. దీనికి కౌంటర్‌గా భూములు స్వాధీనం చేసుకున్నామని, గ్రామాలు ఖాళీ చేయించేశామని ప్రభుత్వం హైకోర్టులో అఫిడవిట్ సమర్పించింది. దీనిపై నిర్వాసితులు అదే గ్రామంలో ఉంటున్నామని, భూములను సాగు చేసుకుంటున్నామని కోర్టుకు తెలియజేస్తూ అందుకు సంబంధించిన ఆధారాలు సమర్పించారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా తీర్పు ఇవ్వాలంటూ జిల్లా కోర్టుకు హైకోర్టు కేసును బదిలీ చేసింది. కోర్టుకు సమర్పించిన తప్పుడు నివేదికలను నిజం చేసేందుకు ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలకు పాల్పడుతోంది. నిర్వాసిత గ్రామాలను యుద్ధప్రాతి పదికన ఖాళీ చేసేందుకు ప్రయత్ని స్తోంది. రేషన్, పింఛన్, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ వంటి కార్యక్రమాలను నిలిపేసింది. నిర్వాసితుల ఆందోళనలతో దిగొచ్చిన ప్రభుత్వం మంగళవారం నుంచి సంక్షేమ పథకాలను పునరుద్ధరించింది. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాల పంపిణీ ఆపేసింది.

కోర్టు ధిక్కరణకు పాల్పడుతున్న ప్రభుత్వం

జలాశయ నిర్మాణ పనుల్లో భాగంగా తులగాం, గార్లపాడు గెడ్డ, హిరమండలం రోడ్డు కూడలి పనులు చేపట్టాల్సి ఉంటుంది. తులగాం గెడ్డ, గార్లపాడు గెడ్డలను మూసివేస్తే జలాశయంలోకి నీరు విడిచిపెట్టకపోయినా పాడలి, దుగ్గుపురం, తులగాం, గార్లపాడు గ్రామాలను గెడ్డనీరు ముంచెత్తుతుంది. తమ సమస్యలను పరిష్కరించకుండా, గ్రామాలను ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను నిలువరించాలని దుగ్గుపురం గ్రామానికి చెందిన టి.పోలినాయుడు, పి.నారాయణరావు, శాంతారావు, తిరుపతిరావు హైకోర్టును ఆశ్రయించారు. యథాస్థితిని కొనసాగించాలంటూ హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. ఆ పనులకు సంబంధించి కోర్టు స్టే అమలులో ఉంటుండగానే మంగళవారం నుంచి తులగాం గెడ్డ పనులను పోలీసు బలగాల సాయంతో కొనసాగిస్తూ ప్రభుత్వం కోర్టు ధిక్కరణకు పాల్పడుతోంది.


పనులు ఆపాలంటూ కోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ కాపీ

అప్పుడే ఖర్చయిపోయిన డబ్బులు

భూములకు పరిహారంగా చాలా నామమాత్రపు ధరలను ప్రభుత్వం నిర్ణయించింది. ఎకరా భూమికి రూ.1.10 లక్షల నుంచి 1.30 లక్షల వరకూ పలు దఫాలుగా 2009 సంవత్సరం వరకూ చెల్లించింది. రెండో విడతలో ఇళ్ల విలువ లెక్కించి డబ్బులు అందజేసింది. భూములు, ఇళ్ల పరిహారం, వృత్తి ప్యాకేజీ డబ్బులను ఒకేసారి చెల్లించకపోవడంతో ఆ డబ్బులు అప్పట్లోనే ఖర్చయిపోయాయి. వారిలో కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చినా, ప్రస్తుతం వారి వద్ద చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో ఇళ్లు కట్టుకోలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు.

యూత్ ప్యాకేజీలోనూ సమస్యలు

నిర్వాసిత కుటుంబాలకు యూత్ ప్యాకేజీ కింద ప్రభుత్వం ప్రస్తుతం రూ.ఐదు లక్షలు అందిస్తోంది. కొన్ని రైతు కుటుంబాల్లో పద్దెనిమిదేళ్లు నిండిన వారు లేకపోవడంతో అటువంటి వారు ఆ డబ్బులకు నోచుకోలేకపోతున్నారు. హిరమండలం, కొత్తూరు మండలాల్లోని నిర్వాసిత ప్రాంతాల్లో ఇటువంటి కుటుంబాలు సుమారు 1500 ఉన్నాయి. మొత్తం 4,271 మందికి యూత్ ప్యాకేజీ అందించాల్సి ఉంది. వివిధ కారణాలతో 700 మందికి డబ్బులను ఆపేశారు. తమకు ఏదో ఒక ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. కొత్తగా ప్యాకేజీలు ఇవ్వబోమంటూ ప్రభుత్వం కరాఖండిగా చెప్పింది. దీంతో వారికి కట్టుబట్టలు తప్ప మరేమి లేకపోవడంతో ఎక్కడికి వెళ్లాలో, ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు.

ఉన్న పళంగా ఖాళీ చేయించే ప్రయత్నాలు

ప్రభుత్వం 2006లో 7,104 కుటుంబాలను ప్రాజెక్టు తరలింపు కుటుంబాలు (పిడిఎఫ్)గా గుర్తించింది. వాటిలో 6,858 కుటుంబాలు ఇళ్ల పట్టాలకు అర్హమైనవిగా నిర్ధారించింది. 4,785 కుటుంబాలకు మాత్రమే పట్టాలు అందజేసింది. కొండ ప్రాంతాల్లో, నివాసయోగ్యంగా లేని ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలను అందజేశారంటూ 2,073 మంది తిరస్కరించారు. ఇటువంటి వారందరికీ ఈ ఏడాది మార్చిలో విడతల వారీగా రూ.ఐదు లక్షల చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. ఈ డబ్బులతో స్థలం కూడా రాని పరిస్థితుల్లో ఇళ్ల నిర్మాణం వీరికి అసాధ్యంగా మారింది. ఇళ్ల పట్టాలు పొందిన కుటుంబాల్లో సుమారు 500 కుటుంబాలు మాత్రమే పునరావాస కాలనీలకు తరలివెళ్లాయి. మిగిలిన కుటుంబాలకు స్థలం ఇచ్చినప్పటికీ ఇళ్ల నిర్మాణానికి అప్పట్లో కేవలం రూ.53 వేలు చెల్లించడంతో ఇళ్లను నిర్మించుకోలేకపోయారు. నిర్వాసిత కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో పునరావాస కాలనీలకు వెళ్లేందుకు నిరాకరిస్తున్నారు. గ్రామాల నుంచి ఖాళీ చేయించేందుకు ప్రభుత్వం సిద్ధమవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ప్రాజెక్టు భూ వివరాలు

ఈ ప్రాజెక్టు నిర్మాణానికి 2,997.30 ఎకరాల భూములు అవసరమని ప్రభుత్వం ప్రతిపాదనలు రూపొందించింది. ఇందులో ప్రభుత్వ భూములు 939.04 ఎకరాలు, జిరాయితీ భూములు 2,058.26 ఎకరాలు ఉన్నాయి. 2006 సెప్టెంబర్ 19న భూ సేకరణ నోటిఫికేషన్ వెలువడింది. 2,965.46 ఎకరాలను సేకరించింది. ఇందులో జిరాయి భూములు 2,043.03 ఎకరాలు, ప్రభుత్వ భూములు 922.43 ఎకరాలు ఉన్నాయి.



నిర్బంధంతో నిర్వాసితుల బిక్కుబిక్కు

నిర్వాసిత గ్రామాల పొలిమేరల్లో పోలీసు బలగాలను మోహరించి ప్రభుత్వం నిర్వాసితులను భయభ్రాంతులకు గురి చేస్తోంది. ఏ క్షణాన ఏమి జరుగుతుందోనన్న భయంతో నిర్వాసితులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వారి కదలికలపై ప్రభుత్వం నిఘా పెట్టింది. ప్రధాన రోడ్ల కూడళ్లలో పోలీసు పికెట్లు ఏర్పాటు చేసింది. పనులను అడ్డుకుంటే అరెస్టులు చేసేందుకు వాహనాలను సిద్ధం చేసింది. అవసరమైతే భాష్పవాయు గోళాలను ప్రయోగించేందుకు వజ్ర వాహనాన్ని సిద్ధంగా ఉంచింది. రహదారులకు అడ్డంగా ఇనుక కంచెలు వేసింది. ప్రశ్నించి సంతృప్తి చెందాకే గ్రామస్తులకు గ్రామాల్లోకి వెళ్లడానికి పోలీసులు అనుమతి ఇస్తున్నారు. మరోపక్క పోలీసు బలగాల సాయంతో పనులను కొనసాగిస్తోంది.

కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్న ప్రభుత్వం

తులగాం, గార్లపాడు, రోడ్డు జంక్షన్ల పనులపై హైకోర్టు స్టే ఇచ్చింది. ప్రభుత్వం ఈ ఉత్తర్వులను ధిక్కరించి పనులు చేస్తోంది. భూ సేకరణ చట్టం ప్రకారం ప్రభుత్వ అవసరాల కోసం ఐదేళ్లలోపు భూమిని వినియోగించకపోతే భూ నిర్వాసితులే సాగుహక్కుదార్లు అవుతారు. వారందరికీ 2013 చట్టం వర్తించాల్సిందే. నిర్వాసితులకు సంబంధించి ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు. సమస్యలు పూర్తిగా పరిష్కారం కాకుండా ఇక్కడ నుంచి కదిలేది లేదు.

-టి.పోలినాయుడు, దుగ్గుపురం, హిరమండలం మండలం

రోడ్డున పడ్డాం



ఎకరా భూమికి అప్పుడెప్పుడో రూ.1.30 లక్షలు ఇచ్చారు. ఇంటి స్థలం ఇచ్చినా ఇల్లు కట్టుకోవడానికి డబ్బులు లేవు. ప్రభుత్వం ఉన్న పళంగా ఖాళీ చేయాలని చెప్తోంది. ఎక్కడికిపోవాలో అర్థం కావడం లేదు.

-టి.శ్రీనివాసరావు, పాడలి, హిరమండలం మండలం

ఇంటికి డబ్బులు ఇవ్వలేదు

నేను, నా భార్య కూలి పనులు చేసి బతుకుతున్నాం. మా ఇల్లు వేరే వారి పేరుతో రెవెన్యూ రికార్డుల్లో ఉండటంతో నాకు డబ్బులు ఇంతవరకూ ఇవ్వలేదు. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ప్రభుత్వం బలవంతంగా ఖాళీ చేయించాలని చూడటం సరికాదు.

- బి.వెంకటి, దుగ్గుపురం, హిరమండలం మండలం

ముగిసిన వాల్మీకి బోయ పాదయాత్ర

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

వాల్మీకి బోయలను ఎస్‌టిల్లో చేర్చాలనే డిమాండ్‌తో మంత్రాలయం నుంచి అమరావతి వరకూ నిర్వహించిన మహా పాదయాత్ర బుధవారం ముగిసింది. జూన్ ఒకటో తేదీన కర్నూలు జిల్లా మంత్రాలయం నుంచి ప్రారంభించిన పాదయాత్ర ఎనిమిది జిల్లాల మీదుగా 2100 కిలోమీటర్లు పూర్తి చేసి విజయవాడకు చేరుకుంది. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని ధర్నా చౌక్ వద్ద ముగింపు సభ నిర్వహించారు. సభలో ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ నాయుడు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని వాల్మీకి బోయ కులాన్ని ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

టిడిపిలో ముసలం
వైసిపి గూటికి ముగ్గురు ఎంఎల్‌సిలు?

ప్రజాశక్తి - తిరుపతి ప్రతినిధి

అధికార పార్టీలో ముసలం చోటు చేసుకుంది. నంద్యాల ఎన్నికల నేపథ్యంలో టిడిపికి చెందిన ఎంఎల్‌సి శిల్పా చక్రపాణిరెడ్డి పదవికి రాజీనామా చేస్తూ వైసిపి తీర్థం పుచ్చుకోవ డంతో అధినేత చంద్రబాబుకు మైండ్ బ్లాక్ అయ్యింది. ఇప్పటికే వివిధ కారణాల రీత్యా నెల్లూరుకు చెందిన ఎంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, అనంతపురానికి చెందిన గుణపాటి దీపక్‌రెడ్డిలను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. దీంతో ముగ్గురు ఎంఎల్‌సిలు ఇప్పటికి టిడిపికి దూరమయ్యారు. అద్దంకిలో కరణం బలరామ్, ఒంగోలు మాగుంట శ్రీనివాసులురెడ్డి, కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గానికి చెందిన రామసుబ్బారెడ్డిలు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. జగన్మోహన్‌రెడ్డి కూడా తమవైపు మళ్లించు కునేందుకు పావులు కదుపుతున్నారు. నంద్యాల ఫలితాలు వైసిపి వైపు మొగ్గు చూపితే మరింతమంది టిడిపి నుంచి జంప్ అయ్యే అవకాశాలు ఉన్నాయని చర్చ నడుస్తోంది.

దసరాలోగా ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి - గవర్నర్‌పేట (విజయవాడ)

దసరాలోపు విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసి యాత్రికులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని దుర్గగుడి పాలక మండలి చైర్మన్ యలమంచలి గౌరంగబాబు చెప్పారు. స్థానిక మాడపాటి సత్రంలో బుధవారం పాలక మండలి తొలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆలయ ఇఒ సూర్యకుమారితోపాటు ధర్మకర్తల మండలి సభ్యులు హాజరయ్యారు.

ఈ ఏడాదీ అంతేనా?

- సాగర్ ఆయకట్టుపై వీడని సందిగ్ధం
- ఎగువ నుంచి నీరు రాక రైతుల అయోమయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సాగర్ ఆయకట్టులో వరి సాగు చేయాలన్న రైతుల ఆశలు ఈ ఏడాదీ నెరవేరేలా లేవు. ఆల్మట్టి నుంచి శ్రీశైలంకు, అక్కడ నుంచి నాగార్జునసాగర్‌కు నీరు విడుదల కాకపోవడంతో సాగర్ జలాశయం వెలవెలబోతోంది. సాగర్‌లో గరిష్ట నీటి మట్టం 590 అడుగులు కాగా ప్రస్తుత నీటి మట్టం 500.1 అడుగుల వద్ద ఉంది. పులిచింతలలో గరిష్ట నీటి మట్టం 45 టిఎంసిలు కాగా ప్రస్తుతం 2.09 టిఎంసిల నీరు మాత్రమే ఉంది. సాగర్ ఆయకట్టు పరిధిలో సాగుకు కుడికాల్వ ద్వారా నీరు విడుదల చేయాల్సి ఉంది. నీటి మట్టం డెడ్ స్టోరేజీ స్థాయికి వెళ్లడం వల్ల తాగునీటికి తప్ప సాగునీరు ఇప్పట్లో విడుదల అయ్యే పరిస్థితి కనపడటం లేదు. నాలుగు సంవత్సరాలుగా సాగర్ ఆయ కట్టు పరిధిలో వరి సాగుకు అవకాశం ఇవ్వడం లేదు. ఖరీఫ్ ముగింపు వరకు వేచి చూడటం, చివరిలో వరికి నీరు ఇవ్వలే మని అధికారులు తమ నిస్సహాయతను వ్యక్తం చేయ డం పరిపాటిగా మారింది. అలాగే మిర్చి ధర పతనం కావడంతో ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో మిర్చి సాగుకు కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఈ ఏడాది పత్తి విస్తీర్ణం బాగా పెరుగుతుందని, మిర్చి విస్తీర్ణం తగ్గుతుందని అధికారుల అంచనా. గతేడాది 2.24 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకూ 12 వేల ఎకరాల్లోనే మిర్చి సాగు చేశారు. లక్ష ఎకరాల్లో అపరాలు సాగు చేయాలని అంచనాలు రూపొందించగా ఇప్పటి వరకూ 45 వేల ఎకరాల్లోనే సాగు చేశారు. డెల్టాలో ఈ నెలాఖరుకు వరినాట్లు పూర్తవుతాయని అంచనా వేస్తున్నారు.

అడపాదడపా వర్షాలతో ఊపందుకుంటున్న సేద్యం

గుంటూరు జిల్లాలో వ్యవసాయ పనులు క్రమంగా వేగం పుంజుకుంటున్నాయి. మూడు రోజులుగా అడపాదడపాగా కురుస్తున్న ఒక మోస్తరు వర్షాలతో వేసిన పంటలు నిలదొక్కుకుంటుండగా వేయాల్సిన రైతులకు వర్షాలు ఊరట నిస్తున్నాయి. జిల్లాలో 13.30 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఇప్పటి వరకూ ఐదు లక్షల ఎకరాల్లోనే వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఇందులో అత్యధికంగా 3.50 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. గతేడాది 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, ఈ ఏడాది ఐదు లక్షలకు పైగా పత్తి సాగు అవుతుందని అంచనా వేస్తున్నారు. డెల్టాలో ముందస్తుగా నాట్లు వేయాలన్న ప్రభుత్వ ఆలోచనను రైతులు అంతగా పట్టించు కోలేదు.

నామినేటెడ్‌లో గుంటూరుకు అగ్రతాంబూలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులు అత్యధికంగా గుంటూరు జిల్లా వారికే దక్కాయి. టిడిపి అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఇప్పటి వరకూ 10 మందికి ఈ పదవులు వరించాయి. రాజధాని జిల్లాలో ప్రస్తుతం 10 వేర్వేరు సంస్థలకు చైర్మన్లుగా కొనసాగుతున్నారు. వీరిలో 20 సూత్రాల ఆర్థిక కమిటీ చైర్మన్‌గా నర్సరావుపేటకు చెందిన యల్ల శ్రీనివాస శేష సాయిబాబు 2014లోనే నియమి తులయ్యారు. నామినేటెడ్ పదవులు పొందడంలో జిల్లాకు ఆయనకు తొలి అవకాశం దక్కింది. ఆయనతోపాటు గత ప్రభుత్వ హయంలో నియమితులైన మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఎండి హిదాయత్ టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత మళ్లీ ఆయనను కొనసాగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కార్మిక శాఖ పరిధిలో రాష్ట్ర కనీస వేతనాల సలహా కమిటీ చైర్మన్‌గా డొక్కా మాణిక్య వరప్రసాద్‌ను నియమించారు. ఇటీవల ఆయనను ఎమ్మెల్సీ పదవీ ఇచ్చారు. రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్‌గా వినుకొండకు చెందిన గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా గురజాలకు చెందిన గుంటుపల్లి నాగేశ్వరరావు, రాష్ట్ర కల్లుగీత కార్మిక ఆర్థిక సహాయ సంస్థ చైర్మన్‌గా బాపట్లకు చెందిన తాతా జయప్రకాష్ నారాయణ, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా తెనాలికి చెందిన నన్నపనేని రాజకుమారి గత ఏడాదిన్నరగా పదవుల్లో కొనసాగుతున్నారు. రిటైర్డు ఐఎఎస్ ఎంవి.కృష్ణారావును తొలగించిన తరువాత రేపల్లెకు చెందిన ఆనంద్ సూర్యను బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఆహార కమిషన్ చైర్మన్‌గా తాడికొండకు చెందిన జెఆర్ పుష్పరాజ్‌ను ఇటీవల నియమించారు. సోమ వారమే ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎపిపి ఎస్‌సి చైర్మన్‌గా వేమూరుకు చెందిన ప్రొఫెసర్ ఉదయ్ భాస్కర్‌ను కొనసాగుతున్నారు. 2013లో ఆప్కో చైర్మన్‌గా నియమితులైన మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావును 2015 ఫిబ్రవరి లో టిడిపిలోకి చేర్చుకుని ఆయనను ఈ పదవిలో కొంత కాలం కొనసా గించారు. 2016 ఆగస్టులో కడప జిల్లాకు చెందిన జి.శ్రీనివాస్‌కు ఆప్కో చైర్మన్ పదవి కట్టబెట్టారు.

ముద్రగడ పాదయాత్ర అడ్డగింత

ప్రజాశక్తి-కిర్లంపూడి, జగ్గంపేట (తూర్పుగోదావరి జిల్లా)

ముద్రగడ పాదయాత్రను పోలీసులు బుధవారం మరోసారి అడ్డుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలోని తన నివాసం నుంచి ముద్రగడ, కాపు జెఎసి నాయకులతో కలిసి పాదయాత్రకు బయల్దేరారు. జెఎసి నాయకులు కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసుకుని వచ్చారు. ఎప్పటిలాగే ముద్రగడ ఇంటి గేటువద్ద పోలీసులు వారిని అడ్డుకున్నారు. ముద్రగడ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసు అధికారులు చెబుతున్నదానికి చేస్తున్నదానికి ఎక్కడా పొంతన ఉండట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోనసీమ నుంచి తనను కలిసేందుకు బయల్దేరిన వారిని బుధవారం గృహనిర్బంధం చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎవరికీ వర్తించని నిబంధనలను తనపైనే ఎందుకు రుద్దుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిరోజులైనా పాదయాత్ర చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఆయన వెంట కాపు జెఎసి నాయకులు ఆకుల రామకృష్ణ, వాసిరెడ్డి ఏసుదాసు, గున్నా వెంకటరమణ తదితరులున్నారు.


అమలాపురంలో తలకిందులుగా నిరసన తెలుపుతున్న కాపు నాయకులు

పెళ్లి బృందానికి తప్పిన వరద ముప్పు!

ప్రజాశక్తి- ప్రకాశం యంత్రాంగం

ప్రకాశం జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు ఎడతెరపిలేకుండా కురిసిన వర్షానికి పలుచోట్ల రాకపోకలు స్తంభించాయి. పశ్చిమ ప్రాంతంలోని నల్లమల అడవుల్లో గుండ్లకమ్మవాగుకు వరదనీరు ఒక్కసారిగా పోటెత్తింది. నెమల్లిగుండ్ల రంగస్వామి దేవస్థానం వద్దకు వివాహ కార్యక్రమానికి వెళ్లిన ఓ పెళ్లి బృందం వరదలో చిక్కుకుంది. హుటాహుటినా తాము వచ్చిన లారీలో పెళ్లి బృందం తిరుగు ప్రయాణమయ్యారు. లచ్చుమ్మ దేవస్థానం దిగువన గుండ్లకమ్మవాగులో వరద ఉధృతి పెరగడంతో కొందరు భయంతో లారీ దిగి అవతలివైపు ఉండిపోయారు. డ్రైవర్ చాకచక్యంగా వాహనం నడిపి లారీలో కొందరిని ఒడ్డుకు చేర్చారు. వాగుకు అవతలివైపు చిక్కుకుపోయిన నూతన దంపతులతోపాటు సుమారు 70 మందిని అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు తాళ్ల సహాయంతో ఇవతలివైపుకు చేర్చారు. మేదరమెట్ల మండలంలోని అనమలమూరు గ్రామంలో భారీ వర్షానికి మట్టిగోడ కూలి 12 పొట్టేళ్లు మృతిచెందాయి. నాగులుప్పలపాడు మండలంలో భారీ వర్షానికి నాగన్నవాగు, పెద్దవాగు పొంగిపొర్లాయి.

శ్రామిక శంఖారావం

సంపాదకీయం


దేశ పురోభివృద్ధిలో కీలక పాత్ర వహించే కార్మికలోకం గతంలో ఎన్నడూ లేని విధంగా కష్టాలను ఎదుర్కొంటోంది. తాము అధికారంలోకి వస్తే మంచి రోజులు వచ్చేస్తాయంటూ.. ఎన్నికల ముందు ఊదర గొట్టిన నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం వచ్చిన తరువాత, ఈ కష్టాలు మరింతగా పెరిగాయి. చాలీ చాలని వేతనాలు, ఆకాశాన్నంటే నిత్యావసర సరకుల ధరలు తదితర సమస్యలకు, అదనంగా మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలతో అంతకన్నా తీవ్రమైన కష్టాలను కార్మికలోకం ఎదుర్కోవాల్సి వస్తోంది. అరకొర వేతనాలతో అంతంత మాత్రంగా ఉన్న ఉపాధి ఎప్పుడు ఊడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కార్మికుల న్యాయ బద్ధమైన కోరికలను ఏమాత్రమూ పట్టించుకోని సర్కారు, అదే సమయంలో పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మిక చట్టాల సవరణను చేపట్టింది. పెద్ద ఎత్తున అమలు చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలు ఉద్యోగ భద్రతను ప్రశ్నార్థకం చేశాయి. ఆ రంగాల కార్మికులకు చెల్లిస్తున్న నామ మాత్రపు వేతనాలు కనీస జీవనావసరాలకూ చాలని పరిస్థితి నెలకొంది. ఇవన్నీ ఒక ఎత్తయితే, ప్రపంచ బ్యాంకు ఆదేశాలతో పబ్లిక్ రంగ సంస్థలతో పాటు, రక్షణ, బ్యాంకింగ్, బీమా రంగాలను ఒక వ్యూహం ప్రకారం ప్రైవేటీకరించడానికి కేంద్ర సర్కారు పావులు కదుపుతున్న తీరు కార్మిక లోకాన్ని కలవరానికి గురి చేస్తోంది. దేశ భద్రతకు తీవ్ర హాని కలిగించే ఈ విధానాలను విడనాడాలని దేశ వ్యాప్తంగా కార్మికలోకం కొంతకాలంగా కేంద్ర ప్రభుత్వానికి చేస్తున్న విజ్ఞప్తులు చెవిటివాని ముందు శంఖం ఊదుతున్నట్లుగా మారుతున్నాయి.

ఈ నేపథ్యంలో బుధవారం దేశ రాజధానిలో సమావేశమైన కేంద్ర కార్మిక సంఘాలు కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా నవంబర్ 9,10,11 తేదీలలో ఢిల్లీ వేదికగా మహా ధర్నా నిర్వహించాలని నిర్ణయించాయి. అప్పటికీ స్పందించకపోతే నిరవధిక సమ్మెను చేపట్టాలని పిలుపునిచ్చాయి. ఈ సమావేశం నిర్వహించిన ఢిల్లీలోని కల్‌కతోరా స్టేడియం వివిధ రంగాల నుండి తరలి వచ్చిన ప్రతినిధులతో కిక్కిరిసి పోవడం దేశ వ్యాప్తంగా కార్మికలోకంలో వ్యక్తమవుతున్న ఆందోళనకు నిదర్శనం. వివిధ రంగాలకు చెందిన కార్మికులతో పాటు, ఐటి రంగ ఉద్యోగ ప్రతినిధులు కూడా ఈ సమావేశంలో భాగస్వాములు కావడం, కార్మికలోకంతో గొంతు కలపడం ఆహ్వానించదగ్గ పరిణామం.

నిర్లక్ష్య పూరిత, అణచివేత విధానాలకు నిరసనగా కార్మికలోకం గళం విప్పడం ఇదే మొదటిసారి కాదు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వ హయంలోనే దేశ వ్యాప్తంగా కార్మికలోకం ఆందోళన బాట పట్టింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కంటే భిన్నమైన పాలన అందిస్తామని అట్టహాసంగా ప్రచారం చేసిన బిజెపి, ఆచరణలో అవే విధానాలను కొనసాగిస్తోంది. మరో మాటలో చెప్పాలంటే కాంగ్రెస్ కన్నా వేగంగా పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వ్యతిరేక విధానాలను తెర మీదకు తీసుకొస్తోంది. దేశ వ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత వచ్చినప్పటికీ మోటారు వాహనాల సవరణ చట్టం–2017ను మందబలంతో పార్లమెంటులో ఆమోదించిన తీరే దీనికి నిదర్శనం. ఈ చట్టం అమలులోకి వస్తే రోడ్డు రవాణా రంగం మొత్తం గంపగుత్తగా ప్రైవేటీకరణకు గురవుతుందన్న ఆందోళనను కేంద్ర సర్కారు ఏ మాత్రమూ ఖాతరు చేయలేదు. రక్షణ, బ్యాంకు, బీమా రంగాల విషయంలోనూ కేంద్ర సర్కారుది ఇదే ధోరణి! ప్రైవేటీకరణ ప్రతిపాదనలకు వ్యతిరేకంగా ఇటీవల బ్యాంకు ఉద్యోగులు దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలను పట్టించుకున్న సూచనలేమీ కనిపించడం లేదు. పెరుగుతున్న ధరల నేపథ్యంలో కనీస వేతనాన్ని రూ. 18 వేలుగా నిర్ధారించాలన్న విజ్ఞప్తినీ కేంద్ర సర్కారు బుట్ట దాఖలు చేసింది.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని పదేపదే చేసిన విజ్ఞప్తులను మోడీ సర్కారు బుట్ట దాఖలు చేసింది. అనివార్య పరిస్థితుల్లో కార్మికులు 2015, 2016ల్లో దేశ వ్యాప్త సమ్మె నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సమ్మెల్లో కార్మికలోకం పెద్దఎత్తున భాగస్వామ్యమైంది. అయినా, కేంద్ర ప్రభుత్వ ధోరణిలో లేశమంతైనా మార్పు కనిపించకపోగా, ఆ తరహా విధానాలు మరింత ఉధృతం చేసింది. ఈ నేపథ్యంలో మరోసారి తీవ్ర స్థాయిలో ఆందోళనకు కార్మిక సంఘాలు సిద్ధమయ్యాయి. కేంద్ర ప్రభుత్వ అహంకార పూరిత విధానాల నేపథ్యంలో కార్మికలోకానికి ఇంతకుమించిన మరో మార్గం లేదు. ఢిల్లీలో మూడు రోజుల పాటు మహాధర్నా, అప్పటికీ స్పందించకపోతే నిరవధిక సమ్మె చేపట్టాలన్న కార్మిక సంఘాల నిర్ణయం దేశ కార్మికోద్యమ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. కార్మికలోకం పూరించిన ఈ శంఖారావాన్ని బలపరచడం దేశ ప్రజలందరి బాధ్యత!

మహనీయుల మాట



దురలవాట్లు మొదట్లో సాలెగూళ్ళలాంటివి. తర్వాత అవి ఇనుప గొలుసులై బంధిస్తాయి.

- లాంగ్ ఫెలో

ఏళ్లు గడుస్తున్నా రక్షణ సున్నా

ప్రజాగళం


స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ళు గడుస్తున్నా మహిళలకు రక్షణ కరువైంది. పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలు పూజ్యంగానే వున్నాయి. నామ మాత్రంగా రక్షణ కల్పించడానికి ఉద్దేశించిన చట్టాలు కూడా అమలు జరిగే పరిస్థితి లేదు. 1961లో వరకట్న నిషేధ చట్టం చేశారు. చట్టం తెచ్చి 56 ఏళ్ళవుతోంది. అయినా వరకట్న హత్యలు, మరణాలు, అదనపు కట్నం కోసం వేధింపులు వంటి వాటికి అడ్డుకట్ట పడటం లేదు. ఇప్పటికి దాదాపు 9.76 శాతం వరకట్న కేసులు నమోదయ్యాయి. నమోదు కాని కేసులు అంతకన్నా ఎక్కువ వుంటాయి. గృహహింస నిరోధక చట్టం వచ్చి 11 ఏళ్ళు అయ్యింది. అయితే ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఆరేళ్ళ తరువాత బిబిసి(బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్) చేసిన ఒక సర్వేలో భారత్‌లో 3,09,546 కేసులు నమోదైతే అందులో 1,18,866 కేసులు గృహహింసకు సంబంధించినవేనని తేలింది. దేశంలో మహిళలపై రెండు నిమిషాలకో నేరం జరుగుతుందని జాతీయ నేర రికార్డుల బ్యూరో 2015 నివేదిక తేల్చి చెప్పింది. మనకు స్వాతంత్ర్యం రాకముందే 1946లో బాల్య వివాహాల చట్టం చేశారు. కాని బాల్య వివాహాలపై యాక్షన్ ఎయిడ్ ఇండియా సొసైటీ 2011 జనగణన ప్రాతిపదికగా భారత్‌లో బాల్య వివాహాల నిర్మూలన పేరుతో విడుదల చేసిన నివేదికను పరిశీలిస్తే మనం పురోగమిస్తున్నామో, తిరోగమిస్తున్నామో తెలుస్తుంది.



ప్రపంచంలో బాల్య వివాహాలు చేసుకునే ప్రతి ముగ్గురిలో ఒకరు భారతీయులేనని ఈ నివేదిక పేర్కొంది. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో 75 శాతం బాల్య వివాహాలు జరుగుతున్నాయని మొత్తం 10 కోట్ల మంది భారతీయుల్లో 8.5 కోట్ల మంది బాలికలు 18 ఏళ్ళ వయస్సు రాకముందే వివాహం చేసుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. 2007–2011 మధ్య కాలంలో 82 శాతం బాల్య వివాహాలు గ్రామీణ ప్రాంతాల్లోనే జరిగాయని నివేదిక వెల్లడించింది. భారత్‌లో అత్యధిక బాల్య వివాహాలు జరిగే రాష్ట్రాల్లో అగ్రస్థానం ఉత్తర ప్రదేశ్ వుంటే ఆ తరువాతి స్థానంలో మన రాష్ట్రమే వుంది. దీన్ని బట్టే పరిస్థితి తీవ్రత అర్థమౌతోంది. ప్రభుత్వాలు ఇప్పటికైనా చట్టాలను, పటిష్టంగా అమలు పరచాలని ప్రశ్నించి, నిలదీద్దాం! ఐక్యంగా పోరాడదాం!

బి వేణు కుమారి, పమిడిముక్కల మండలం, కృష్ణాజిల్లా

ఎంత కాని కాలమొచ్చే కర్షకా



యావత్తు జాతికి పట్టెడన్నం పెట్టు వాడికి పుడమి మీద పుట్టగతుల్లేకుండా చేస్తున్నారు. ఆత్మహత్యలే శరణ్యమంటున్నా ఏలికలు పట్టించుకున్నది లేదు. ప్రపంచీకరణ పర్వంలో వరల్డు ట్రేడు పోటీకి తట్టుకుని బతుకుతావా చస్తావా అని అంటోంది కార్పొరేటు లోకం. భూములున్న వారంతా ఎప్పుడో దీని కన్నా నయమైన వ్యాపారాలు, వృత్తులు, ఉద్యోగాల వైపు వెళ్లిపోయారు. ఏ ఆధారం లేని అభాగ్యులే కౌలురైతులయ్యారు. ఆరుగాలం చేసిన శ్రమకు గిట్టుబాటు లేక అల్లాడుతున్నారు. తమ ఆశలు ఆవిరైపోతుంటే దిక్కుతోచని స్థితిలో బెంబేలెత్తుతున్నారు. భూ కామందుల నుంచి మందుల కొట్టుదాకా, ట్రాక్టరు నుంచి అరక వ్యవసాయం దాకా, కూలీల నుంచి విత్తనం దాకా అతివృష్టి నుంచి అనావృష్టి దాకా అప్పు పుట్టక అధిక వడ్డీలకు బలౌతున్నారు. మరో పక్క ఉపాధులు లేని అసంఖ్యాక జనమంతా బిక్కుబిక్కుమంటున్నారు. ఎన్నాళ్ళీ కూలి బతుకులు? వారి ఆశలు చిగురించేనా? బడాబాబుల ధనదాహానికి బలి కావాల్సిందేనా? చేసిన శ్రమంతా పరుల పాలవుతుంటే, తినడానికి తిండి లేక బతుకులీడుస్తున్న వారి గురించి ఆలోచించేవారే లేరా?

నంబూరు నాగేశ్వరరావు, గుంటూరు.

సర్కారీ వైద్యంపై విశ్వాసం పెంచాలి

రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ శ్రీమతి విజయకృష్ణన్ ఇటీవల రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో ప్రసవం చేయించుకున్నారు. తన భర్త (రంపచోడవరం ఐ.టి.డి.ఏ.ప్రాజెక్టు అధికారి దినేష్ కుమార్) సూచన మేరకు ప్రజలకు, ముఖ్యంగా గిరిజనులకు ప్రభుత్వ ఆస్పత్రులపై విశ్వాసం కల్పించడం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. బయటి వైద్యులనెవరినీ పిలవకుండా ఆసుపత్రిలోని వైద్యులే సిజేరియన్ ఆపరేషన్' నిర్వహించారు. అయితే ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం రావాలంటే మరి కొన్ని చర్యలు తీసుకోవాలి. ఆ అధికారిపై చూపించిన స్థాయిలో కాకపోయినా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు, సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల పట్ల తగిన శ్రద్ధ, ఆదరణ ప్రదర్శించాలి. వారి భయాలను, సందేహాలను తెలుసుకుని వారిని సమాధాన పరచాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో తగిన సౌకర్యాలు ఉన్నాయనే విషయాన్ని ప్రజలకు వివరించి చెప్పి, సమయానికి వారిని అక్కడికి తీసుకువెళ్ళడానికి ఆశాలు, ఏఎన్ఎంలను తగిన సంఖ్యలో నియమించి వారికి రవాణా సదుపాయాలు కల్పించాలి. ప్రజల భాగస్వామ్యంతో వీరి పనితీరుపై తగిన పర్యవేక్షణ ఉండాలి. గిరిజన గ్రామాలకు రోడ్డు, ప్రజా రవాణా సదుపాయాలు కల్పించాలి. ప్రజలకు దగ్గరగా ఉండే ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో వైద్య సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే వారు నాటు వైద్యులు, మూఢ నమ్మకాలను ఆశ్రయించకుండా ఆధునిక వైద్యం చేయించుకోవడానికి ముందుకు వస్తారు. ఈ విధమైన సమగ్ర చర్యలు చేపట్టడం ద్వారానే ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులపై, ఆధునిక చికిత్సా విధానాలపై నమ్మకం కలిగించగలం. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందాలనే విధంగా చట్టం చేయాలి.



డా ఎస్ సురేష్, డా ఎస్ సుధాకర్, ప్రజారోగ్య వేదిక

మెయిల్ @ ప్రజాశక్తి

ప్రజాశక్తి సంపాదక పేజీలో వ్యాసాలు మాత్రమే కాదు. వివిధ విషయాలపై మీ అభిప్రాయాలకు కూడా అవకాశం. మీరు అనుకునే ఏ సమస్య పైనైనా సరే- మరీ సుదీర్ఘం కాకుండా సూటిగా క్లుప్తంగా రాసి పంపించండి లేదా ఇ మెయిల్ చేయండి. వెంటనే ప్రచురిస్తాం.

ఇ- మెయిల్ అడ్రస్ : **editpageps@gmail.com**

ప్రభుత్వ విద్యకు నిధుల కేటాయింపు



ప్రభాత్ పట్నాయక్

ప్రజా ప్రభాతం

కేంద్ర ప్రభుత్వం రూపొందించనున్న జాతీయ విద్యా విధానానికి సంబంధించిన డ్రాఫ్ట్ ఒక విచిత్రమైన అంశాన్ని ప్రతిపాదించింది. విద్యకు స్థూల జాతీయోత్పత్తిలో కనీసం ఆరు శాతం కేటాయించాలనే అవగాహన 'కొఠారీ కమిషన్' నాటి నుంచి ఉంది. అయితే ప్రభుత్వ ఉదాసీనత వల్ల ఇన్నేళ్ళ తరువాత కూడా ఇది కలగానే మిగిలిపోయింది. కాబట్టి ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే విద్యా రంగం లోకి ప్రయివేటు రంగాన్ని తీసుకు రావాలని, సానుకూలంగా ఆలోచించేవారందరూ భావిస్తారట. అంటే విద్యా రంగాన్ని ప్రయివేటీకరించటమే. ఇది ఒక వికారపు ఆలోచన. ఏ ఉత్కృష్ట లక్ష్యాన్ని చేరుకోవటానికైతే ఒక సాధనాన్ని ఉపయోగం చదలిచావో అంతిమంగా ఆ సాధనం ఆ లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తుంది. ఈ వాదన ఇలాంటి ఉదాహరణను పోలి వుంటుంది. ప్రతి భారతీయుడికీ ఆరోగ్య సంరక్షణను అందించాలంటే వర్తమాన స్థూల జాతీయోత్పత్తిలో ఆరోగ్య సంరక్షణా రంగానికి చేస్తున్న కేటాయింపులను పెంచవలసి వుంటుంది. మన పరిమిత ఆర్థిక వనరుల కారణంగా ఇలా చేయటం సాధ్యపడదు. కనుక ఆరోగ్య సంరక్షణను ప్రయివేటీకరించాలి. అయితే ఇక్కడ 'అందరికీ ఆరోగ్యం' అనే అత్యున్నత లక్ష్యాన్ని చేరుకోవటానికి ఉపయోగించదలచిన 'ప్రయివేటీకరణ' అనే సాధనం వల్ల అసలు లక్ష్యం నీరుగారుతుంది. ప్రయివేటీకరణ వల్ల ఆరోగ్య సంరక్షణకు చేయవలసిన వ్యయం చాలా మందికి అందుబాటులో లేనంత ఎక్కువగా ఉంటుంది. ఇదే తర్కం విద్యా రంగానికి కూడా వర్తిస్తుంది. ప్రజా సంక్షేమం పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసే చర్యను సమర్థించేదిగా ఈ వాదన ఉంటుంది. ఆచరణాత్మక పరిష్కారంగా ముందుకు వస్తున్న ఈ వాదనను గట్టిగా తిరస్కరించవలసిన అవసరం ఉంది. దీనికి ఒక స్పష్టమైన, ఒక అస్పష్టమైన కారణం వుంది. ఇంతకు ముందే పేర్కొన్న స్పష్టమైన కారణం ఏమంటే విద్యను ఏవిధంగా ప్రయివేటీకరించినా దానిని పొందటానికి అయ్యే ఖర్చు పెరుగుతుంది. పర్యవసానంగా పేదలు ఆ పరిధి నుంచి మినహాయింపబడతారు. కాబట్టి ప్రజాస్వామ్యంలో ఉండవలసిన సమాన అవకాశాలు అనే మౌలిక విలువకు ఇది వ్యతిరేకం అవుతుంది. వర్తమాన భారత సమాజంలో నిజమైన సమాన అవకాశాలు లేవనేది సుస్పష్టం. అలానే పెట్టుబడిదారీ అభివృద్ధి మార్గాన్ని అనుసరించే ఏ సమాజంలో కూడా నిజమైన సమానావకాశాలు ఉండవు. అయితే విద్యను ప్రయివేటీకరించటంతో చేరుకోవలసిన లక్ష్యాల పట్టిక నుంచి కూడా సమాన అవకాశాలు అనే అంశం తొలగించబడుతుంది. ఇది అసమానతను ఆమోదయోగ్యం చేస్తుంది. అంటే అది మన రాజ్యాంగంపైన భావనాపరమైన దాడిగా మారుతుంది. ప్రయివేటీకరణ సమర్థకులు ఇక్కడ రెండు విషయాలను చెబుతారు. మొదటిది, ప్రయివేటీకరణతో విద్య మరింత ప్రియం అయినప్పటికీ విద్యార్థులకు చదువుకోవటానికి అప్పు చేసే వీలుంటుంది. విద్యాభ్యాసం పూర్తయి ఉద్యోగంలో చేరిన తరువాత విద్యార్థులు ఆ అప్పును తీర్చుకునే వీలుంటుంది. అప్పు చేయటానికి వీలున్నంత వరకూ విద్యాభ్యాసం నుంచి ఎవరూ మినహాయింపబడరు. అయితే ఇది పూర్తిగా తప్పు తోవ పట్టించే వాదన.

ఒకవేళ చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం వస్తుందనే గ్యారంటీ ఉంటే... ఈ వాదన తప్పయినా కొంత వరకు సమర్థించవచ్చు. కానీ కనీవినీ ఎరుగని రీతిలో నిరుద్యోగం ప్రబలిన నేటి సమాజంలో ఈ వాదన సమర్థనీయం కాదు. అప్పు చేసి చదువుకున్న పేద విద్యార్థికి ఉద్యోగం రాకపోతే తాను తీసుకున్న అప్పును తిరిగి చెల్లించలేడు. కాబట్టి తీసుకున్న అప్పును తిరిగి చెల్లించమని చేసే వత్తిడి విద్యార్థులలో నిస్పృహ పెరగటానికి దారి తీస్తుంది. ఇది ఒక రకంగా దేశం లోని రైతుల దుస్థితిని తలపిస్తుంది. ఎందుకంటే తీసుకున్న అప్పులను తీర్చలేక గత రెండు దశాబ్దాలుగా మూడు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ప్రయివేటీకరించిన విద్యావ్యవస్థలో చదువుకోవటానికి అప్పు చేయవచ్చనే హామీ పూర్తిగా పనికి మాలినది. కాబట్టి దీనిని గట్టిగా తిరస్కరించాలి. ప్రయివేటు విద్యా సంస్థలలో చదువుకునేవారికి ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలనేది ... విద్యను ప్రయివేటీకరించటాన్ని సమర్థించేవారు చేస్తున్న రెండవ వాదన. నిజానికి ఇలాంటిదే చాలా చోట్ల జరుగుతున్నది. దాంతో ప్రభుత్వం చెల్లిస్తుందన్న కారణంగా ప్రయివేటు విద్యా సంస్థలు ఫీజులను విపరీతంగా పెంచటం వంటి వికృత పర్యవసానాలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు కేరళలో దళిత విద్యార్థులు ఇతర విద్యార్థుల కంటే ఎక్కువ ఫీజు కడుతున్నారు. ఫలితంగా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు పెరిగి ప్రయివేటు విద్యా సంస్థల లాభాలు పెరగటానికి దారితీస్తున్నది. అయితే ఇలా 'ప్రయివేటు' లాభాలను పెంచటానికి ఉపయోగపడే కేటాయింపులకు బదులుగా ప్రభుత్వమే విద్యను అందించే బాధ్యతను తీసుకుంటే బాగుంటుంది. ఇప్పటి వరకూ మనం ప్రయివేటు విద్యకు అయ్యే ఖర్చును భరించలేక, మినహాయింపబడే పేద విద్యార్థుల సమస్యను గురించి చర్చించాం. అయితే ఈవిధమైన ఆర్థిక సంబంధ మినహాయింపు కాకుండా అడ్మిషన్లలో 'రిజర్వేషన్లను' అమలు చేయకపోవటమనే ప్రత్యక్ష మినహాయింపును ప్రయివేటు విద్యా సంస్థలు అమలు చేస్తున్నాయి. దీనికి కారణం బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులకు 'రిజర్వేషన్లు' ఇవ్వవలసిన అవసరాన్ని ప్రయివేటు విద్యా సంస్థలు గుర్తించకపోవటమే. విద్య ప్రయివేటీకరణను తిరస్కరించటానికి ఒక కారణమేమంటే మన దేశానికి కావలసిన విద్య ప్రయివేటు సంస్థలు అందించే విద్యకు భిన్నంగా ఉంటుంది. మన సమాజంలో విద్య ధ్యేయం ప్రజల పక్షం వహించే 'మేధావుల 'ను ఉత్పత్తి చేసేదిగా ఉండాలి. అంటే... చారిత్రకంగా కులం ఆధారంగా వ్యవస్థీకృత అసమానతలు గల దేశం... వలస వ్యతిరేక పోరాటం ద్వారా తన గతానికి భిన్నమైన విలువలను పునాదిగా చేసుకుని 'ఆధునిక' సమాజంగా తనకు తాను పునఃవ్యవస్థీకృతం అవుతున్న ప్రక్రియకు రక్షణగా నిలబడటానికి కంకణబద్ధులైన మేధావులను తయారు చేసే విద్య మనకు కావాలి. ఈ 'మేధావులు' సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేసే వారి నుంచే కాకుండా ఇంజినీర్లు, డాక్టర్లు, వివిధ వృత్తులకు చెందిన వారి నుంచి కూడా ఉత్పత్తి కావాలి. అటువంటి మేధావులు లేకపోతే నూతన భారతదేశ సృష్టి జరగదు. అంతేకాకుండా అనేక మూడవ ప్రపంచ దేశాల మాదిరిగా మన దేశం ఒక 'విఫల రాజ్యం'గా మారుతుంది. ప్రయివేటీకరించిన విద్యా వ్యవస్థ సరుకుగా మారుతుంది. అది 'ప్రజా మేధావుల'కు బదులుగా 'అంతర్జాతీయ పెట్టుబడిని బలపరిచే మేధావుల'ను సృష్టిస్తుంది. వీరిలో సామాజిక సునిసితత్వం ఉండదు. వీరు వ్యక్తిగత స్వార్థపూరిత లక్ష్యాలతో ఉంటారు. ప్రపంచీకరింపబడిన పెట్టుబడి ఆధిపత్యం లోని నయా ఉదారవాద క్రమాన్ని పరిరక్షిస్తూ తమ పదోన్నతి కోసం ఈ మేధావులు పాటుపడుతుంటారు. వీరి స్వార్థపూరిత ఆకాంక్షలకు హిందుత్వ ఆధిపత్యవాదం, అగ్రకుల విలువలు పూర్తి అనుకూలంగా ఉంటాయి. క్లుప్తంగా చెప్పాలంటే విద్యారంగ ప్రయివేటీకరణ... సేచ్ఛా భారత నిర్మాణాన్ని నిర్వీర్యం చేసేదిగా ఉంటుంది. అయితే ప్రయివేటీకరణ లేకుండా విద్యా రంగానికి కావలసిన వనరులను సమకూర్చగలమా? అని ఎవరైనా అడగవచ్చు. అయితే అసలు ఈ ప్రశ్న అడగటమే మూర్ఖత్వం అవుతుంది. ఒకవేళ విద్యారంగ ప్రయివేటీకరణ తగిన వనరులను సమీకరించగలిగినప్పుడు ఆ వనరులు దేశం లోనే ఉండివుంటాయి కదా. ఇవే వనరులను సమీకరించి ప్రభుత్వమే ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థను (దాతల ఔదార్యంతో నిర్మించే విద్యా సంస్థలు కూడా వీటిలో భాగమే) ఎందుకు నిర్మించకూడదు?

స్థూల జాతీయోత్పత్తిలో పన్నుల నిష్పత్తి అత్యంత కనిష్టంగా వున్న దేశాలలో భారతదేశం ఒకటి. భారత దేశంలో ధనవంతులు కట్టే పన్నులు నామమాత్రమేనంటే ఆశ్చర్యపోనక్కరలేదు. సంపదపై పన్ను, పెట్టుబడి పై వచ్చే లాభాలపై పన్ను పేరుకే ఉన్నాయి. ఆదాయపు పన్ను కూడా అంతంత మాత్రమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం ప్రధానంగా పరోక్ష పన్నుల ద్వారానే వస్తుంది. పైకి చూడటానికి పరోక్ష పన్నులను అందరూ భరిస్తున్నట్టు ఉంటుంది. కానీ అది నిజం కాదు. ఉదాహరణకు టైర్లపై ఎక్సైజ్ డ్యూటీని కార్లు, ట్రక్కుల యజమానులు కడుతున్నట్టు కనపడుతుంది. కానీ వాస్తవంలో రవాణా ఖర్చులను అధికంగా వసూలు చేయటం ద్వారా ఈ భారాన్ని సామాన్య ప్రజలపైకి నెడతారు. అత్యవసర సరుకుల విషయంలో కూడా ఇదే జరుగుతుంది. క్లుప్తంగా చెప్పాలంటే ... ఈ దేశంలో పన్నుల భారంలో గణనీయమైన భాగాన్ని పేదలే మోస్తున్నారు. ధనికులు దీని నుంచి మినహాయింపబడ్డారు. ఈ ప్రక్రియ నయా ఉదారవాద శకంలో మరింతగా బలపడింది. అంతకు ముందు కాలంలో పన్నుల వ్యవస్థ తిరోగామిగా ఉండేది. దానిని పురోగామిగా చేయాలని భావించేవారు. అయితే నయా వుదారవాద శకంలో వృద్ధి పేరుతో, 'మేక్ ఇన్ ఇండియా' వంటి నినాదాల పేరుతో పన్నుల వ్యవస్థ పూర్తి స్థాయిలో తిరోగామిగా ఉండటాన్ని సమర్థిస్తున్నారు. ప్రభుత్వం చేతుల్లో తగినన్ని వనరులు లేనందున విద్యను ప్రయివేటీకరించాలనటం చాలా ప్రమాదకరమైన వాదన. అంతేగాక ఇది తార్కికంగా స్వీయ వైరుధ్యంతో కూడినది కూడా. ఎందుకంటే విద్యా రంగానికి కావలసిన నిధులు ఏక కాలంలో ఒక వైపు దేశంలో ఉన్నాయనటం, మరో వైపు లేవనటంతో ఇది సమానం. వనరులు వుంటే ప్రభుత్వం తన సార్వభౌమాధికారంతో పన్నులను విధించి వనరులను సమీకరించాల్సి ఉంటుంది. రక్షణ రంగం వంటి రంగం గురించి మనం మాట్లాడటం మొదలెట్టినప్పుడు అలాంటి వాదనలోని మూర్ఖత్వం తక్షణమే బయట పడుతుంది. వనరుల కొరత వల్ల సైనిక బలగాలను ప్రయివేటీకరించవలసి ఉంటుందని ఒకవేళ ప్రభుత్వం ప్రకటిస్తే దానికి వ్యతిరేకంగా పెద్ద దుమారమే లేస్తుంది. కానీ విద్య విషయంలో అటువంటిదే చెబితే తెలివైన వారు సైతం దానిని పూర్తిగా ఆమోదయోగ్యమైన వాదనగా అంగీకరిస్తారు. ఇలా వాదించటం మూర్ఖత్వం. ఈ వాదనను విస్తృతంగా అంగీకరించటం ఆందోళన కలిగించే విషయం. ★



> **ప్రభుత్వం చేతుల్లో తగినన్ని వనరులు లేనందున విద్యను ప్రయివేటీకరించాలనటం చాలా ప్రమాదకరమైన వాదన. అంతేగాక ఇది తార్కికంగా స్వీయ వైరుధ్యంతో కూడినది కూడా. ఎందుకంటే విద్యా రంగానికి కావలసిన నిధులు ఏక కాలంలో ఒక వైపు దేశంలో ఉన్నాయనటం, మరో వైపు లేవనటంతో ఇది సమానం. వనరులు వుంటే ప్రభుత్వం తన సార్వభౌమాధికారంతో పన్నులను విధించి వనరులను సమీకరించాల్సి ఉంటుంది.**

సామాజిక విలువల బోధన ముఖ్యం



డాక్టర్ చుక్కా రామయ్య

విశ్లేషణ

మారుతున్న కాలం.. రోజురోజుకూ పెరుగుతున్న సాంకేతికత.. ఒక్క క్లిక్కుతోనే కావాల్సిన ఏ వస్తువునైనా గంటల వ్యవధి లోనే తెప్పించుకొనే అవకాశం.. ఇదీ.. నేటి యువతరానికి ఉన్న గొప్ప సౌలభ్యం. దాన్ని వారు మంచి పద్ధతుల్లో వినియోగించుకుంటే అద్భుతాలు సష్టిస్తూ జీవితంలో రాణిస్తారు. అలా కాకుండా చెడు మార్గాలను అన్వేషిస్తే జీవితం అంధకారం అవుతుంది.

అయితే, ఇటీవల హైదరాబాద్ సహా రాష్ట్రంలోని చిన్నచిన్న పట్టణాల్లోనూ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటు పడ్డారనే వార్తలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. తెలిసీ తెలియని పసి మనసులు కలిగిన విద్యార్థులు ఈ మత్తు మహమ్మారికి బలై తమ బతుకుల్ని ఛిద్రం చేసుకుంటున్నారు. తోటి పిల్లలతో ఆడుకోవాల్సిన వయసులో.. ప్రపంచాన్ని అర్థం చేసుకోవాల్సిన అత్యంత కీలకమైన సమయంలో వారు ఈ డ్రగ్స్‌ను ఎందుకు ఆశ్రయిస్తున్నారు? ఈ నవ జీవనమే లక్ష్యంగా సాగిస్తున్న అగమ్య ప్రయాణంలో క్షణం తీరికలేకుండా పరుగులు తీస్తున్న సమాజానిదా? తమ పిల్లలు ఎటు వెళ్తున్నారో, ఏం చేస్తున్నారో, ఎవరితో స్నేహం చేస్తున్నారో తెలుసుకోలేని పరిస్థితుల్లో ఉన్న తల్లిదండ్రులదా? ఈ అంశంపై ప్రస్తుతం యావత్ సమాజం తక్షణమే దష్టి పెట్టాల్సిన సందర్భమిది. చాప కింద నీరులా కొనసాగుతోన్న ఈ డ్రగ్స్ మాఫియా కార్యకలాపాలపై నెల రోజులుగా నిఘా వుంచి మత్తు మహమ్మారి నుంచి పిల్లల భవిష్యత్తును కాపాడినందుకు గాను ఆబ్కారీ శాఖ డైరెక్టర్ అకున్ సబర్వాల్ అభినందనీయులు.

కళాశాలలు, పాఠశాలల్లో చెప్పే పాఠాలు అర్థం కాకపోవడం, భారమైన చదువులు, నిరుద్యోగం, ఇంట్లో తల్లిదండ్రుల ఒత్తిడి, సరైన కేర్ లేకపోవడంతో పిల్లలు తాత్కాలిక ఉపశమనం కల్గించే డ్రగ్స్ వైపు మళ్లుతున్నట్టు పలువురు మానసిక నిపుణులు చెబుతున్నారు. అస్తవ్యస్తంగా ఉన్న మన విద్యావిధానంతో విద్యార్థి తీవ్ర గందరగోళానికి గురవుతున్నాడు. కుటుంబం నుంచి ఒత్తిళ్లు పెరుగుతుండటంతో ఏం చేయాలో తెలియని యువకులు పెడ ధోరణులకు అలవాటు పడుతున్నారు. ఈ నేపథ్యంలో డ్రగ్స్‌కు అలవాటు పడే విద్యార్థులను శిక్షించడం కాకుండా వారిలో పరివర్తన తీసుకొచ్చేందుకు యంత్రాంగం కషి చేయాలి. విదేశీ సంస్కతి మోజులో పడుతున్న నేటి యువత పబ్‌లు, లాంజ్‌లు, కాఫీ షాప్‌లు, ఐస్‌క్రీం పార్లర్లకు వెళ్తుండటంతో అక్కడి వారితో పెరుగుతున్న పరిచయాలు, చెడు స్నేహాలు కుర్రకారును మత్తులో ముంచేందుకు దోహదం చేస్తున్నాయి. డ్రగ్ మాఫియా కూడా వారిని అక్కడ టార్గెట్ చేసుకుంటూ తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా కొనసాగిస్తోంది.

చదువుకునేటప్పుడు చెప్పిన పాఠ్యాంశాలు అర్థం కాకపోవడం.. అది పూర్తయ్యాక ఉద్యోగం లభించక పోవడంతో పిల్లల్లో తీవ్ర నిరాశ, నిస్పృహలు పెరుగుతున్నాయి. దీంతో తమ భవిష్యత్తుపై భయంతో పిల్లలు చాలా సులువుగా ఈ డ్రగ్స్ వూబిలో కూరుకుపోతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలైనట్టు ఉపాధ్యాయులకు కూడా తెలియడం లేదు. అందువల్ల పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దష్టి పెట్టాలి. విద్యార్థుల్లో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు కూడా ఎప్పటికప్పుడు గమనిస్తుండాలి. తోటి స్నేహితుల ఒత్తిడి, ఇంట్లో ఒంటరితనం వల్ల చాలా మంది పిల్లలు పక్క దోవ పట్టే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇతర దేశాల్లో మాదిరిగా పాఠశాలలకు అనుసంధానంగా కౌన్సెలర్లను ఏర్పాటు చేస్తే ఉపయోగం ఉంటుంది. పిల్లలకు సబ్జెక్టు అర్థం కాకపోతే వారితో చెప్పించుకొనే వీలుంటుంది. ఇంజినీరింగ్ విద్యార్థులైతే ఆఖరి సంవత్సరానికి వచ్చేసరికి బ్యాక్‌లాగ్‌లు ఎక్కువగా ఉండటం, తల్లిదండ్రులు తమపై ఖర్చు పెట్టారనే విషయాలన్నీ గుర్తుకు రావడంతో తీవ్ర ఒత్తిడికి గురవుతుంటారు. దీంతో వారు చాలా సులువుగా తాత్కాలిక ఉపశమనం ఇచ్చేదాని వైపు మళ్లేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటున్నాయి. అందువల్ల దీన్ని ఒక నేరంగా కాకుండా.. పిల్లలు ఎందుకు అలా డ్రగ్స్ వైపు వెళ్తున్నారో తొలుత ద ష్టి పెట్టాలి. పాఠశాల స్థాయి నుంచి పిల్లలకు సామాజిక విలువలను బోధించాలి. పిల్లలతో ఇంట్లో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అన్యోన్యంగా ఉంటే వారు ఇంకో వైపు ఆలోచించే అవకాశమే ఉండదు. తనను పట్టించుకుంటారనే భయం వారిలో ఉంటుంది. వారితో ఎంత దగ్గరగా మెలిగితే వారు తమలో ఉన్న బాధను అంతగా చెప్పుకొనేందుకు వీలుంటుంది. అందువల్ల పిల్లలపై కేర్ ఎక్కువ ఉండాలి. నేటి పిల్లలు భవిష్యత్తు అంటేనే భయంతో ఉంటున్నారు. అందువల్ల వారితో నిత్యం కాంటాక్టులో ఉండాలి.



> **అందువల్ల దీన్ని ఒక నేరంగా కాకుండా.. పిల్లలు ఎందుకు అలా డ్రగ్స్ వైపు వెళ్తున్నారో తొలుత దృ ష్టి పెట్టాలి. పాఠశాల స్థాయి నుంచి పిల్లలకు సామాజిక విలువలను బోధించాలి. పిల్లలతో ఇంట్లో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అన్యోన్యంగా ఉంటే వారు ఇంకో వైపు ఆలోచించే అవకాశమే ఉండదు. తమను పట్టించుకుంటారనే భయం వారిలో ఉంటుంది.**

(రచయిత ప్రముఖ విద్యావేత్త, సామాజిక విశ్లేషకులు)

చేనేత-చేయూత

మెయిల్

రకరకాల రంగులకు,
స్వచ్ఛమైన నీళ్ళతో స్నేహం కుదిర్చి
దారాలకు సరిగంగ స్నానాలు
చేయించి
వీధిని ఆకాశంగా మలచి
ఇంద్రధనుస్సులు ఆరబోస్తారు వారు
వారి చేతి స్పర్శతో రంగులనద్దుకొన్న
దారాలు
చేనేత మగ్గంలోని పడుగు, పేకల్లో
గొంగళి పురుగులల్లే ఒదిగిపోయి
అందమైన సీతా'కోక'చిలుకల్లా
పురుడు పోసుకొంటాయి
బుడిబుడి అడుగుల బుజ్జాయిల నుండి
లోకానుభవంలో పండిన ముసలోల్ల వరకు
ఆ దుస్తులు వారి మేనిని తాకి మురిపిస్తూ
ఆయా వయస్సుల వారికి హుందానిస్తాయి
శుభమైనా అశుభమైనా
ఆ నేత వస్త్రాలు ధరించిన వారికి
అమ్మ,నాన్నల్లే ఆత్మీయ స్పర్శనందించి
నేనున్నాననే స్నేహితునిమల్లే
సుఖంలోను దుఃఖంలోను తోడుంటాయి
చేనేత వస్త్రం స్థానాన్ని తోసి నేనే రాజునంటూ
మిల్లు వస్త్రాలు నియంతల్లే రాజ్యమేలుతుంటే
మగ్గంలోని దారాలు ఆదరణ లేక పికిలిపోయి
పడుగు పేకల్లో సాలీళ్ళు గూళ్ళుకట్టి
చేనేత వెతలు కతలవుతున్నాయి
ఆకలిని ఓర్చుకోలేక ఆత్మహత్యలే శరణ్యాలవుతూ
తరువాత తరానికి భారం కాకూడదంటూ
అన్నం పెట్టని దారాలతో ఉరితాడులు అల్లుకొని
మగ్గం కొయ్యకే మెడను మెలి పెట్టి
అగ్గి పెట్టెలో పట్టే చీరను నేసిన కాయాలు
సమాధుల్లో ఒదిగిపోతున్నాయి
వారి ఆకలి వెతలకు చరమగీతం పాడేందుకు
ప్రజలు మొదలు ప్రభుత్వం వరకు
చేనేత వస్త్రాలను ఆదరించి
డొక్కలుడుగుతున్న నేతన్నలకు పట్టెడన్నం పెట్టి
చేయిచేయి కలిపి చేనేత వెతలకు చరమగీతం పాడాలి
భారతీయ సంస్క తిని విశ్వవ్యాప్తం చేయాలి

పెంకి విజయ కుమార్
9553392949

జీవన the family

పడిలేచిన ఫుట్‌బాలుడు



అందిరి పిల్లల్లానే.. ఆడేపాడే వయసులో సరదాగా చెట్లెక్కాడు. అంతే ధైర్యంగా.. గుట్టలెక్కాడు. అంతేకాదు, బడికెళ్ళడం మానేసి.. గోవుల్లు తెల్లన.. గోపయ్య నల్లన గోధూళి ఎర్రనా.. ఎందువలనా.. అంటూ.. మేకలు, ఆవుల్ని కాస్తూ.. బోల్డన్ని పాటలూ పాడాడు. ఆ..తర్వాత బడికెళ్లే వయసులో.. ఓ రోజు అనుకోని రోడ్డుప్రమాదం. దాంతో శరీరంలో కీలకమైన ఒక చేయి తీసేయాల్సి వచ్చింది. ఇలా జరిగి.. రెండు నెలలు అయ్యిందో లేదో.. మరో ఘోరం. కరెంట్ షాక్‌వల్ల ఉన్న ఒక్కగానొక్క చెయ్యీ తీసేశారు. కానీ, అవన్నీ తట్టుకునే ఎదిగాడు. వైకల్యాన్ని జయించాడు. వళ్ళంతా చేతులు చేసుకుని.. మనసును క్రీడలపై లగ్నం చేశాడు. ఫలితంగా.. ఫుట్‌బాల్ ఆటగాడిగా మారాడు. ఎవడు తన్నితే.. ఫుట్‌బాల్ గుండ్రంగా తిరిగి సరాసరి గోల్‌పోస్ట్‌లో పడుతుందో అతడే దుర్గారావు అన్నట్టుగా ఎదిగాడు. ఇలా వైకల్యాన్ని దాటుకుని.. అసాధారణ స్థితిలోనూ సాధారణ క్రీడాకారులతో సమంగా ఆటలాడుతున్న ఈ కుర్రాడు జీవితకథ.. నిజంగానే ఓ స్ఫూర్తిదాయకం. అందుకే.. ఈ 'ఫుట్‌బాలుడి' కథ మనసుపెట్టి చదువుదాం పదండి!!

చిన్నప్పుడు శ్రీకాకుళంలోని మా తాతయ్య వాళ్ళ దగ్గర ఉండేవాడిని. దాదాపు పదేళ్ళపాటు అక్కడే ఉన్నా. మేకలు, ఆవుల్ని కాస్తుండేవాడిని. అదే నా దినచర్య. మా అమ్మవాళ్ళు విజవాడలో ఉండేవారు. చదువుకోకుండా పాడైపోతున్నానని మావాళ్ళు నన్ను అక్కడ్నుంచి విజయవాడ రాజీవ్‌నగర్ తీసుకొచ్చారు.

అనుకోని ప్రమాదాలు

స్కూల్లో జాయిన్ చేద్దామనుకుంటున్న సమయంలో ఓ రోజు రాత్రి రోడ్డుపై వెళుతుంటే అనుకోని ప్రమాదం జరిగి, ఓ కాలు విరిగిపోయింది. నాకు వైద్యం చేయించడం కోసం ఉన్న ఇల్లు అమ్మేశారు. అది జరిగిన రెండు నెలలకు సంక్రాంతి సందర్భంగా పిల్లలు గాలిపటాలు ఎగరేస్తున్నారని చూడటానికి వెళ్ళాను. ఓ పిల్లాడి గాలిపటం తెగి కరెంటు స్తంభంపై పడింది. తాత వాళ్ల ఊరిలో ఉన్ననప్పుడు తాటిచెట్లు, కొబ్బరిచెట్లు ఎక్కడం బాగా అలవాటే కదా?! ఈ కరెంటు స్తంభం ఎంత? అనుకుంటూ స్థంభం ఎక్కేశాను. నా వెనకే ఇంకో పిల్లాడూ ఎక్కాడు. వాడు కిందకు జారిపోతున్న సమయంలో నా కాళ్ళు పట్టుకులాగాడు. నేను పడిపోతున్నానేమోనని కరెంటు తీగలు పట్టేసుకున్నాను. అప్పుడు నాకేం స్పర్శ తెలియలేదు. అక్కడున్న పిల్లలు మాత్రం తీగలు పట్టుకోగానే మంటలు వచ్చాయని చెప్పారు. నేను నేరుగా కింద ఉన్న కాల్వలో పడటంతో ప్రాణాపాయం తప్పింది. డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. ఏం ప్రమాదం లేదని, వారం తర్వాత కొన్ని మందులురాసి, చేతికి కట్లువేసి పంపేశారు. కొన్ని రోజులు గడిచాక చేతుల నుంచి దుర్వాసన రావడం మొదలైంది. వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు రెండు చేతులూ తొలిగించాలని, లేకపోతే ప్రాణానికే ప్రమాదమని చెప్పారు. కనీసం మనిషైనా బతుకుతాడనే ఆశతో మావాళ్ళు ఆపరేషన్ చేయించారు. అందుకోసం కుటుంబానికి ఆధారంగా ఉన్న రెండో ఇంటినీ అమ్మేశారు.

కేర్ అండ్ షేర్.. అండతో

సంవత్సరంపాటు ఆస్పత్రి చుట్టూ తిరగాల్సి వచ్చింది. అలాంటి సమయంలో ఓ రోజు రోడ్డుపై వెళుతున్న నన్ను నోయిల్ డాడి చూసి, పిలిచి మాట్లాడి వాళ్ళ ఆఫీస్‌కి తీసికెళ్లారు. అక్కడ 'కేర్ అండ్ షేర్' వాళ్ళు నన్ను దత్తత తీసుకున్నారు. అలా ఆ హోంలో పదేళ్లపాటు ఉన్నాను. అక్కడ ఆడుతూపాడుతూ అందరితో కలిసి నా పనులు నేను చేసుకునేట్టుగా అలవాడుపడ్డాను. అయితే, అక్కడి పిల్లలు ఫుట్‌బాల్ తప్ప అన్ని ఆటలూ ఆడేవారు. కానీ, నా మనసంతా ఫుట్‌బాల్‌పైనే ఉండేది. దానితో నేను ప్రత్యేకంగా ప్రతిరోజూ ఫుట్‌బాల్ ఆడటం మొదలు పెట్టాను. సురేష్‌గారు నాకు ఫుట్‌బాల్ ఆటపై కోచింగ్ ఇచ్చారు. అలా ఫుట్‌బాల్ కాళ్ళతో విన్యాసాలు చేయొచ్చనే నమ్మకం నాలో కలిగింది. కోచ్‌గా ఉన్న సురేష్‌గారు ఎలా ఆడాలో సలహాలు చెప్పారు. అలా అక్కడే తొమ్మిదో తరగతి వరకూ చదివాను. స్కూల్ లెవెల్‌లో ఉండగా ఫుట్‌బాల్ టోర్నమెంట్స్‌లో పాల్గొన్నా.

స్నేహితుల ప్రోత్సాహం

పది సంవత్సరాలు కేర్ అండ్ షేర్‌లో ఉన్నాను. కానీ పదోతరగతి కూడా పూర్తికాలేదు. ఇంక చదువుకు ఎక్కడ దూరమైపోతాడో అని మా అమ్మానాన్న నన్ను ఇంటికి తీసుకొచ్చారు. అయితే, నోయిల్ డాడి ప్రయివేట్‌గా నాతో టెన్త్ కట్టించారు. తర్వాత ఇంటర్ లయోలాలో చదివాను. ఇంటర్ చదివే రెండు సంవత్సరాలూ ఫుట్‌బాల్ ఆడటం కుదరలేదు. డిగ్రీ ఎస్ఆర్ఆర్‌లో చదివాను. అక్కడ నా స్నేహితులు నన్ను హీరోలా చూసేవారు. ప్రతిక్షణం నాకు సాయపడేవారు. షూ లేసులు కట్టడం నుంచి.. టీ షర్ట్‌ని తిరగెయ్యడం వరకూ ఇప్పటికీ నా ఫ్రెండ్స్ నాకు తోడుగా ఉన్నారు. కాలేజీలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో నేను చురుకుగా పాల్గొనేవాడిని. డాన్స్ చాలా బాగా చేస్తాను. అలాంటి సమయంలో డ్రెస్ ఇన్‌షర్ట్ చేయడం, కళ్ళజోడు పెట్టడం లాంటివి వాళ్లే చేసేవారు. ఎప్పుడూ నా ఫ్రెండ్స్ నాకు సపోర్ట్‌గానే ఉన్నారు. ఆ విషయంలో నేను చాలా లక్కీ.. ఆట విషయంలో శ్రద్ధ పెట్టాను. యూనివర్సిటీ స్థాయిలోనూ ఆడాను.

ఆటలో.. గాయాలైనా?!

ఫుట్‌బాల్ మ్యాచ్‌లో నేను ఫార్వర్డ్ ప్లేయర్‌ని. మ్యాచ్‌ల్లో చాలాసార్లు కింద పడి.. గాయపడ్డ సందర్భాలున్నాయి. ఓసారి మ్యాచ్ ఆడుతున్నప్పుడు.. ఓ ప్లేయర్ రెండు కాళ్ళమధ్యన కాలు పెట్టడంతో ముందుకి బోర్లాపడిపోయాను. కుడి చేయి చివర చిట్లిపోయి బోన్ (ఎముక) బయటకు వచ్చింది. చాలా రోజులు ఆ బాధను అనుభవించాను. బాధ భరించడానికి బైక్ చక్రం కింద చేయి పెట్టేవాడ్ని. చేయి తిమ్మిరెక్కి పెయిన్ కొంతైనా తగ్గుతుంది కదా..! అని. అలాంటి సమయంలోనూ చేతికి కట్టు కట్టుకొని, సాయంత్రం పూట ఫుట్‌బాల్ ఆడేవాడ్ని. ఎందుకంటే ఫుట్‌బాల్ అంటే నాకు అంత పిచ్చి. ఈ ఆగస్టులో అండర్ 14, 17, 21 నేషనల్ టోర్నీ జరగనుంది. ఇందులో ఐదుగురు మాత్రమే ఆడతారు. చెన్నయి టీం నన్ను కోచ్‌గా తీసుకుంటున్నారు. దానికి ట్రైనింగ్ కోసం మూడురోజులు సెలెక్షన్స్‌కి నాగ్‌పూర్ వెళ్ళాను. నాకు ఫుట్‌బాలంటే ఎంత ఇష్టమో.. కోచ్‌గా శిక్షణనివ్వడమూ అంతే ఇష్టం. ప్రస్తుతం నేను మా కుటుంబంతో కలిసి విజయవాడ రామవరప్పాడులో ఉంటున్నా..



సంభాషణ: ప్రభాకర్ పీతల

లక్ష్యం.. పారా ఒలింపిక్స్



పారా ఒలింపిక్స్ పోటీలో రన్నింగ్ చేయాలనుకుంటున్నాను. ఎందుకంటే, చిన్నప్పటి నుంచీ ఇప్పటిదాకా.. నేను ఫుట్‌బాల్ ఆడుతున్న టీమ్‌లో క్రీడాకారుల్లో నేను ఒక్కడినే వికాలంగుడిని. పారా ఒలింపిక్స్‌లో అన్ని అవయువాలు సరిగ్గా ఉన్నవాళ్ళు ఆడకూడదు కదా! నేను పారావిభాగంలో ఫుడ్‌బాల్ ఆడాలంటే.. అలాంటివారితో ఓ టీమ్ కావాలి. వారందిరినీ ఓచోటకు తీసుకువచ్చేంత సమయం నాకు లేదు. అందుకే, పారా ఒలింపిక్స్‌కు రన్నింగ్‌లో పార్టిసిపేట్ చేయాలనుకుంటున్నా. కోచింగ్ ఇప్పిస్తే తప్పకుండా పతకం సాధించగలననే నమ్మకం ఉంది.


- దుర్గారావు, ఫుట్‌బాల్ ప్లేయర్,

ఫోన్: 9951730731



ఐ లైనర్ ఇలా!

ఐలైనర్‌తో కళ్లు విప్పారినట్టు కనిపిస్తాయి. అలాంటి సౌందర్యం సొంతమవ్వాలంటే ఐలైనర్ అప్లై చేసేటప్పుడు కొన్ని చిట్కాలు పాటించాలి.



మంచి ప్రొడక్ట్ ఎంచుకోవాలి

ఐలైనర్ క్రీమీగా ఉంటే కనురెప్పల మీద మెత్తగా ఉంటుంది.

కూర్చుని వేయాలి

ఐలైనర్ వేసుకోవటానికి ఉపయోగించే అద్దం ఫ్లాట్‌గా ఉండే ప్రదేశంలో కూర్చున్న ప్రదేశానికి తక్కువ ఎత్తులో ఉండాలి. ఇలా ఉంటే కళ్లను కిందకి దించి సులువుగా లైనర్ వేసుకోవచ్చు. లాష్ లైన్ కూడా స్పష్టంగా కనిపిస్తుంది కాబట్టి కనురెప్పలకు ఆనుకున్నట్టుగా లైన్ గీసుకోవచ్చు.

డాట్స్ కనెక్ట్ చేయాలి

లైన్ వంకర లేకుండా రావాలంటే కన్ను మొదలు నుంచి చివరి వరకూ కనురెప్పలకు కొద్దిగా పైన వరుసగా మూడు చుక్కలు పెట్టాలి. తర్వాత లైనర్‌తో ఈ చుక్కల్ని కలుపుతూ లైన్ గీసుకుంటే వంకర లేకుండా ఉంటుంది.

ఐలైనర్ సమంగా

ఐలైనర్ మందంగా వేస్తే కళ్లు చిన్నవిగా, పలుచగా వేస్తే పెద్దవిగా కనిపిస్తాయి. కంటి ఆకారాన్ని బట్టి లైనర్ ఎంత మందంగా వేసుకోవాలో తెలుసుకోవాలి. ✦

మీ కోసం



పెరుగు, కొంచెం పసుపు, స్పూను కొబ్బరినూనె కలిపి ముఖానికి రాసుకుని, మసాజ్ చేసి కాసేపయ్యాక కడగాలి. ఇలా తరచూ చేస్తే మొటిమలు పోతాయి.

గోళ్లకు విటమిన్ మాస్క్

బాదంలో విటమిన్-ఇ అధికంగా ఉంటుంది. అందుకే బాదం నూనెతో గోళ్లను మర్దనా చేసుకోవాలి. అలాగే బాదం పేస్టును కాళ్లూ, చేతివేళ్లకూ రాసుకొని అది ఆరిన తరువాత రోజ్ వాటర్‌తో తుడిచేయాలి. ఇలా చేయడం వల్ల గోళ్లు ఆరోగ్యంగా, ఉంటాయి.



- గుప్పెడు పాలకూర ఆకుల్ని పేస్టు చేసి దానిలో ఒక టేబుల్‌స్పూను తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని గోళ్లకు, వేళ్లకు రాసుకొని కొద్దిసేపటి తరువాత కడిగేయాలి. ఆకుకూరల్లో ఉండే ఐరన్ గోళ్ల ఆరోగ్యానికి బాగా సహకరిస్తుంది.
- గుడ్డు, చీజ్‌లలో విటమిన్ బి-12 పుష్కలంగా లభిస్తుంది. ఇది గోళ్ల ఆరోగ్యానికి బాగా ఉపకరిస్తుంది. అందుకే కొద్దిగా చీజ్ తురుములో గుడ్డులోని తెల్లసొన కలపాలి. ఈ మిశ్రమాన్ని కాళ్లు, చేతి వేళ్లకు రాసుకొని ఆరిన తరువాత వెనిగర్‌తో, నిమ్మరసంతో తుడిచేయాలి. వీటిలో ఉండే క్యాల్షియం గోళ్లపై ఏర్పడే తెల్లటి మచ్చల్ని నివారిస్తుంది.
- గోళ్ల ఆరోగ్యంగా ఉండాలంటే ముందుగా చిగుళ్లలో ఎటువంటి సమస్యలు ఉండకూడదు. చిగుళ్లలో అప్పుడప్పుడు మంట, నొప్పి వంటివి వస్తుంటాయి. అయితే ఆ సమస్యల నుంచి బయటపడడానికి డార్క్ చాక్లెట్ ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే జింక్ గోళ్ల ఆరోగ్యానికి తోడ్పడుతుంది. అందుకే డార్క్ చాక్లెట్‌ని కరిగించి వేళ్లకు రాసుకోవాలి. అది ఆరిన తర్వాత రోజ్‌వాటర్‌లో వేళ్లను కొద్ది సేపు నాననివ్వాలి. దీనివల్ల గోళ్లు బలంగా తయారవుతాయి. ✦

ఆమె విజయం మన కోసమే..!

కొందరి ప్రయాణం ఒక దగ్గర ఆగిపోదు. ప్రాంతాలను, దేశాలను.. సముద్రాలను.. ఖండాలనూ దాటి అతి సామాన్యుల వద్దకు చేరుతుంది. ఎక్కడ మార్పు అవసరమో సరిగ్గా అక్కడికే గుప్పెటలో ప్రణాళికలను పట్టుకుని మరీ చేరుతుంది ఆ ప్రయాణం. అలా అమెరికా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మారుమూల పల్లెల వరకూ వచ్చిందొక అమ్మాయి. తాను చేయాలనుకున్నంతా చేసింది. చేస్తూనే ఉంది. మరుగుదొడ్డి లేమితో ఊరిచివరకూ క్యూ కట్టే కుటుంబాల తరపున నిలబడింది. కరెంటు కష్టాలతో విసిగిన మనుషుల కలను ఆమె కూడా కన్నది. అలా తనది కాని ప్రాంతంలో, తనది కాని కలకోసం అడుగులేస్తున్న ఆమె పేరు 'మార్తా' ...!



మార్తా ఓ అమెరికా అమ్మాయి. "బెటర్ విలేజ్-బెటర్ వరల్డ్" ప్రాజెక్టు పనిమీద 2012 లో ఉత్తరప్రదేశ్ వచ్చి ఇక్కడే స్థిరపడిపోయింది. ఇప్పటి వరకూ 143 మరుగుదొడ్లనూ, సౌరవిద్యుత్తు ఉన్న ఇళ్లనూ కట్టించింది. వీటిలో 82 మరుగుదొడ్లు, 27 సోలార్ పవర్ ప్లాంట్లు తన సొంత ఖర్చులతో నిర్మించింది. అయితే దీనికోసం ఆమె మూమూలు పద్ధతులను ఆచరించలేదు. అన్నింటికీ ఉపయోగపడేలా, ముఖ్యంగా వర్షపు నీటిని నిల్వచేసుకునేలా ఓ కొత్తదారిని ఎంచుకుంది. ఎవపో ట్రాన్స్పిరేషన్ (భాష్పీబవన ఉత్సర్జనం) పద్ధతిలో పదడుగుల వెడల్పు ఉండేలా తక్కువ ఖర్చుతో నిర్మించింది. ఫ్రెంచ్ డ్రెయిన్ విధానం ద్వారా వర్షపు నీటిని రక్షించటంలోనూ విజయం సాధించింది.

మార్తాను కదిలించాయి

ఇక్కడికి చేరుకున్న మార్తా మొదటిగా స్థానిక ప్రజలతో మమేకమవ్వడం ప్రారంభించింది. వారితో మాట్లాడి, వాళ్ల జీవితాలతో ప్రయాణించి, తెలుసుకుంటే కానీ సమస్యలపై సరైన అవగాహన రాదని తెల్సుకుంది. మొదటి అడుగు నుంచీ అదే దారిలో నడిచింది. ఇటీవల జరిపిన స్వచ్ఛభారత్ సర్వేలో 52 శాతం మంది ఇప్పటికీ ఆరుబయట మూత్రవిసర్జన చేస్తున్నారనీ, 35 శాతం మందికి మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయని తెలుసుకుని ఆశ్చర్యపోయింది. నాలుగేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌లోని జగత్‌పూర్ గ్రామాన్ని పరిశీలించింది. అక్కడి ప్రజలను మీ కనీస అవసరాలుగా ఏమి కోరుకుంటున్నారు? మీ దైనందిక జీవితంలో ఏ మార్పులు కోరుకుంటున్నారు అని అడిగితే.. అందరూ ఒకే సమధానమిచ్చారు "తమకు మరుగుదొడ్లు కావాలి" అని. నిజానికి ఇదే మార్తాను మరింత కదిలించింది. ముందుకు నడిపింది.

అవగాహన కల్పించింది

అప్పటి నుంచి అనేక ప్రాంతాలనూ, ముఖ్యంగా మూరుమూల పల్లెలనూ సందర్శించి, అవగాహన కల్పిస్తూ వచ్చింది. పరిశుభ్రత, శానిటరీ మీద తరగతులు నిర్వహించింది. పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేసుకునేలా చేసింది. పిల్లలతో ఎక్కువగా కలుస్తూ వారికి మరింత అవగాహన కల్పించి, సమస్యను వారి నుండి పెద్దవాళ్లకు అర్థమయ్యేలా చెప్పించేది. అలా మొదలైన ప్రయాణం ఆ తర్వాత మరిన్ని అడుగులు వేసింది. తనకంటూ ఓ బృందం తయారయ్యింది.

అండగా నిలబడ్డారు

మొదట నిర్వహించి కార్యక్రమాలన్నీ తన సొంత ఖర్చులతోనే. ఆ తర్వాత ఒక్కొక్కరుగా మార్తాతో కలిసి నడిచారు. కొంతమంది సాయం కూడా అందించారు. అన్ని రకాల సదుపాయలనూ ఉపయోగించుకుని ఒక్క ఇటుక ముక్కను కూడా వృథా చేయకుండా అతి తక్కువ ఖర్చు అంటే సుమారు రూ. 10,600 లతో మరుగుదొడ్డిని నిర్మించింది. అలా అప్పటి నుంచి ఉత్తరప్రదేశ్ పల్లెల్లో ఎంతోమంది ప్రజల కోసం ప్రయాణిస్తూనే ఉంది.

నిజానికి ఎక్కడి అమెరికా అమ్మాయి మార్తా... ఎక్కడి ఉత్తరప్రదేశ్ గ్రామాలూ... కొందరంతే తమజీవితాన్ని ప్రపంచమంతా చల్లి, ఎంతోమందికి ఆసరాగా నిలబడి... ఆ తృప్తితోనే నిద్రపోతారు.



జీవన సౌరభం

నమ్మకం సంపాదించడానికి సంవత్సరాలు పట్టొచ్చు. కానీ కోల్పోవడానికి క్షణం చాలు

సెన్సెక్స్ ▼ 216
31,797

నిఫ్టీ ▼ 71
9,908

రూపాయి ▲ 20 పైసలు
ఒక అమెరికా డాలరుకు రూ. 63.83

తగ్గిన వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు

మంత్రి సీతారామన్



న్యూఢిల్లీ : క్రితం ఆర్థిక సంవత్సరం (2016-17)లో భారత వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు 33.87 బిలియన్ డాలర్లకు క్షీణించాయని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2013-14లో ఈ రంగం ఎగుమతులు 43.23 బిలియన్ డాలర్లగా నమోదయ్యాయని బుధవారం మంత్రి రాజ్యసభకు లిఖితపూర్వకంగా తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లో వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవడం ఈ రంగం ఎగుమతులపై ప్రభావం చూపాయన్నారు. దీంతో భారత ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లో పోటీ పడలేకపోయాయని పేర్కొన్నారు. కాగా 2016-17లో సముద్ర ఉత్పత్తులతో కలుపుకుని వ్యవసాయోత్పత్తుల దిగుమతులు 25.09 బిలియన్ డాలర్లకు పెరిగాయని మంత్రి వెల్లడించారు. 2013-14లో 15.03 బిలియన్ డాలర్ల దిగుమతులు చోటు చేసుకున్నాయన్నారు. ఈ రంగం ఎగుమతులు, దిగుమతులు వివిధ పరిణామాలపై ఆధారపడి ఉంటాయన్నారు. లభ్యత, అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో డిమాండ్, సరఫరా, పరిస్థితులు, నాణ్యత పరమైన అంశాలు ప్రభావితం చేస్తాయన్నారు. ముఖ్యంగా భారత్ వంట నూనెలు, పప్పుల కొరతను ఎదుర్కొంటుందన్నారు. క్రితం మూడేళ్ల నుంచి దేశం మొత్తం ఎగుమతుల్లో వ్యవసాయోత్పత్తుల వాటా క్రమంగా తగ్గుతూ వస్తోందని మంత్రి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. 2016-17 దేశ మొత్తం ఎగుమతుల్లో 12.26 శాతం, 2014-15లో 12.59 శాతం చొప్పున తగ్గుదల చోటు చేసుకుందన్నారు.

విస్తరణకు బ్రిడ్జ్‌స్టోన్ పెట్టుబడులు

పూణె: ప్రపంచంలోనే అతిపెద్ద టైర్, రబ్బర్ ఉత్పత్తుల కంపెనీ బ్రిడ్జ్‌స్టోన్ కంపెనీ దేశంలోని పుణె (చకన్), ఇండోర్ (ఖెదా) ప్లాంట్లు రెండింటిని 304.3 మిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడితో విస్తరించనున్నట్లు ప్రకటించింది. 2017తో ఆరంభించి రానున్న ఐదేళ్ళలో దశలవారీగా ఈ పెట్టుబడి పెట్టనున్నామని బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కజుతొషి ఒయామా తెలిపారు. అధికమైపోతున్న వాహనాల ఉత్పత్తి, సంఖ్యకు అనుగుణంగా పెరిగిపోతున్న టైర్ల డిమాండ్‌లను దృష్టిలో పెట్టుకుని ఈ విస్తరణ కార్యక్రమం తీసుకున్నామన్నారు. ప్రస్తుతం రోజుకు 15,000 టైర్ల ఉత్పాదన సామర్థ్యం ఉందని, 2022 నాటికి ఈ రెండు ప్లాంట్ల రోజువారీ ఉత్పాదన 41,000లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

టాటా మోటార్స్ లాభాల్లో 42% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రముఖ దేశీయ కార్ల తయారీ దిగ్గజం టాటా మోటార్స్ 2017 ఏప్రిల్-జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి 42 శాతం వృద్ధితో రూ.3,182 కోట్ల లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.2,236 కోట్లుగా ఉంది. క్రితం త్రైమాసికంలో మొత్తం ఆదాయం 10శాతం క్షీణించి రూ.66,339 కోట్ల నుంచి రూ.59,972 కోట్లకు పడిపోయింది. వచ్చే సెప్టెంబర్‌లో నెక్సాన్ కారు తీసుకోచ్చే యోచనలో ఉన్నట్టుగా తెలిపింది. జాగ్వార్ లాండ్ రోవర్ పెన్షన్ ప్రణాళికలో చేసిన మార్పులతో కంపెనీకి రూ.3,609 కోట్లు లాభం వచ్చినట్టుగా తెలిపింది. జూన్ త్రైమాసికంలో వాణిజ్య, ప్యాసింజర్ వాహనాల ఎగుమతులు గతేడాదితో పోల్చితే 11.8శాతం క్షీణించి 1,11,860 యూనిట్లుగా నమోదయ్యాయి. బుధవారం బిఎస్‌ఇలో టాటామోటార్స్ షేర్ 3.17శాతం క్షీణించి రూ.416.75 వద్ద ముగిసింది.

బ్యాంకు ఆఫ్ ఇండియా భళా



నష్టాల్లోంచి లాభాల బాట

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని బ్యాంకు ఆఫ్ ఇండియా (బిఒఐ) 2017 జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. మొండి బాకీలు తగ్గించుకోవడం ద్వారా రూ.87.71 కోట్ల లాభాలు సాధించి భళా అనిపించుకుంది. ఇంతక్రితం మార్చితో ముగిసిన త్రైమాసికంలో ఏకంగా రూ.1,045.54 కోట్ల నికర నష్టాలు చవి చూసింది. 2016 ఏప్రిల్ నుంచి జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో ఈ బ్యాంకు రూ.741.36 కోట్ల నష్టాలు నమోదు చేసింది. 2016-17లో బిఒఐ మొత్తంగా రూ.1,558.34 కోట్ల నష్టాలు మూటగట్టుకుంది. బిఒఐ క్రితం క్యూ1లో రూ.11,106.61 కోట్ల ఆదాయం ఆర్జించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.10,664.36 కోట్ల ఆదాయం నమోదు చేసుకుంది. గత జూన్ ముగింపు నాటికి బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 13.05 శాతానికి తగ్గాయి. గతేడాది ఇదే కాలం నాటికి జిఎన్‌పిఎ 13.38 శాతంగా చోటు చేసుకుంది. క్రితం క్యూ1 ముగింపు నాటికి బ్యాంకు నికర ఎన్‌పిఎ 6.70 శాతానికి నియంత్రించింది. 2016 ఇదే కాలం నాటికి నికర ఎన్‌పిఎ 7.78 శాతానికి ఎగిసింది. గత త్రైమాసికంలో మొండి బాకీల కోసం రూ.2,45.28 కోట్ల కేటాయింపులు చేసింది. 2016 ఇదే త్రైమాసికంలో రూ.2,770.19 కోట్ల కేటాయింపు లు జరిపింది. మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో బుధవారం బిఎస్‌ఇలో బిఒఐ షేర్ 2.19 శాతం పెరిగి రూ.156.05 వద్ద ముగిసింది.

ధరలు పెరుగొచ్చు

రాయిటర్స్ పోల్ విశ్లేషణ



న్యూఢిల్లీ : దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ పెరగనుందని రాయి టర్స్ పోల్ విశ్లేషిం చింది. గత మూడు మాసాల ుగా తగ్గు తూ వచ్చిన ద్రవ్యోల్బణం జులైలో పెరగనుందని అంచనా వేసింది. కాగా ఇది రిజర్వు బ్యాంకు మధ్యస్త కాల ద్రవ్యోల్బణ లక్ష్యం 4 శాతం కంటే తక్కువగానే ఉంటుందని పేర్కొంది. ముఖ్యంగా అహార ద్రవ్యోల్బణం, కూరగాయల ధరలు పెరుగు తాయని తెలిపింది. క్రితం మాసంలో రిటైల్ ద్రవ్యోల్బణం 1.87 శాతానికి చేరింది. ఇంతక్రితం మాసంలో ఇది 1.54 శాతంగా ఉంది. కాగా జులైలో ద్రవ్యోల్బణం సూచీ 0.90 శాతం నుంచి 3.60 శాతం మేర పెరిగే అవకాశం ఉందని 30 మంది ఆర్థిక నిపుణులు అంచనా వేశారని రాయిటర్స్ పేర్కొంది. ఆగస్టు 14న కేంద్ర గణంకాల శాఖ రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ గణంకాలను వెల్లడించే అవకాశం ఉంది. దేశంలో కొంత వర్షాభావ పరిస్థితులు చోటు చేసుకోవడంతో అహారోత్పత్తులు, పానియాల ధరలు పెరుగొచ్చని ఈ సర్వేలో తేలింది.

లెనోవా నుంచి 'ఫ్యూచర్ రెడీ' ల్యాప్‌టాప్‌లు

హైదరాబాద్ : ప్రముఖ టెక్నలాజీ కంపెనీ లెనోవా తమ అత్యాధునిక ఫ్యూచర్ రెడీ ల్యాప్‌టాప్‌లను మార్కెట్లోకి విడుదల చేసినట్లు ప్రకటించింది. ఇందులో యోగా 720, యోగా 520, అల్ట్రా థిన్, ఐడియాపాడ్ 520ఎస్, 320ఎస్, గేమింగ్ బ్రాండ్ లెగియాన్ వై720 తదితర మోడళ్లు ఉన్నాయని లెనోవొ ఇండియా సౌత్ జనరల్ మేనేజర్ అంజన్ బార్చు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తం ఫోర్టుపోలియో పూర్తి సరికొత్త, తర్వాత తరం ఫీచర్లను కలిగి ఉన్నాయన్నారు. వీటి ధరలు రూ.17,800 నుంచి రూ.1,49,990 వరకు విలువ చేస్తాయన్నారు.

36 లక్షల మదుపరులకు షాక్!

భారీగానే డొల్ల కంపెనీల ప్రభావం



ముంబయి : మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 331 కంపెనీల ట్రేడింగ్ నిలిపివేయడం ప్రధానంగా చిన్న, రిటైల్ మదుపరులపై పెను ప్రభావం చూపింది. సెబీ నిర్ణయంతో దాదాపుగా 36 లక్షల మంది మదుపరుల సొమ్ములు స్టాక్ మార్కెట్లోలో బ్లాక్ అయ్యే పరిస్థితి నెలకొంది. కొన్ని సంస్థల ప్రమోటర్లు చేసిన తప్పులకు ఇప్పుడు సామాన్య మదుపరి బలైపోయాడు. కోటీశ్వరులైన బడా బాబులు ఆయా సంస్థలో ద్వారా అక్రమాలకు పాల్పడి సొమ్ము చేసుకున్న తరువాత ఇప్పుడు సర్కారు చల్లాగా కంపెనీల ట్రేడింగ్‌పై నిషేధం విధించడంతో అమాయకపు మదుపరుల సొమ్ము స్టాక్ మార్కెట్లలో ఇరుక్కొనే పరిస్థితి నెలకొంది. ఆయా స్టాక్స్‌ను జిఎస్‌ఎం విభాగంలో చేర్చడంతో ఇప్పుడు నష్టం లేకుండా మదుపరులు ఈ స్టాక్స్ నుంచి బయటకు వెలువడలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాకేష్ ఝున్‌ఝున్‌వాలా, డిఎస్‌పి బ్లాక్‌రాక్, హెచ్‌డిఎఫ్‌సీ మ్యూచువల్, రిలయన్స్ మ్యూచువల్ అండ్ యూటిఐ లాంటి బడా సంస్థలు కూడా ట్రేడింగ్ నిషేధిత కంపెనీల్లో పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. దేశీయ సంస్థకు తోడు విదేశీ సంస్థాగత మదుపరి సంస్థలైన 'గోల్డ్‌మెన్ శాక్స్', ఫిడిలిటీ, బ్లాక్‌రాక్, స్మాల్‌క్యాప్ వరల్డ్ లాంటి సంస్థలు కూడా ఈ స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టి ఉన్నాయి. సెబీ నిషేధించిన సంస్థలో ముంబయి కేంద్రంగా పని చేస్తున్న ముంబయి మెట్రో-3 ఫేజ్ రైల్ ప్రాజెక్టు పనులను పొందిన సంస్థ కూడా ఉండడం విశేషం. అంతకు ముందు ఏడాది కాలంతో పోల్చి చూస్తే నిషేధిత కంపెనీల్లో పెట్టుబడులు రెండింతలు కావడంతో చాలా మంది మదు పరులు ఆకర్షితులై ఆయా కంపెనీల్లో పెట్టు బడులు పెట్టడం జరిగిందని మార్కెట వర్గాలు చెబుతున్నాయి.

మార్కెట్లలో 'కొరియా' భయాలు

అమెరికా సమీపంలో అణుదాడి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఉత్తర కొరియా హెచ్చరికలు జారీ చేయడంతో ప్రపంచ మార్కెట్లు ఆందోళనకు గురి అయ్యాయి. ఈ పరిణామానికి తోడు ముఖ్యంగా వైద్య, ఆటో రంగాల సూచీల ఒత్తిడితో దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజూ నష్టపోయినట్లయ్యింది. బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 216.35 పాయింట్లు లేదా 0.68 శాతం కోల్పోయి 31,797.84కు దిగజారింది. గత మూడు వారాల్లో ఇదే అత్యల్పం. ఉదయం 31,926 వద్ద మొదలైన సూచీ ఓ దశలో గరిష్టంగా 31,967కు చేరినప్పటికీ అమ్మకాల ఒత్తిడితో మరో దశలో 31,732 కనిష్ట స్థాయి వద్ద ట్రేడింగ్ అయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 70.5 పాయింట్లు పడిపోయి 9,908.05 వద్ద ముగిసింది.

అంబీ వ్యాలీ వేలాన్ని ఆపండి

న్యూఢిల్లీ : సహారా గ్రూపునకు ఎంతో ప్రతిష్టాత్మకమైన, అత్యంత ఖరీదైన అంబీ వ్యాలీ వేలాన్ని నిలిపివేయాలని ఆ సంస్థ బుధవారం సుప్రీంకోర్టును కోరింది. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి చెల్లించాల్సిన మొత్తాన్ని ఒకేసారి కట్టేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపింది. గత నెలలో అంబీ వ్యాలీని వేలం వేయాల్సిందిగా సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో సహారా గ్రూపు ఆ వేలాన్ని నిలిపివేయాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటీషన్‌ను త్వరలోనే న్యాయస్థానం విచారణకు స్వీకరించనుంది. పూణెకు సమీపంలో దాదాపు 8,900 ఎకరాల విస్తీర్ణంలో అంబీ వ్యాలీ విస్తరించి ఉంది. దీని మార్కెట్ విలువ సుమారు రూ.37,390వేల కోట్లుగా ఉంది. అయితే వాస్తవ విలువ రూ.43,000 కోట్లు చేస్తుందని అంచనా. ఈ ప్రాపర్టీలో లగ్జరీ రిసార్ట్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు అన్నీ ఉన్నాయి. ఈ ఆస్తి మరికొన్ని రోజుల్లో సహారా చేజారిపోతుంది. నగదును రీఫండ్ చేసే విషయంలో సహారా గ్రూప్ తమ ఆదేశాలను పాటించకపోవడంతో సుప్రీం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది ఏప్రిల్‌లోనే తొలుత అంబీ వ్యాలీ ప్రాజెక్టును అమ్మాలని కోర్టు ఆదేశించింది. గత జూలై 25న జరిగిన విచారణలో, అంబీ వ్యాలీ వేలం ప్రక్రియ ను సహారా లాయర్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ విచా రణ సమయంలో సెప్టెంబరు 7వ తేదీలోగా సహారా సెబీకి రూ.1500కోట్లు డిపాజిట్ చేయాల్సింది గా సుప్రీం ఆదేశించిన విషయం తెలిసిందే సహారా గ్రూపు ఇప్పటికే అనేక అవకాశాలు తీసుకున్నప్పటికీ ఆచరణలో అమలు చేయలేదు. దీంతో అత్యున్నత న్యాయస్థానం పదేపదే ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. సహారా గ్రూప్‌నకు చెందిన రెండు సంస్థలు సహారా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ లిమిటెడ్, సహారా హౌజింగ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌లు నిబంధనలకు విరుద్ధంగా మదుపర్ల నుంచి రూ.24వేల కోట్లు సమీకరించి, తిరిగి చెల్లించడంలో విఫలమైన విషయం తెలిసిందే.

వర్తమాన అంశాలు (అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ) పోటీ పరీక్షల ప్రత్యేకం

భారత సొంత నావిగేషన్ వ్యవస్థ పేరు?



కుర్రా శ్రీనివాసరావు,
సబ్జెక్టు నిపుణులు, తెనాలి.
సెల్ : 9701415678

ప్రాంతీయ భద్రతలో ఆసియాన్‌ది కేంద్రస్థానం

ఆసియా-పసిఫిక్ ప్రాంతీయ భద్రత స్వరూపాన్ని పరిరక్షించడంలో 'ఆగ్నేయాసియా దేశాల కూటమి' (ఆసియాన్)ది కేంద్ర స్థానమని భారత్ పేర్కొంది. మనీలాలో ఆగస్టు 6న ముగిసిన 15వ ఆసియాన్-భారత విదేశాంగ మంత్రుల సదస్సులో భారత విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ మాట్లాడారు. గత 50 ఏళ్లల్లో అనేక ఘర్షణల్ని నివారించి, ఆర్థికవృద్ధి సాధించడంలో కూటమి కీలకపాత్ర వహించిందని చెప్పారు. సదస్సు ముగింపు సందర్భంగా దక్షిణచైనా సముద్రంలో వ్యవహారాలపై ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు. అక్కడ సైనిక కార్యకలాపాలకు స్వస్తి పలకాలని పిలుపునిచ్చారు.

ఉత్తర కొరియాపై ఆంక్షలకు ఆమోదం


ఉత్తర కొరియాపై కఠిన ఆంక్షలను విధిస్తూ అమెరికా రూపొందించిన తీర్మానానికి ఐరాస భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. దీనివల్ల ఉత్తర కొరియాకు ఏటా 100 కోట్ల డాలర్ల మేర ఆదాయాన్ని ఇచ్చే ఎగుమతులపై నిషేధం అమలవుతుంది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టాక ఉత్తరకొరియాకు వ్యతిరేకంగా చేపట్టిన మొదటి చర్య ఇదే. దీనికి ఉత్తర కొరియా మిత్రపక్షం చైనా కూడా మద్దతు తెలపడం విశేషం. జులై 4న ఉత్తర కొరియా తన తొలి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణిని పరీక్షించింది. తాజా తీర్మానంపై అప్పటి నుంచి అమెరికా, చైనాతో చర్చలు జరుపుతోంది. జులై 28న ఉత్తర కొరియా మళ్లీ క్షిపణి పరీక్షకు దిగింది.



ఇప్పటికే తీవ్రంగా నిధుల కొరతను ఎదుర్కొంటున్న ఉత్తర కొరియాకు తాజా ఆంక్షలు శరాఘాతం కానున్నాయి. వీటివల్ల ఆ దేశం బొగ్గు, ఇనుము, ఇనుప ఖనిజం, సీసం, ముడి సీసం, చేపలు, ఇతర సముద్ర ఆహార ఉత్పత్తుల ఎగుమతులు చేయడానికి వీల్లేదు. ఫలితంగా ఆ దేశ ఎగుమతి ఆదాయంలో మూడోవంతు వరకూ కోత పడుతుంది. ఉత్తర కొరియా ఎగుమతులు ఏటా 300 కోట్ల డాలర్ల మేర ఉన్నాయి. ఆ దేశానికి ప్రధాన ఆర్థిక భాగస్వాములుగా ఉన్న చైనా, రష్యాలు ఈ ఆంక్షలను పూర్తిగా అమలు చేస్తే ఉత్తర కొరియా చుట్టూ ఉచ్చు మరింత బిగుసుకుంటుంది. విదేశాలకు పంపే కార్మికుల సంఖ్యను పెంచుకోకుండా కూడా తాజా తీర్మానం ఆ దేశాన్ని నిరోధిస్తుంది. వీరి ద్వారా వచ్చే ఆదాయం కూడా అక్కడి ప్రభుత్వానికి మరో ప్రధాన వనరుగా ఉంది. ఉత్తర కొరియాకు చెందిన తొమ్మిది మంది అధికారులను, ఆ దేశ ప్రధాన విదేశీ మారకద్రవ్య బ్యాంకు సహా నాలుగు సంస్థలను బ్లాక్ లిస్ట్‌లో చేర్చింది. ఉత్తర కొరియా చమురు దిగుమతులపై మాత్రం ఆంక్షలు పెట్టలేదు. అది చేసి ఉంటే ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎదురుదెబ్బ తగిలి ఉండేది. 2006లో తొలిసారి అణుపరీక్షను నిర్వహించాక ఉత్తర కొరియాపై ఐరాస ఆంక్షలు విధించడం ఇది ఏడోసారి. ఉత్తర కొరియా వాణిజ్యంలో 90 శాతం వాటా చైనాదే. తాజా ఆంక్షల ప్రభావం కూడా చైనా సహకారంపైనే ఆధారపడి ఉంది.

షాహిద్ హకీంకు ధ్యాన్‌చంద్ అవార్డు

భారత ఫుట్‌బాల్ మాజీ ఆటగాడు, హైదరాబాదీ సయ్యద్ షాహిద్ హకీం ధ్యాన్‌చంద్ అవార్డుకు నామినేట్ అయ్యాడు. అవార్డుల కమిటీ షాహిద్‌తోపాటు.. భూపేందర్ సింగ్ (అథ్లెటిక్స్), సుమరాయ్ (హాకీ)లను ఈ పురస్కారానికి నామినేట్ చేసింది. రియో పారాలింపిక్స్‌లో స్వర్ణం గెలిచిన తంగవేలు మరియప్పన్ (హైజంప్) కోచ్ సత్యనారాయణ ద్రోణాచార్య పురస్కారానికి నామినేట్ అయ్యాడు. దివంగత అథ్లెటిక్స్ కోచ్ రామకృష్ణన్ గాంధీతో పాటు కబడ్డీ కోచ్ హీరా నంద్ కటారియా పేర్లను అవార్డుల కమిటీ ద్రోణాచార్య అవార్డుకు ప్రతిపాదించింది. ఆసియా రేస్ వాకింగ్ చాంఫియన్‌షిప్ (జపాన్)లో కాంస్యం నెగ్గిన బల్జిందర్ సింగ్.. రామకృష్ణన్ దగ్గర శిక్షణ పొందాడు. 55 ఏళ్ల వయసులో గతేడాది మరణించాడు.



నీతి ఆయోగ్ తదుపరి వైస్‌ఛైర్మన్‌గా రాజీవ్‌కుమార్



నీతి ఆయోగ్ తదుపరి వైస్‌ఛైర్మన్‌గా ఆర్థికవేత్త డాక్టర్ రాజీవ్‌కుమార్‌ను నియమిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న అరవింద్ పనగడియా ఆగస్టు 31తో బాధ్యతల నుంచి వైదొలుగుతానని ఇటీవల ప్రకటించిన సంగతి తెలిసిందే. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అయిన పనగడియా.. తనకు సంస్థ ఇచ్చిన సెలవుకాలం ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్రం రాజీవ్‌ను కొత్త వైస్‌ఛైర్మన్‌గా ప్రకటించింది. ఆక్స్‌ఫర్డ్‌లో ఆర్థికశాస్త్రంలో డీఫిల్, లఖ్‌నపూ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన రాజీవ్. కేంద్ర విధానాల పరిశోధన సంస్థ (సీపీఆర్)లో సీనియర్ ఫెలోగా ఉన్నారు. గతంలో ఫిక్కీకి సెక్రటరీ జనరల్‌గా, భారతీయ అంతర్జాతీయ ఆర్థిక సంబంధాల పరిశోధనా మండలి (ఐసీఆర్ఐఈఆర్)కు చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. 2006 నుంచి 2008 మధ్య జాతీయ భద్రత సలహాదారుల బోర్డులో సభ్యుడిగానూ ఉన్నారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)కి ముఖ్య ఆర్థికవేత్తగా చేయడంతోపాటు ఆసియా అభివృద్ధి బ్యాంకు, కేంద్ర పరిశ్రమలు, ఆర్థికమంత్రిత్వ శాఖల్లో సీనియర్ పదవుల్లో సేవలందించారు.

రెండో ఆసియా టైటిల్ విజేందర్ కైవసం

విజేందర్ సింగ్ మళ్లీ అదరగొట్టాడు. తన పంచ్‌లతో ప్రత్యర్థికి చుక్కలు చూపించాడు. చైనా సత్తా ఏంటో చూపిస్తానన్న ప్రత్యర్థి.. భారత్ స్టార్ బాక్సర్ దెబ్బకు నిలవలేకపోయాడు. కాకపోతే విజేందర్‌తో తలపడ్డ ప్రత్యర్థులతో పోలిస్తే ఇతను కొంచెం గట్టి పోటీ ఇచ్చాడు. అంతేతేడా. ఫలితం మాత్రం మళ్లీ విజేందర్‌కే అనుకూలంగా వచ్చింది. ప్రొఫెషనల్ కెరీర్లో అడుగుపెట్టిన నాటి నుంచి ఓటమే లేకుండా సాగిపోతున్న విజేందర్.. తన తొమ్మిదో బౌట్లోనూ విజేతగా నిలిచాడు. ఆగస్టు 5న ముంబయిలో జరిగిన బౌట్‌లో చైనా యువ బాక్సర్ జుల్పికర్ మైమైటయాలిని ఓడించాడు. ప్రొఫెషనల్ కెరీర్లో జుల్పికర్‌కు కూడా విజేందర్‌లాగే ఘనమైన రికార్డు ఉంది. అతను దీనికి ముందు ఆడిన ఎనిమిది బౌట్లలోనూ విజయం సాధించాడు. అలాంటి బాక్సర్‌తో పోరులోనూ విజేందర్ తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. ముగ్గురు జడ్జీలూ ఏకగ్రీవంగా విజేందర్‌కు అనుకూలంగా ఫలితాన్నిచ్చారు.

మీ నాలెడ్జి తెలుసుకోండి

1. మాదక ద్రవ్యాల కేసులో బాగా వినబడుతున్న ఎల్‌ఎస్‌డి అనగానేమి ?
ఎ. లైసర్జిక్ యాసిడ్ డై థైలమైడ్
బి. లాక్టిక్ యాసిడ్ డై థైలమైడ్
సి. లైసర్జిక్ యాసిడ్ డై ఇథిలీన్
డి. లాక్టిక్ యాసిడ్ డై మిథైల్

2. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాలు ఎప్పుడు జరుపుకున్నారు ?
ఎ. ఆగస్టు 9 బి. ఆగస్టు 6
సి. ఆగస్టు 3 డి. ఆగస్టు 7

3. ఇటీవల మరణించిన పోతుకూచి సాంబశివరావు ఏ రంగానికి చెందిన వారు ?
ఎ. ప్రముఖ గాయకుడు బి. ప్రముఖ కళాకారుడు
సి. ప్రముఖ రచయిత డి. పైవేవీకావు

4. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో ఉసేన్ బోల్ట్ ఏ పతకం సాధించాడు ?
ఎ. కాంస్యం (9.95 సెకన్లలో)
బి. బంగారు (8.96 సెకన్లలో)
సి. రజితం (10.93 సెకన్లలో)
డి. పైవేవీకావు

5. ఉసేన్ బోల్ట్ వందమీటర్ల పరుగును 10 సెకన్లలోపు ఎన్నిసార్లు పూర్తిచేశాడు ?
ఎ. 42 సార్లు బి. 50 సార్లు
సి. 52 సార్లు డి. 55 సార్లు

6. ఉసేన్ బోల్ట్ 100 మీటర్ల పరుగును 10 సెకన్లలోపు ఎన్నిసార్లు ముగించాడు ?
ఎ. 32 సార్లు బి. 44 సార్లు
డి. 49 సార్లు డి. 48 సార్లు

7. ఆఫ్ఘనిస్తాన్ ఒలింపిక్ శాంతి పతకం పొందిన గజల్ గాయకుడు ఎవరు ?
ఎ. డా.గజల్ శ్రీనివాస్ బి. డా. గజల్ వెంకటేశ్వరరావు
సి. గద్దర్ డి. వంగపండు

8. ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లో బిజినెస్ స్కూల్ ఎక్కడ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు ?
ఎ. విశాఖపట్నం బి. తిరుపతి
సి. అమరావతి డి. కాకినాడ

9. ఆంధ్రప్రదేశ్‌లో ఏలేరుతో గోదావరిని అనుసంధానించడానికి చేపడుతున్న ఎత్తిపోతల పథకం ఏది ?
ఎ. గన్నవరం బి. ఇబ్రహీంపట్నం
సి. పురుషోత్తపట్నం డి. కైకలూరు

10. అణ్వస్త్ర వ్యతిరేక దినోత్సవం ఎప్పుడు జరుపుకుంటాము ?
ఎ. ఆగస్టు 6 బి. ఆగస్టు 3
సి. ఆగస్టు 8 డి. ఆగస్టు 5



11. ఉసేన్ బోల్ట్ ఒలింపిక్స్‌లో సాధించిన స్వర్ణ పతకాలెన్ని ?
ఎ. ఆరు బి. ఏడు
సి. ఎనిమిది డి. తొమ్మిది

12. డోపింగ్ నేరం రుజువై నాలుగేళ్లు నిషేధానికి గురై పునరాగమనం చేసి, ఇటీవలి ఐఎఎఎఫ్ ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించిన అమెరికా స్ప్రింటర్ ఎవరు ?
ఎ. జస్టిన్ గుటామిన్ బి. జస్టిన్ గాట్లిన్
సి. ఉసేన్ బోల్ట్ డి. ఉసేన్ అహ్మద్

సమాధానాలు : 1.ఎ, 2.బి, 3.సి, 4.ఎ, 5.బి, 6.డి, 7.ఎ, 8.సి, 9.సి, 10.ఎ, 11.సి, 12.బి.

బిట్‌బ్యాంక్

1. ఇటీవల ప్రపంచబ్యాంకు ఈడీగా నియమితులైన గుజరాత్ కేడర్ ఐఏఎస్ అధికారి ఎవరు ? **- ఎస్.అపర్ణ**
2. ఇటీవల యుఏఇ ప్రతిష్టాత్మక 'కమ్యూనిటీ సర్వీస్ మెడల్' ఉప ప్రధాని హెచ్‌హెచ్ షేఖ్ చేతుల మీదుగా స్వీకరించిన భారత వ్యాపారవేత్త ఎవరు ? **- ఫిరోజ్ మర్చంట్**
3. ఇటీవల 15వ ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల కూటమి భారత్ విదేశాంగ మంత్రుల సమావేశం ఎక్కడ జరిగింది ? **- మనీలా (ఫిలిప్పీన్స్)**
4. ఇటీవల మరణించిన పోతుకూచి సాంబశివరావు ప్రముఖ రచనలు ? **- ఉదయకిరణాలు, ఏడు రోజుల మజిలీ, చలమయ్య షష్టిపూర్తి, జీవననాదం**
5. ఎపిలో ఈ -ప్రగతి కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులకు శిక్షణ ఇస్తున్న దిగ్గజ సంస్థ ? **- ఐఎస్‌బి (ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్)**
6. ప్రపంచ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల పరుగులో స్వర్ణం సాధించినది ఎవరు ? **- జస్టిన్ గ్లాటిస్ (అమెరికా), క్రిస్టియస్ కోల్‌మస్ (అమెరికా)**
7. ప్రస్తుత వెనిజులా అధ్యక్షుడు ఎవరు ? **- నికోలస్ మదురో**
8. ఏడాది కాలంలోనే ఇంజనీరింగ్ పట్టా సాధించి రికార్డు సృష్టించిన గుజరాత్ బాలుడు ఎవరు ? **- నిర్భయ్ ఠక్కర్ (15 సంవత్సరాలు) గుజరాత్ టెక్నికల్ యూనివర్శిటీ**
9. ఇటీవల న్యాయ విద్యలో 15 బంగారు పతకాలు సాధించిన బెంగళూరు న్యాయ విద్యార్థిని ఎవరు ? **- శృతి అశోక్ (జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం)**
10. ఈయు నుంచి బ్రిటన్ బ్రేగ్జిట్ అయినందుకుగానూ ఎంత నష్టపరిహారం చెల్లించాల్సి వచ్చింది ? **- 3 లక్షల కోట్లు (40 బిలియన్ యూరోలు)**
11. ఆసియా షాట్‌గన్ చాంపియన్‌షిప్ డబుల్ ట్రాప్‌లో స్వర్ణం గెలిచిన భారత షూటర్ ఎవరు ? **- అంకుర్ మిట్టల్**
12. పాకిస్తాన్ కేబినేట్‌లో చోటు సంపాదించుకున్న హిందువు ఎవరు ? **- దర్శన్‌లాల్**
13. భారత 15వ ఉపరాష్ట్రపతి ఎన్నికలలో విజయం సాధించిన ఎన్‌డిఎ అభ్యర్థి ఎవరు ? **- ముప్పవరపు వెంకయ్యనాయుడు**



14. భారత 15వ ఉపరాష్ట్రపతి ఎన్నికను అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ ఆఫీసర్ ఎవరు ? **- షంషేర్ కె షరీఫ్ (రాజ్యసభ సెక్రెటరీ జనరల్)**
15. దేశంలో విభిన్న వ్యాపార ఆలోచనలకు రూపం ఇచ్చి పారిశ్రామిక వేత్తలను తయారుచేసేందుకు దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న ఇంకుబేషన్ కేంద్రాల పేరేమిటి ? **- ఏఐసి (అటల్ ఇంక్యుమేషన్ సెంటర్స్)**
16. సముద్ర గర్భంలోకి మానవులను తీసుకెళ్లగలిగే వాహనాలను తయారుచేస్తున్న సంస్థ ఏది ? **- ఇఎస్ఎస్ఓ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్)**
17. ఇటీవల రక్తంలోకి నేరుగా ఆక్సిజన్ చేరవేసే నానోబుడగలను తయారుచేసిన హైదరాబాదీ 'అంకుర' సంస్థ ఏది ? **- అవోద్ లైఫ్ సైన్సెస్**
18. భారతదేశ సొంత నావిగేషన్ (జిపిఎస్ తరహాలో) వ్యవస్థ పేరేమిటి ? **- నావిక్**
19. నావిక్‌కు పరమాణు గడియారాల ద్వారా కచ్చిత సమయాన్ని అందించడానికి ఏయే సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది ? **- ఇస్రోకు చెందిన ఇస్ట్రాక్‌సెల్, ఢిల్లీలోని నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ**
20. ప్రపంచం మొత్తానికి ఐటిసి (కో-ఆర్డినేట్ యూనివర్సల్ టైమ్) సార్వత్రిక సమన్విత సమయం అందిస్తున్న సంస్థ ? **- నేషనల్ బ్యూరో ఆఫ్ వెయిట్స్ అండ్ మెజర్స్ (ఫ్రాన్స్)**
21. 100 మీటర్ల పరుగును 10 సెకన్లలోపు ఎక్కువసార్లు ముగించినది ఎవరు ? **- అసాఫా పావెల్ (జమైకా) 97 సార్లు**

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు

- పార్వతీపురంలో ప్రభుత్వ కార్యక్రమాన్ని బహిష్కరించిన గిరిజన సంఘాలు
- కెఆర్‌పురంలో ఐటిడిఎ పిఒ పాల్గొనకపోవడం, గిరిజనేతరులే వేదికపై ఆశీనులు కావడంపై విమర్శలు



విశాఖ జిల్లా ముంచంగిపుట్టు మండల కేంద్రంలో థింసా నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్న గిరిజనులు

ప్రజాశక్తి- విలేకరుల యంత్రాంగం

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో బుధవారం గిరిజన సంఘం, ప్రభుత్వం ఆధ్వర్యాన ఘనంగా జరిగాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఆయా గిరిజన సంఘాల నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గిరిజనులు తమ సంప్రదాయ నృత్యం థింసా, డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో సందడి చేశారు. విశాఖ జిల్లా పాడేరు జూనియర్ కళాశాలలో గిరిజన సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీల హక్కుల కోసం ప్రతి ఒక్క గిరిజనుడూ ఉద్యమించాలన్నారు. గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనర్స మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవాన్ని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించకపోవడం విచారకరమన్నారు. ఆదివాసీల హక్కులు, సమస్యలపై నిరంతరం పోరాడుతామని తెలిపారు. పెదబయలు, డుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, అనంతగిరి, కొయ్యూరుల్లో ఆదివాసీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. విశాఖ నగరంలోని ఆంధ్రాయూనివర్సిటీ అంబేద్కర్ అసెంబ్లీ హాలులో ప్రపంచ ఉత్సవాలను ఎయు వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ప్రభుత్వాలు ఆదివాసీల అభ్యున్నతికి చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరముందన్నారు. విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేటలో గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన బహిరంగ సభలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలక లక్ష్మణమూర్తి మాట్లాడుతూ గిరిజన సమాఖ్య, ఆదివాసీ సంఘాల సమాఖ్య, మన్యం గిరిజన సేవా సంఘం, ఆదివాసీ వికాస్ పరిషత్, ఆదివాసీ సర్పంచుల సంఘం ఆధ్వర్యాన సాలూరు, పాచిపెంట ప్రాంతాల్లోనూ వేడుకలు జరిగాయి. పార్వతీపురంలో ఐటిడిఎ ఆధ్వర్యాన జరిగిన ఆదివాసీ ఉత్సవాలను ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గనుల శాఖ మంత్రి ఆర్.వి.సుజయ్‌కృష్ణ రంగారావు ప్రారంభించారు. ఇటీవల ఐటిడిఎలో పలు గిరిజన సంఘాల నాయకుల పట్ల అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడాన్ని, కార్యక్రమం ముందురోజు వరకూ ఆహ్వానాలు పంపకపోవడాన్ని నిరసిస్తూ ప్రభుత్వ కార్యక్రమాన్ని గిరిజన సంఘాలు బహిష్కరించాయి. ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనబోమని గిరిజన ప్రాంత ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, పి.రాజన్నదొర ముందుగానే ప్రకటించారు.

శ్రీకాకుళం జిల్లా సీతంపేటలో గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం జరిగింది. ఎమ్మెల్యే వి.కళావతి పాల్గొన్నారు. పాతపట్నంలో ఎఎంసి ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను, వాలీబాల్ పోటీలను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ప్రారంభిం చారు. ఐదు వేల ఎకరాలకు సంబంధించి 2,183 మందికి పట్టాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయ రామరాజు, ఎమ్మెల్యే కె.వెంకటరమణ పాల్గొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో గిరిజన సంఘం ఆధ్వర్యాన చింతూరు, ఎటపాక, రాజవొమ్మంగి, కూనవరం, అడ్డతీగల, మారేడు మిల్లి, దేవీపట్నం మండలాల్లో ఆదివాసీ దినోత్సవాలు జరిగాయి. రంపచోడవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్తికేయ మిశ్రా, ఎంఎల్‌సి రత్నాభాయి పాల్గొ న్నారు. ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ లో వైస్‌ఛాన్సలర్ ముత్యాలనాయుడు ఆధ్వర్యాన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు జరిగాయి. విద్యార్థులతో కలిసి థింసా నృత్యం వేశారు. పశ్చిమ గోదావరి జిల్లా బుట్టాయగూడెం మండలం కెఆర్‌పురం ఐటిడిఎ కార్యాల యంలో పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు పతాకావిష్కరణ చేశారు. ఐటిడిఎ పిఒ ఈ కార్యక్రమంలో పాల్గొనకపోవడం, గిరిజనేతరులే వేదికపై ఆశీనులు కావడంపై విమర్శలు వెల్లువెత్తాయి.

విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్‌లో రగడ

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిరసనలు, సస్పెన్షన్ల మధ్య సాగింది. అధికార, విపక్ష సభ్యుల వాదోపవాదాలు, తోపులాటలు, నినాదాలు, డిసెంట్ నోటీసులు ఇవ్వడం, 88కె కింద (అత్యవసర) కమిషనర్ పెట్టిన ప్రతిపాదనలు సైతం మేయర్ తిరస్కరించడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నగర మేయర్ కోనేరు శ్రీధర్ అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. అధికారపక్షం ముందుగా అనుకున్నట్లుగానే సంఖ్యా బలంతో పలు అంశాలను ఆమోదించుకుంది. బ్రహ్మకుమారి సమాజం సంస్థకు నగరంలో రూ.3 కోట్ల విలువైన 500 చదరపు గజాల కార్పొరేషన్ స్థలాన్ని 25 ఏళ్లపాటు ఏడాదికి రూ.25 వేల చొప్పున అద్దె నిర్ణయిస్తూ అధికారపక్షం తీర్మానించడంపై వైసిపి ఫ్లోర్‌లీడర్ బి.పుణ్యశీల డిసెంట్ నోట్‌ను మేయర్‌కు ఇచ్చారు. సుప్రీంకోర్టు తీర్పుకనుగుణంగా హాకర్లకు రక్షణ కల్పించి వారికి గుర్తింపు కార్డులు, రుణాలు ఇప్పించి వారి సంక్షేమానికి కృషి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఫ్లోర్‌లీడర్ జి.ఆదిలక్ష్మి మేయర్‌కు డిసెంట్ నోట్ అందించేందుకు ప్రయత్నించగా, మేయర్ దానిని తీసుకోవడానికి నిరాకరించారు. మేయర్ వైఖరిపట్ల విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తంచేశాయి.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మచిలీపట్నం (కృష్ణా)

ఆర్థిక ఇబ్బందులు తాళలేక కృష్ణాజిల్లా గూడూరు మండలం ఆకుమర్రుకు చెందిన రైతు బొల్లా వీరాస్వామి(50) బుధవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయనకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. మూడేళ్లుగా వ్యవసాయంలో ఆటుపోట్లు కారణంగా రూ.2 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. అప్పులవారి బాధ రోజురోజుకూ ఎక్కువ అవుతుండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా స్థానికులు తెలిపారు. వీరాస్వామికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మద్యం సేవించిన బస్సు డ్రైవర్ అరెస్టు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట రూరల్

కృష్ణాజిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడు ఆర్‌డిఒ చెక్‌పోస్టు వద్ద ఎఎంవిఐ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న కాళేశ్వరి ట్రావెల్స్ బస్సు డ్రైవర్ మద్యం సేవించి బస్సు నడుపుతుండగా అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. బస్సులో ప్రయాణిస్తున్న 49 మంది ప్రయాణికులను వేర్వేరు వాహనాల ద్వారా వారి గమ్యస్థానాలకు తరలించారు. బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

నేడు ఎంబిబిఎస్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాలలో 2017-18 విద్యా సంవత్సరానికి ఎంబిబిఎస్ కోర్సులో చేరిన విద్యార్థులకు ఈ నెల 10న అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు ఎం.హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల లెక్చరర్ గ్యాలరీ-1లో 4వ బ్యాచ్ విద్యార్థులకు నిర్వహించే కార్యక్రమానికి స్విమ్స్ ఇన్‌చార్జి డైరెక్టరు డాక్టరు బిసిఎం ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు హాజరై, తమ సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

ప్రజ్ఞ

జవాబులు

1. దీపక్ మిశ్రా
2. అమిత్ షా, స్మృతి ఇరానీ, అహ్మద్ పటేల్
3. కేరళ, 4. ఉత్తర కొరియా
5. రవీంద్ర జడేజా

గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కిన రైతన్న

కలెక్టరేట్ల ఎదుట రైతు, ప్రజాసంఘాల ధర్నాలు



నెల్లూరు జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతన్నలు
ఇన్‌సెట్లో విజయవాడలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.కేశవరావు

ప్రజాశక్తి యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను రైతు, కౌలు రైతు, వివిధ ప్రజాసంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం తీవ్రంగా నిరసించాయి. రైతులకు రుణమాఫీ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేస్తూ విజయవాడలో ధర్నా జరిగింది. ఎపి రైతు సంఘం, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, ఐద్వా, సిఐటియు, డివైఎఫ్‌ఐ ఆధ్వర్యాన విజయవాడ గాంధీనగర్‌లోని ధర్నాచౌక్ వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ధర్నానుద్దేశించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.కేశవరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునే ఉద్దేశంతో రైతుల వద్ద రూ.21వేల కోట్ల ప్రీమియం వసూలు చేసిన ప్రైవేటు బీమా కంపెనీలు రైతులకు కేవలం రూ.740 కోట్లు మాత్రమే చెల్లించాయన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధర కల్పించటం ప్రభుత్వానికి పెద్దభారం కాదన్నారు. నిత్యం వినియోగించే ఉల్లిపాయలు, కందిపప్పు, టమోట ధరలు పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు, ప్రజాసంఘాల జిల్లా నాయకులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నానుద్దేశించి ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబోయిన రంగారావు మాట్లాడారు. గుంటూరులో స్థానిక బ్రాడీపేటలోని రైతు సంఘం కార్యాలయం నుండి శంకర్‌విలాస్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసేందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నానుద్దేశించి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే వ్యవసాయ రంగం సంక్షోభంలో చిక్కుకోవడానికి, రైతుల ఆత్మహత్యలకు కారణమని విమర్శించారు. రైతులు, కౌలు రైతులు కష్టపడి పండించిన పంటలకు మద్దతు ధరలు ఇవ్వడం లేదన్నారు. కలెక్టరేట్ వద్ద ఉరితాళ్లతో రైతులు విన్నూత నిరసన చేపట్టారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు కె.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి గుత్తికొండ వెంకట కృష్ణారావు, సిఐటియు, ఐద్వా నేతలు పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేశారు. రైతు, కార్మిక, కౌలు రైతులు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు ఈ ధర్నాలో పాల్గొన్నారు. విశాఖ జిల్లా అనకాపల్లి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అఖిలపక్షాల ఆధ్వర్యాన బుధవారం ధర్నా నిర్వహించారు. తొలుత రైతులు, కౌలుదారులు, వ్యవసాయ కార్మికులు, అఖిల పక్షాల ప్రతినిధులు స్థానిక దొడ్డి రామునాయుడు భవనం నుండి ఆర్‌డిఒ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి అక్కడ ధర్నా నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి పులిగండ్ల శ్రీరాములు మాట్లాడారు. కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట రైతు, కౌలు రైతు, తదితర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.రమేష్‌కుమార్ మాట్లాడారు.

'వంశధార' పనులు అడ్డగింత

- ఆర్‌డిఒ వాహనం ఎదురుగా బైఠాయించిన మహిళలు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి కోసం పోలీసుల గాలింపు



సమావేశంలో అధికారులతో వాగ్వివాదం చేస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి, హిరమండలం

వంశధార ప్రాజెక్టు రిజర్వాయర్ నిర్మాణ పనులను శ్రీకాకుళం జిల్లా హిరమండలం తులగాం గ్రామ నిర్వాసితులు బుధవారం అడ్డుకున్నారు. రిజర్వాయర్ నిర్మాణ పనుల కోసం తులగాం సమీపంలో ఎదలు వేసిన పొలాల నుంచి మట్టిని తీసేందుకు ప్రయత్నిస్తున్న జెసిబిలను అడ్డగించారు. తహశీల్దార్ కాశీప్రసాద్‌కు వంశధార నిర్వాసితుల సంఘం నాయకులు రాంప్రసాద్, భాస్కరరావు, ప్రసాద్ ఫోన్ చేశారు. 'మీరేమి చెప్పారు. ఏమి చేస్తున్నారు.' అని నిలదీశారు. వరి నాట్లు వేసిన పొలాల జోలికి రాబోమని కలెక్టర్ మాటిచ్చారని, పొలాల్లో మట్టి ఎందుకు తీస్తున్నారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, పోలీసుల సూచనలతో కాంట్రాక్టర్ పనులను ఆపేసి యంత్రాలతో వెనుదిరిగారు. అంతకుముందు ఉదయం ఇదే మండలంలోని గార్లపాడులో పాలకొండ ఆర్‌డిఒ ఆర్.గున్నయ్య వాహనాన్ని మహిళలు అడ్డుకున్నారు. గార్లపాడు గ్రామ నిర్వాసితులతో చర్చలు జరిపేందుకు ఆర్.గున్నయ్య, ఇన్‌ఛార్జ్ డిఎస్‌పి వి.సుబ్రహ్మణ్యం వచ్చారు. సమావేశం నుంచి అర్థాంతంగా వెళ్లిపోతున్న ఆర్‌డిఒ వాహనానికి ఎదురుగా నిర్వాసిత మహిళలు బైఠాయించారు. సమస్యలు పరిష్కరించకుండా పనులెలా చేపడతారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు అధికారులు కలుగజేసుకొని వాహనానికి దారివ్వాలంటూ కోరారు. నిర్వాసితుల సంఘం నాయకులు జోక్యం చేసుకొని మహిళలను శాంతింపజేశారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం: సిపిఎం

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి అన్నారు. గార్లపాడు గ్రామ నిర్వాసితులతో బుధవారం ఆయన సమావేశయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు బలగాలను పెట్టి నిర్వాసితులను భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. గార్లపాడులో ఎం.కృష్ణమూర్తి నిర్వాసితులతో సమావేశమైనట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆయన కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అఖిలపక్షం ఆధ్వర్యాన మౌనదీక్ష

వంశధార నిర్వాసితులపై ప్రభుత్వ నిర్బంధాన్ని వెంటనే ఎత్తివేయాలని అఖిలపక్ష నాయకులు బుధవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం ముందున్న గాంధీ విగ్రహం వద్ద నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని మౌనదీక్ష నిర్వహించారు. సిపిఎం నగర కార్యదర్శి టి.తిరుపతిరావు, పిసిసి అధికార ప్రతినిధి రత్నాల నరసింహమూర్తి, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, వైసిపి నాయకులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్,సిపిఐ (ఎంఎల్) నాయకులు తాండ్ర అరుణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఉత్పత్తులు నాణ్యతకు మారుపేరు

స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి మధుసూదన్



స్టాక్‌యార్డ్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సిఎండి పి.మధుసూదన్

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ ఉక్కు ఉత్పత్తులు నాణ్యతకు మారుపేరని స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి పి.మధుసూదన్ అన్నారు. కృష్ణా జిల్లాలోని గన్నవరంలో గల బిబి.గూడెం రోడ్డులో విశాఖ ఉక్కు కర్మాగార నూతన స్టాక్‌యార్డ్‌ను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం రిటైలర్లు, ఖాతాదారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఇప్పటికే విశాఖ ఉక్కు కర్మాగార ఉత్పత్తులు అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించాయన్నారు. ఈ ప్రాంతంలో ఔట్‌లెట్‌ను ప్రారభించడంతో నూతనంగా నిర్మితమవుతున్న రాజధానికి, వివిధ ప్రాజెక్టులు చేపడుతున్న వారికి ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎపి ప్రభుత్వం చేపడుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టులకు ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో విశాఖ ఉక్కు ఉత్పత్తుల వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కేంద్రం ప్రకటించిన స్టీల్ పాలసీతో రానున్న రోజుల్లో ఉక్కు వినియోగం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. గన్నవరంలో ప్రారంభించిన స్టాక్‌యార్డ్ ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ ఉక్కు కర్మాగారానికి సంబంధించి రెండోదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్(కమర్షియల్) రే చౌదరి, ఈడి(మార్కెటింగ్) పిఎస్.గుప్తా, జిఎం (మార్కెటింగ్) జె.సత్యనారాయణ, ఉక్కు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాలన్నింటికీ పరిహారమివ్వాలి

కెవిపిఎస్, వ్యకాస ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-పాలకోడేరు

పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం గరగపర్రులో సాంఘిక బహిష్కరణ దళితులందరిపైనా జరిగిందని, అందులో 230 కుటుంబాలకే నష్టపరిహారం అందజేయడం దారుణమని గరగపర్రు అంబేద్కర్ కాలనీ దళితులు బుధవారం ఆందోళన చేపట్టారు. మిగిలిన 84 కుటుంబాలకూ పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. గరగపర్రు తహశీల్దార్ కార్యాలయం వద్ద కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన అంబేద్కర్ కాలనీ దళితులు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిగుపాటి రాజగోపాల్, పి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్‌సి, బిసి-సిలుగా దళితులను విడగొట్టి పరిహారం అందజేయడం దారుణమన్నారు. పాత రేషన్‌కార్డులు కలిగిన 40 మందికి, కొత్తగా ఆన్‌లైన్‌లో ఉన్న 39 రేషన్‌కార్డుల లబ్ధిదారులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమానికి, దళితులకు వ్యతిరేకంగా వ్యవహరించిన సర్పంచికి లక్ష రూపాయల నష్ట పరిహారం అందజేయడం దుర్మార్గపు చర్య అని అన్నారు. సర్పంచిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడంతోపాటు పరిహారాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గొర్ల రామకృష్ణ మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ జి రత్నమణికి వినతిపత్రాన్ని అందించారు.

'వేధా బయోటెక్'తో చర్చలు విఫలం

యాజమాన్యంపై ఆగ్రహించిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- పూసపాటిరేగ (విజయనగరం జిల్లా)

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలోని వేధా బయోఫ్యూయల్ కంపెనీ యాజమాన్యానికీ, కార్మికులకూ మధ్య నెల్లిమర్ల ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామినాయుడు సమక్షంలో బుధవారం జరిగిన చర్చలు విఫలమయ్యాయి. వేధా బయోఫ్యూయల్ పేరుపై అపాయింట్‌మెంటు లెటర్లు ఇవ్వాలని, కనీస వేతనం చెల్లించాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఇందుకు యాజమాన్యం అంగీకరించకపోవడంతో డిసిఎల్‌కు కార్మికులు సమ్మె నోటీసు ఇచ్చారు. సమ్మెను అడ్డుకొనేందుకు యాజమాన్యం 12 మంది కార్మికులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టింది. పరిశ్రమలో పనికి ఆటంకం కలిగిస్తున్నారంటూ వారిపై కోర్టులో దావా వేసింది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే ఇంటి వద్ద జరిగిన చర్చల్లో ఎంపిపి మహంతి చిన్నంనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వేధా బయోఫ్యూయల్ పేరుపై అపాయింట్‌మెంటు లెటర్లు ఇవ్వాలన్న కార్మికుల ప్రధాన డిమాండ్‌ను యాజమాన్యం అంగీకరించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో, కంపెనీ యాజమాన్యంపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

దళితులపై వివక్ష విడనాడాలి

ప్రజాశక్తి-గుడివాడ

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగానూ, వివక్ష ధోరణితో వ్యవహరిస్తున్న కారణంగానే రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు పెరుగుతున్నాయని కెవిపిఎస్ తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడ ఎన్‌జిఒ సంఘ కార్యాలయంలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో గుడివాడ మండలం దొండపాడులో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం తూర్పుకృష్ణా కార్యదర్శి మురాల రాజేష్ అధ్యక్షతన బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రఘు మాట్లాడుతూ.. ఆర్‌డిఒ, డిఎస్‌పిల ఎదుట ఉంచిన మూడు డిమాండ్‌లను నెరవేర్చని పక్షంలో జిల్లాలోని వివిధ పార్టీల మద్దతు, దళితులతో కలిసి అక్రమంగా తవ్విన చెరువులను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధి కూడా కోల్పోతామంటూ పేదలు, దళితులు గగ్గోలు పెడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వైసిపి జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు మండలి హనుమంతరావు మాట్లాడుతూ.. తప్పుడు పత్రాలనిచ్చి అధికారులు చెరువుల తవ్వకాలకు పరోక్షంగా సహకరిస్తున్నారని విమర్శించారు. బిఎస్‌పి జిల్లా నాయకులు జేమ్స్ మాట్లాడుతూ.. గరగపర్రు, దొండపాడులో దళితులపై దాడులు అప్రజాస్వామికమన్నారు.

యాజమాన్యంతో దాల్‌మిల్ కార్మికుల చర్చలు విఫలం

ప్రజాశక్తి - తెనాలి (గుంటూరు)

కూలీ రేట్లు పెంచాలని తెనాలిలో దాల్‌మిల్ ముఠా కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారానికి 15వ రోజుకు చేరుకుంది. కార్మికుల డిమాండ్ల పట్ల మిల్లుల యాజమాన్యం సానుకూలంగా స్పందించడం లేదు. మినుముల ధరలు అమాంతంగా పడిపోయాయని, ఈ సమయంలో కూలీ రేట్లు పెద్దగా పెంచలేమని స్పష్టం చేస్తున్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి నేతాజీ, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ములకా శివసాంబిరెడ్డి, షేక్ హుస్సేన్‌వలి, ఎఐటియుసి అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు, ముఠా కార్మిక సంఘం నాయకులు దాల్‌మిల్ యాజమాన్యంతో చర్చలు జరిపారు. రాత్రి 9 గంటల వరకూ పలుమార్లు నిర్వహించిన చర్చలు విఫలమయ్యాయి. గురువారమూ కార్మిక శాఖ అధికారుల సమక్షంలో చర్చలు జరిగే అవకాశం ఉందని సిఐటియు నాయకులు స్పష్టం చేశారు. కార్మికులు చేస్తున్న సమ్మె పోరాటానికి మద్దతుగా నరసరావుపేట, సత్తెనపల్లి, వినుకొండ, తాడేపల్లి సహా పలుచోట్ల నిరసన కార్యక్రమాలు జరిగాయి. సత్తెనపల్లిలో మార్కెట్ యార్డు ముఠా కార్మికులు యార్డు నుంచి తాలుకా సెంటర్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖ అధికారి అందుబాటులో లేకపోవడంతో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

నంద్యాల ప్రజలు అభివృద్ధికే ఓటేస్తారు

డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

బహిరంగ సభలో రాష్ట్ర ముఖ్యమంత్రిపై నేరపూరితమైన వ్యాఖ్యలు చేసి ప్రజలను రెచ్చగొట్టి ఇప్పుడు తాను ఆవేదనతో ఆ మాట అన్నానని వైసిపి నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పడం అతనిలోని రాక్షసత్వానికి నిదర్శనమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కెఇ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఎంపై నేరపూరిత వ్యాఖ్యలు చేసి అందుకు ప్రతిగా విచారం వ్యక్తం చేయడమో, పశ్చాత్తాప పడకుండా, క్షమాపణ కోరకుండా తన వ్యాఖ్యలను సమర్థించుకోవడం జగన్ ఉన్మాదానికి నిదర్శనమన్నారు. ఎన్నికల కమిషన్ నోటీసులిచ్చినా లెక్కచేయడం లేదన్నారు. నంద్యాల ప్రజలు విజ్ఞత కలిగిన వారని, జగన్ మొసలి కన్నీళ్లను నమ్మరని తెలిపారు. నంద్యాల ప్రజలు అభివృద్ధికే ఓటు వేస్తారని, అవినీతికి కాదనే విషయం తెలుసుకుని జగన్ ఇప్పటికైనా మారితే మంచిదన్నారు. లేకపోతే జగన్‌లాంటి వ్యక్తికి భవిష్యత్తులో ప్రతిపక్షనాయకుడి స్థానం కూడా ఉండదన్నారు.

తేలని సీట్ల పంచాయతీ

కాకినాడ కార్పొరేషన్ ఎన్నికలపై టిడిపి, బిజెపి నేతల చర్చలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లా కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థుల సీట్ల పంచాయతీ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. బుధవారం సాయంత్రం ఇరుపార్టీల ముఖ్య నేతలు కాకినాడలోని ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు నివాసంలో సమావేశమయ్యారు. టిడిపి నుంచి యనమలతోపాటు హోం మంత్రి చినరాజప్ప, పార్టీ జిల్లా అధ్యక్షుడు నామన రాంబాబు, ఎంఎల్‌ఎలు వనమాడి కొండబాబు, పిల్లి అనంతలక్ష్మి, జిల్లా కార్యదర్శి పిల్లి సత్తిబాబు, బిజెపి నుంచి దేవాదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, ఎంఎల్‌సి సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య పాల్గొన్నారు. రాత్రి వరకూ చర్చలు సాగుతూనే ఉన్నాయి. కాకినాడ కార్పొరేషన్‌లో 50 డివిజన్లు ఉండగా, ప్రస్తుతం కోర్టు తీర్పుతో 48 డివిజన్లకే ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ స్థానాలకు ఉమ్మడి అభ్యర్థులను నిలపాలని బిజెపి, టిడిపి నిర్ణయించాయి. ప్రస్తుతం కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటంతో 48 డివిజన్లలో 20 డివిజన్లను కేటాయించాలని బిజెపి నాయకులు పట్టుబట్టినట్టు తెలిసింది. పది సీట్లయినా ఇవ్వాలని చివరిగా కోరినట్లు సమాచారం.

దేనికైనా రెడీ!

- సైనిక సంసిద్ధతపై రాజ్యసభలో జైట్లీ
- 1962 యుద్ధం నుంచి పాఠాలు నేర్చుకున్నామని వ్యాఖ్య

న్యూఢిల్లీ: భద్రతాపరంగా భారత సైన్యం ఎటువంటి పరిస్థితిని ఎదుర్కోడానికైనా సిద్ధంగా ఉందని రక్షణ మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం రాజ్యసభలో తెలిపారు. 1962లో చైనాతో జరిగిన యుద్ధం నుంచి పాఠాలు నేర్చుకున్నామని వ్యాఖ్యానించారు. దేశ భద్రత కోసం త్యాగం చేసేందుకు సైనికులు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మూడు దేశాల సరిహద్దు ప్రాంతం డోక్లామ్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సమయంలో జైట్లీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. స్వాతంత్ర్య సంగ్రామ సమయంలో మహాత్మా గాంధీ నాయకత్వంలో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమానికి 75 ఏళ్లు నిండిన సందర్భంగా రాజ్యసభలో ప్రత్యేక చర్చకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1948 నుంచి జమ్మూకాశ్మీర్ సరిహద్దులో పాకిస్థాన్ ఆక్రమణలోవున్న ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకోవాలని యావత్‌దేశం కోరుకుంటోందని ఆయన అన్నారు. గతంలో భారత్ అనేక సవాళ్లు ఎదుర్కొందని, మరింత ఎదిగేందుకు అవి చాలా సహకరించాయన్నారు. 1962 నాటి యుద్ధంతో పోల్చుకుంటే 1965, 1971ల్లో భద్రతా దళాల సామర్థ్యం మరింత పెరిగిందని పేర్కొన్నారు. "ఇప్పటికీ అనేక సవాళ్లున్నాయని నేను అంగీకరిస్తున్నాను. కొంతమంది మన సార్వభౌమత్వం, సమగ్రతను దెబ్బతీయాలని చూస్తున్నారు. సమస్య తూర్పు సరిహద్దులో వున్నా, పశ్చిమ సరిహద్దులోవున్నా..మన సైనికులు దాన్ని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నారు" అని చెప్పారు. దేశాన్ని ఆర్థికంగా పటిష్టపరిచేందుకు అందరూ ప్రతిజ్ఞ పూనాలని చెప్పారు. హింస ఏ రూపంలో ఉన్నా సహించకూడదని, ఉగ్రవాదం, రాజకీయం, మతం పేర్లతో జరిగే హింస నుంచి దేశాన్ని విముక్తి చేయాలన్నారు. ఇద్దరు మాజీ ప్రధానులు ఉగ్రవాదానికే బలయ్యారని ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ హత్యలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సరిహద్దుల్లోనూ, దేశ అంతర్గత భూభాగాల్లోనూ ఆయుధాలు చేతబట్టి కొంతమంది హింసకు పాల్పడుతున్నారని, ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కాశ్మీర్‌లో పోలీసులు, సిఆర్‌పిఎఫ్ బలగాలు ఉగ్రవాదులను సమర్థవంతంగా ఎదుర్కొంటున్నా ఇప్పటికీ పలుచోట్ల హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వివరించారు. వీటన్నిటినీ అధిగమించి అభివృద్ధి దిశగా దేశాన్ని అడుగులు వేయించాలని పిలుపునిచ్చారు.



ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా మద్దతు ధర ప్రకటించాలి

- దేశ వ్యాప్తంగా150 జిల్లాల్లో రైతుల ఆందోళనలు
- వందలాది మంది రైతులు అరెస్టు
- రైతులను అభినందించిన ఎఐకెఎస్

న్యూఢిల్లీ : అన్ని పంటలపై ఉత్పత్తి ధరపై 50 శాతం పైగా మద్దతు ధరను ప్రకటిస్తూ చట్టం తేవాలని, అన్ని రకాల రైతు రుణాలు మాఫీ చేయాలని, పశు విక్రయాలపై నిషేధం విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న రైతు వ్యతిరేక నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని, పార్లమెంట్‌లో భూ సేకరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, అటవీ హక్కుల చట్టాన్ని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రభావవంతంగా అమలు చేయాలని, 60 ఏళ్ళ వయసున్న రైతులకు నెలవారి రూ.5వేలు పెన్షన్ మంజూరు చేయాలన్న డిమాండ్లతో భూమి అధికార్ ఆందోళన్ ఇచ్చిన ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం దేశ వ్యాప్తంగా రైతాంగం నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 150కి పైగా జిల్లాల్లో ప్రదర్శనలు జరిగాయి. వేలాది మంతి రైతులు ఎఐకెఎస్‌కు నాయకత్వాన ఎర్ర జెండాలను చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రదర్శనలో పాల్గొన వందలాది మంది రైతులను పోలీసులు అరెస్టు చేశారు. తమ డిమాండ్ల సాధనకై దేశవ్యాప్తంగా ర్యాలీలు, బైఠాయింపులు, జైల్‌భరో కార్యక్రమాలు నిర్వహించాలని భూమి అధికార్ ఆందోళన్ పిలుపునిచ్చింది.భూమి అధికార్ ఆందోళన్ పిలుపు మేరకు హర్యానాలోని రోహతక్ జిల్లాలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లాలో జరిగిన ప్రదర్శనలో వేలాది మంది రైతులు పాల్గొన్నారు. రాజస్థాన్‌లోని 15 జిల్లాల్లోనూ, పశ్చిమ బెంగాల్‌లో 19 జిల్లాల్లోనూ, త్రిపురలో 8 జిల్లాల్లోనూ, పంజాబ్‌లోని 13 జిల్లాల్లోనూ, మధ్యప్రదేశ్‌లోని 13 జిల్లాల్లోనూ రైతులు ప్రదర్శనలు నిర్వహించారు. మధ్య ప్రదేశ్‌లోని రేవా రైతులు నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్న 400 పశువులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కాగా బీహార్‌లోని 20 జిల్లాల్లోనూ, ఉత్తర ప్రదేశ్‌లో 15 జిల్లాల్లోనూ, ఆంధ్ర ప్రదేశ్‌లోని 15 జిల్లాల్లో, తెలంగాణాలోని 10 జిల్లాల్లోనూ, ఉత్తరాఖండ్‌లో మూడు జిల్లాల్లోనూ రైతులు ప్రదర్శనలు నిర్వహించారు. కర్ణాటక, ఒడిషాతో పాటు మిగిలిన రాష్ట్రాల్లో కూడా రైతులు నిరసన ఆందోళనలు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించిన రైతాంగాన్ని ఎఐకెఎస్ అభినందించింది. రైతులు తమ ప్రాథమిక డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసి ముందుకెళ్ళాలని ఎఐకెఎస్ కోరింది.

బిజెపి కుతంత్రాలను ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు వ్యూహాన్ని మార్చుకోవాలి

ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : బిజెపి రాజకీయ కుతంత్రాలను ఎదుర్కొనేందుకు ప్రతిపక్షాలు తమ వ్యూహాన్ని మార్పు చేసుకోవలసిన అవసరముందని నేషనల్ కాన్ఫరెన్స్ నేత, మాజీ జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. గుజరాత్ రాజ్యసభ ఎన్నికలు జరిగిన ఒక రోజు అనంతరం ఆయన పలు అంశాలను ట్విట్టర్‌లో ప్రస్తావించారు. బిజెపి నిస్సిగ్గు కుతంత్రాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ రాజ్యసభకు ఎన్నిక కావడం స్వాగతించతగిన పరిణామమని, అయితే అది అంత కష్టమేమి కాదని ఆయన పేర్కొన్నారు. బిజెపి అనుసరించిన రాజకీయ కుతంత్రాలను ప్రతిపక్షాలమైన తాము సమర్థవంతంగా అడ్డుకుంటు విషయాన్ని నిరూపించుకునేందుకు మరెన్ని ఆధారాలు అవసరమని ఆయన ప్రశ్నించారు. గుజరాత్‌లోని పరిణామాలను ఆయన ట్విట్టర్‌లో విశదీకరించారు. ఎన్నికల కమిషన్‌ను ప్రశంసిస్తూ ఐదుగురు సీనియర్ కేబినెట్ మంత్రుల ఒత్తిడిని తట్టుకుని నిలబడి ఎన్నికల కమిషన్ తీర్పునివ్వడం బిజెపికి పెద్ద ఎదురు దెబ్బని పేర్కొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలు పోవాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆ విధానాలకు వ్యతిరేకంగా పోరాడకుండా క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవాలు జరుపుకొన్నందువల్ల ప్రయోజనమేమిటి?' అని ఆయన అన్నారు. ప్రధానమంత్రి తన ప్రసంగంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా మాట్లాడడాన్ని ఏచూరి ప్రస్తావించారు. 'మీరు బానే చెప్పారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలేమిటి? మతోన్మాదానికి వ్యతిరేకంగా మీరు ఏం చేశారు?' అని ఆయన ప్రశ్నించారు. 'మీరు అమలు చేస్తున్న ఆర్థిక సంస్కరణలు ప్రజలపై భారాలను మోపుతున్నాయి. నిరుద్యోగం పెరుగుతోంది. సాధారణ ప్రజలు రోజురోజుకి పేదలుగా మారుతున్నారు. ధనవంతులు మరింత ధనవంతులవుతున్నారు. ఈ విధానాల వల్ల ప్రయోజనం ఏమిటో అర్థ కావడం లేదా' అని నిలదీశారు. 2014లో 49 శాతం జిడిపి దేశ జనాభాలో ఒక్క శాతంగా ఉన్న వారి వద్ద ఉందని, 2016లో 58.4 శాతం జిడిపి ఒక్క శాతం చేతిలో ఉన్నట్లు తేలిందని చెప్పారు. '1947లో భారత ప్రజానీకం కన్న కలలు ఇవేనా... ప్రాణాలకు తెగించి, ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న స్వాతంత్ర్యం ఇందుకేనా' అని ఆయన ప్రశ్నించారు. 'క్విట్ ఇండియా 75వ వార్షికోత్సవం సందర్భంగా నా దేశాన్ని విడిచి వెళ్లాల్సినవి ఏవైనా ఉంటే అవి మతోన్మాదం... సంకుచిత ఆర్థిక విధానాలే' అని అన్నారు. 'మతోన్మాదం నా దేశాన్ని ముక్కలు చేస్తోంది. ఈ సమయంలో తక్షణం సెక్యులర్ విధానాలను మరింతగా బలోపేతం చేయాలి. కానీ అలా జరుగుతోందా?.. లేదు. దేశంలో హిందూ పాకిస్తాన్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. అటువంటి ప్రయత్నాలను ఎటువంటి పరిస్థితుల్లోనైనా అడ్డుకుని తీరుతాం' అని చెప్పారు. ఈ సందర్భంగా దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కమ్యూనిస్టు వీరులను, వారు చేసిన సేవలను వివరించారు.

వర్ణిక కేసులో వికాస్ అరెస్ట్

కిడ్నాప్ యత్నం కేసు నమోదు


వికాస్ బరాలాను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

చండీగఢ్: వర్ణిక వేధింపుల కేసులో హర్యానా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి కుమారుడు వికాస్ బరల్, అతని స్నేహితుడ్ని పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం ఈ ఇద్దరిని కోర్టులో ప్రవేశపెట్టి పోలీస్ కస్టడీ కోరతామని హర్యానా డిజిపి తేజేందర్ సింగ్ లుతారా చెప్పారు. ఇద్దరిపై కిడ్నాప్ యత్నం కేసు పెట్టినట్లు చెప్పారు. వీరు వేధింపులకు పాల్పడినట్లు తగినంత సమాచారం తమ వద్ద ఉందని లుతారా బుధవారం తెలిపారు. కేసు విచారణను త్వరగానే పూర్తి చేస్తామని, కేసుకు సంబంధించిన పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. " ఆరు ప్రాంతాల నుంచి సిసిటివి ఫుటేజ్‌ను తీసుకున్నాం. కేసుకు సంబంధించి సరిపోయినంత సమాచారం మా దగ్గర ఉంది. అదనంగా ఇంకా ఏదైనా సాక్ష్యాలు దొరికితే స్వాగతిస్తాం" అని లుతారా చెప్పారు. నిందితులైన వికాస్ బరాలా, ఆశ్విన్ కుమార్‌లు వర్ణిక కారును వెంబడించినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. రక్త, మూత్ర నమూనాలు ఇచ్చేందుకు నిరాకరించారని, న్యాయశాస్త్ర విద్యార్థులైన వీరిద్దరికి చట్టం గురించి బాగా తెలుసునని అన్నారు. నమూనాలు ఇవ్వకపోవడం విచారణ సమయంలో వ్యతిరేకంగా మారే అవకాశముంటుందని అన్నారు. విచారణ కీలకదశకు చేరుకుందని, అందుకనే నిందితులను పోలీసుల ఎదుట హాజరవ్వాలని ఆదేశించామని చెప్పారు.

నిందితులపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టాలి ఐద్వా డిమాండ్

పంచకుల : హర్యానా ఐఎఎస్ అధికారి కుమార్తె వర్ణిక కుందుపై జరిగిన వేధింపుల కేసులో నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్లను ఎఫ్ఐఆర్‌లో నమోదు చేయాలని, నిందితుని తండ్రి సుభాష్ బరాల బిజెపి హర్యానాశాఖ అధ్యక్ష పదవికి రాజీనామా చేయాలని ఐద్వా బుధవారం డిమాండ్ చేసింది.చండీఘడ్ పోలీసులకు వ్యతిరేకంగా ఐద్వా సభ్యులు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. వర్ణిక కుందు వేధింపుల కేసులో నిందితులపై నమోదైన అభియోగాలను పోలీసులు నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. పంజాబ్, హర్యానాకు చెందిన ఐద్వాశాఖలు ఉమ్మడిగా నిరసన ప్రదర్శనను నిర్వహించాయి. పంచకులలోని సెక్టర్5లో ఉన్న యవనిక గార్డెన్ నుంచి చండీఘడ్‌లోని హర్యానా ముఖ్యమంత్రి నివాసం వరకు ర్యాలీగా బయలు దేరారు. అయితే హసింగ్ బోర్డు చౌక్ వద్ద పోలీసులు నిరసనకారులను అడ్డుకున్నారు. హర్యానా ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యేందుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐద్వా జాతీయ అధ్యక్షురాలు సుభాషిణి అలి మాట్లాడుతూ అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ బిజెపి అధికారంలో ఉన్న కారణంగా బరాల తన అధికారం ఉపయోగించి కేసు దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశమున్నదని ఆమె ఆరోపించారు. బాధితురాలి పాత ఫొటోలను సామాజిక మాధ్యమంలో ఉంచి ఆమెను అవమాన పరుస్తూ, ఆమె జీవన శైలిని ప్రశ్నించడాన్ని సుభాషిణి తీవ్రంగా ఖండించారు. చండీఘడ్ పోలీసులు రాజకీయ ఒత్తిడితో పనిచేస్తున్నారని ఆరోపించారు. కాగా ఐద్వా ప్రతినిధి బృందం బుధవారం ఉదయం బాధితురాలు వర్ణిక కుందును, ఆమె కుటుంబ సభ్యులను ఆమె నివాసం వద్ద కలుసుకుని పరామర్శించారు. నిందితులపై కర్ణిక చేస్తున్న పోరాటానికి తమ మద్దతుంటుందని ఆమెకు హామీ ఇచ్చారు. ఐదుగురు సభ్యులతో కూడిన ఐద్వా ప్రతినిధి బృందం హర్యానా ముఖ్యమంత్రిని కలుసుకుని ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కేసులో నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని, నిందితులపై కిడ్నాప్ అభియోగాలను నమోదు చేయాలని, నిందితులపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని వినతి పత్రంలో ఐద్వా ప్రతినిధి బృందం డిమాండ్ చేసింది. ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుభాషిణి అలీతో సహా జాతీయ కార్యదర్శి జగమతి సంగ్వాన్, హర్యానా శాఖ కార్యదర్శి సవిత, పంజాబ్ శాఖ కార్యదర్శి సుభాష్ మట్టూ తదితరులు ముఖ్యమంత్రిని కలుసుకుని వినతి పత్రం సమర్పించిన ప్రతినిధి బృందంలో ఉన్నారు. కాగా బుధవారం సాయంత్రం ఐద్వాకు చెందిన మరో ప్రతినిధి బృందం చండీఘడ్ ఎస్‌పి ఐష్ సింఘాల్‌ను కలుసుకుని మెమోరాండం సమర్పించింది.

స్టీల్ ప్లాంట్స్ ప్రైవేటీకరణ తగదు

- ఉక్కు రంగానికి మూడు వేల కోట్లు కేటాయించాలి
- స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల 'ఛలో పార్లమెంట్' ర్యాలీలో సిఐటియు నేత తపన్‌సేన్



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశానికే వన్నె తెచ్చిన ఉక్కు రంగాన్ని ప్రైవేటీకరించరాదని రాజ్యసభ ఎంపి, సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ డిమాండ్ చేశారు. ఉక్కు రంగాన్ని ప్రైవేట్ పరం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం యత్నాలు ప్రారంభించిందని, దీన్ని అన్ని సంఘాలు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపు నిచ్చారు. ప్రభుత్వ రంగ ఉక్కు కర్మాగారాలకు ఎంతో చరిత్ర ఉందని, దేశానికి పలు సందర్భాల్లో ఆ రంగం దిక్సూచిగా నిలిచిందన్నారు. నష్టాల పేరుతో స్టీల్ ప్లాంట్లను ప్రైవేటీకరణ చేస్తే సహించబోమని, ప్రభుత్వం మెడలువంచైనా వాటిని కాపాడుకొంటామని ఆయన హెచ్చరించారు.. ప్రభుత్వం రంగ స్టీల్ ప్లాంట్ల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉక్కు కార్మికుల ఐక్య వేదిక నేతృత్వంలో దేశంలోని స్టీల్ ఉద్యోగులు బుధవారం నాడిక్కడ ఛలో పార్లమెంట్ ఆందోళన నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంఎస్ తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు. తొలుత స్థానిక సెంట్రల్ సెక్రటేరియేట్ మెట్రో స్టేషన్ నుంచి జంతర్ మంతర్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం భారీ ధర్నా నిర్వహించారు. వేలాది మంది స్టీల్ ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ధర్నాలో దేశ వ్యాప్తంగా 8 రాష్ట్రాల నుండి విశాఖ,సేలం, బద్రావతి, బిలాయ్, బొకారో, దుర్గాపూర్ తదితర స్టీల్ ప్లాంట్లనుంచి వేలాదిగా ఉక్కు కార్మికులు పాల్గొన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ నుంచే దాదాపు 700 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్ సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ స్టీల్ ప్లాంట్లపై మోడీ సర్కార్ కుట్రలు పన్నుతోందని, ప్రైవేట్ గుత్త పెట్టుబడుదారులకు ప్రభుత్వ సంస్థలను అప్పగించే యోచన చేస్తోందని విమర్శించారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థల పట్ల కూడా ప్రభుత్వం ఇదే వైఖరిని అనుసరిస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ స్టీల్ ప్లాంట్లను ప్రైవేట్ పరం చేయడం, పెట్టుబడులను ఉపసంహరించుకోవడం వంటి అనాలోచిత నిర్ణయాలు తీసుకోవడం దారుణమన్నారు. స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు కల్పించకుండా ఇలాంటి వినాశకర నిర్ణయాలు తీసుకుంటోందని విమర్శించారు. మోడీ సర్కార్ గద్దెనెక్కిన తరువాత ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు అసత్య ప్రచారం జరుగుతోందని, మంత్రులే ఈ దిశగా ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. 'మేక్ ఇన్ ఇండియా' అని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం స్టీల్ ప్లాంట్‌లను ఎందుకు అమ్మకానికి పెడుతోందని, ఆయా ప్లాంట్లలో పెట్టుబడులను ఎందుకు ఉపసంహరిస్తోందని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించడం ద్వారానే మేక్ ఇన్ ఇండియా సాధ్యమని, ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.3000 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం కేంద్ర ఉక్కు మంత్రి చౌదరి బిరేంద్ర సింగ్‌కు కార్మిక సంఘాల ఐక్య వేదిక నేతలు కలుసుకొని వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో తపన్ సేన్(సిఐటియు), జి.సంజీవ రెడ్డి(ఐఎన్‌టియుసి), ఎంపి ప్రదీప్ భట్టాచార్య, గయా సింగ్(ఎఐటియుసి), పి.కె దాస్ (ఎస్‌డబ్ల్యుఎఫ్‌ఐ), జె.అయోధ్య రామ్ (వైజాగ్ స్టీల్ ప్లాంట్) తదితరులు పాల్గొన్నారు.

సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టొద్దు: ఎన్.రామారావు

ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడమంటే దేశ సార్వభౌమాధికారాన్ని తాకట్టుపెట్టడమేనని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల నేత, ఐక్య కార్మిక సంఘాల ఉపాధ్యక్షుడు ఎన్.రామారావు పేర్కొన్నారు.ప్రభుత్వరంగ సంస్థల బలోపేతానికి ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని, విశాఖ ఉక్కు కర్మాగార అభివద్ధికి కేంద్రం కృషి చేయాలని డిమాండ్ చేశారు.

బిజెపికి భంగపాటు

- గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో గెలిచిన అహ్మద్ పటేల్




అహ్మదాబాద్ : బుధవారం తెల్లవారుజాము వరకు సాగిన రసవత్తర పరిణామాల మధ్య కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ గుజరాత్ నుంచి రాజ్యసభకు తిరిగి ఎన్నికయ్యారు. ఇద్దరు రెబల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లు చెల్లవని ఎన్నికల సంఘం నిర్ణయం ప్రకటించడంతో అహ్మద్ పటేల్‌కు వచ్చిన 44 ఓట్లు గెలిచేందుకు సరిపోయాయి. ఆయన తోపాటు బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రి స్మృతి ఇరానీలు కూడా రాజ్యసభకు ఎన్నికయ్యారు. అమిత్ షా, ఇరాని ఇద్దరికీ చెరి 46 ఓట్లు లభించాయి. కాగా కాంగ్రెస్‌ను వీడి బిజెపిలో చేరి పోటీ చేసిన బలవంత్‌సింగ్ రాజ్‌పుత్‌కు కేవలం 38 ఓట్లు మాత్రమే లభించడంతో ఓటమిని అంగీకరించాల్సివచ్చింది. గుజరాత్‌లో మూడు సీట్లకు నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. మంగళవారం ఓటింగ్ జరిగింది. మొత్తం 182 మంది సభ్యులకు గాను 176 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మిగిలిన ఆరు సీట్లు గుజరాత్ అసెంబ్లీలో ఖాళీగా ఉన్నాయి. కాంగ్రెస్ నుంచి ఇద్దరు రెబల్ ఎమ్మెల్యేలు ఎన్నికల నియామళిని ఉల్లంఘిస్తూ తమ బ్యాలెట్ పేపర్లను అమిత్ షాకు చూపించారని, ఆ ఓట్లను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. రిటర్నింగ్ అధికారి మొదట వీరి అభ్యర్థనను తిరస్కరించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్, మాజీ మంత్రి ఆర్‌పిఎన్ సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఢిల్లీలోని ఎన్నికల సంఘ అధికారులను కలిశారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓటింగ్ వీడియో ఫుటేజ్‌ను అందించి దాని ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆ రెండు ఓట్లను రద్దు చేయాలని అహ్మద్ పటేల్ కూడా ఎన్నికల సంఘానికి ఈ మెయిల్ పంపారు. అయితే బిజెపి కూడా తమ కేంద్రమంత్రులు అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్‌లతో కూడిన బృందాన్ని పంపింది. వెనువెంటనే కౌంటింగ్ ప్రారంభించాలని వారు ఈసీని కోరారు.. రాజ్యసభ ఎన్నికల్లో రహస్య ఓటింగ్‌కు ఎంతమాత్రం విలువ లేదని, రాజ్యసభ ఎన్నికలను పార్లమెంట్ బహిరంగ బ్యాలెట్‌తో జరుపుతుందని వారు వాదించారు. ఆ తర్వాత గులాం నబీ ఆజాద్ నేతృత్వంలో మరో కాంగ్రెస్ బృందం వచ్చి ఎన్నికల సంఘం అధికారులను కలిసింది, వారి వాదనను వినిపించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ఈసి, ఓటింగ్ వీడియో ఫుటేజ్‌ను కూడా తెప్పించుకుంది. ఇద్దరు ఎమ్మెల్యేలు పోలింగ్ నియమాలను ఉల్లంఘించారని నిర్ణయం ప్రకటించింది. ఆ రెండు ఓట్లను చెల్లనవిగా తేల్చింది. దీంతో అహ్మద్ పటేల్ మరోసారి రాజ్యసభకు ఎంపికవ్వడానికి 44 ఓట్లు వస్తే సరిపోతుంది. ఆ తర్వాత జరిగిన కౌంటింగ్‌లో పటేల్‌కు 44 ఓట్లు రావడంతో గెలిచినట్లు ప్రకటించారు. మరోసారి అహ్మద్ పటేల్‌ను రాజ్య సభకు రానీయకుండా చేయాలని బిజెపి పెద్ద ఎత్తునే ప్రయత్నించింది. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లోబరుచుకు నేందుకు సర్వవిధిలా ప్రయత్నించింది. బిజెపి ప్రభావం నుండి తప్పించేందుకే కాంగ్రెస్ పార్టీ తన ఎమ్మెల్యేలను కర్నాటకు పంపించింది. ఎన్నికల సమయానికి తిరిగొచ్చిన ఎమ్మెల్యేలంతా కాంగ్రెస్ పార్టీకే ఓటు వేశారు. దీంతో బిజెపికి భంగపాటు తప్పలేదు. ఎమ్మెల్యేల కొనుగోళ్లకు, దిగజారుడు రాజకీయాలకు పాల్పడినా బిజెపికి ఫలితం మాత్రం దక్కలేదు.

బిజెపి వైఖరి స్పష్టమైంది: అహ్మద్ పటేల్

గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో తనను ఓడించడానికి చేసిన ప్రయత్నాలతో బిజెపి వైఖరేంటో అనేది అందరికీ అర్థమైందని అహ్మద్ పటేల్ పేర్కొన్నారు. "సత్యమేవ జయతే, ఇది కేవలం నా విజయం మాత్రమే కాదు, డబ్బు దర్పం, కండబలం, అధికార దుర్వినియోగం ఓటమి" అని పటేల్ ట్విట్టర్‌లో అన్నారు.

ముంబయిని తాకిన మరాఠా రిజర్వేషన్ల ఆందోళనలు

రిజర్వేషన్లకు కట్టుబడి ఉన్నామన్న సిఎం ఫడ్నవీస్



ముంబయి : మహారాష్ట్రలో రిజర్వేషన్లు కోరుతూ మరాఠాలు చేస్తున్న ఆందోళనలు బుధవారం ముంబయిని తాకాయి. మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ వేలాది మంది బైకుల్లాలోని జిజామాతా ఉదయన్ నుంచి అజాద్ మైదాన్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఉద్యోగాలలోనూ, విద్యా సంస్థలలోనూ మరాఠాలకు రిజర్వేషన్లు కల్పించాలని, కోపర్డి కేసులో నిందితులకు శిక్ష విధించాలని, రైతులకు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. మరాఠాల ప్రదర్శన నేపథ్యంలో వేలాది మంది పోలీసులను మోహరించినప్పటికీ దక్షిణ ముంబయిలోని పలు ప్రాంతాలలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మరాఠాలకు మద్దతుగా శివసేన ఏర్పాటు చేసిన బానర్లను ఆందోళనకారులు తీసివేశారు. తమ విషయంలో రాజకీయ జోక్యం అవసరం లేదని పేర్కొన్నారు. మరాఠాలకు చెందిన ఒక సామాన్యుడిగా తాను ప్రదర్శనలో పాల్గొన్నట్లు రాజ్యసభ సభ్యులు ఛత్రపతి శంభాజీ రాజే తెలిపారు. మరాఠీల ప్రదర్శనకు బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ కూడా తన మద్దతు ప్రకటించారు. మరాఠా క్రాంతి మోర్చ ఆధ్వర్యంలో బుధవారం నాటి నిరసన ప్రదర్శన జరిగింది. గత ఏడాది 57 మౌన నిరసన ప్రదర్శనలను మరాఠా క్రాంతి మోర్చా నిర్వహించింది. అయితే ఇప్పటి వరకు నిర్వహించిన ప్రదర్శనల్లో ఇదే అతి పెద్దది. మహారాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండగా మరాఠా మోర్చాకు చెందిన ఒక ప్రతినిధి బృందం విధాన భవన్‌లో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలుసుకుంది. వీరితో సమావేశమైన తరువాత ఫడ్నవీస్ మాట్లాడుతూ మరాఠాలకు రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ అంశంపై సమగ్ర నివేదికను సమర్పించాలని మహారాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్‌ను ఆయన కోరారు. కొపరాడి గ్రామంలో మరాఠా బాలికపై జరిగిన అత్యాచారం, హత్య కేసులో దర్యాప్తు వేగంపుంజుకుందని ఫడ్నవీస్ తెలిపారు. దుండగులకు కఠిన శిక్ష విధిస్తామని చెప్పారు.

వివిపిఎటిల ద్వారానే వచ్చే ఎన్నికలు

సుప్రీం కోర్టుకు తెలిపిన ఇసి

న్యూఢిల్లీ: ఇకపై ఎన్నికలను ఓటర్ వెరిఫబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వివిపిఎటి)లు ఉన్న ఇవిఎంల ద్వారానే నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఆ మేరకు బుధవారం సుప్రీంకోర్టులో ఆఫిడవిట్ దాఖలు చేసింది. దీనిపై గురువారం సుప్రీం ధర్మాసనం వాదనలు ఆలకించనుంది. వీటితో పాటు రానున్న ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే దాఖలైన పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను సుప్రీం కోర్టు విచారించనుంది. వచ్చే ఎన్నికల్లో వివిపిఎటిలు ఉపయోగించనున్నట్లు ఈ ఏడాది మార్చిలోనే ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఇవిఎంల టాంపరింగ్‌పై కూడా తమ వైఖరి తెలియజేయాల్సిందిగా రాజకీయ పార్టీలకు ఎన్నికల కమిషన్ స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఇక అసెంబ్లీలకు జరిగే ఉప ఎన్నికలకు ఎన్నికల కమిషన్ బాధ్యత వహించదనీ, రాష్ట్రాల ఎన్నికల కమిషన్లు ఇతర చట్టబద్ధ సంస్థలే బాధ్యత వహించాలని ఇసి పేర్కొంది.

ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదుల హతం

పుల్వామా : ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమైన సంఘటన దక్షిణ కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో బుధవారం జరిగింది. ఘటనా స్థలం నుంచి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం అక్కడ కూంబింగ్ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. కొంత మంది ఉగ్రవాదుల పుల్వామాలోని గుల్‌బాగ్ ప్రాంతంలో నక్కి ఉండడాన్ని గుర్తించి దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు అందించిన సమాచారం ఆధారంగా ఆ ప్రాంతంలో భద్రతా దళాలు నిర్వహించిన కూంబింగ్ నేపథ్యంలో ఈ ఘటన చోటు చేసుకుంది.

అదేమంత పెద్ద సమస్య కాదు

డోక్లాం వివాదంపై దలైలామా

న్యూఢిల్లీ: భారత్- చైనాల మధ్య వివాదానికి కారణంగా ఉన్న డోక్లాం సమస్య ఏమంత పెద్దది కాదనీ ప్రముఖ అధ్యాత్మిక గురువు దలైలామా అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన ఒక సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ భారత్-చైనాలు సంయమనం పాటించి, సోదరభావంతో మెలగాలన్నారు. ఇరుపొరుగున ఉండే రెండు పెద్ద దేశాలు హిందీ-చీనీ భాయ్, భాయ్ అంటూ ముందుకు సాగాలన్నారు. భారతదేశంలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందనీ, ఇక్కడ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకోవచ్చన్నారు. చైనా ప్రజలు కూడా భారత్‌తో సత్సంబంధాలనే కోరుకుంటున్నారని అన్నారు. డోక్లాంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఆకాంక్షించారు.

విశ్రాంత ఉద్యోగులకు 'వ్యధ'ల దేశం

- పండుటాకుల సంక్షేమంలో అట్టడుగున భారత్
- ఫ్రెంచ్ సంస్థ సూచీలో 43వ స్థానం

న్యూఢిల్లీ: పదవీ విరమణ పొందిన వృద్ధుల సంక్షేమంలో భారత్ అట్టడుగు స్థానంలో ఉందని ఓ ఫ్రెంచ్ సంస్థ తాజాగా ప్రకటించిన సూచీలో వెల్లడైంది. విశ్రాంత జీవితాన్ని గడిపేందుకు భారత్‌లో తగిన సౌకర్యాలు లేవని ఆ నివేదిక పేర్కొంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి(ఐఎంఎఫ్), ఆర్థిక సహకార, అభివృద్ధి (ఒఇసిడి), బ్రిక్స్ దేశాలతో సహా 43 దేశాల్లో వివిధ పరిస్థితులపై నటిక్సిస్ గ్లోబల్ అనే ఫ్రెంచ్ సంస్థ అధ్యయనం చేసింది. రిటైర్‌మెంట్ అనంతరం సౌకర్యవంతంగా జీవించేందుకు ఉండే అనుకూల పరిస్థితులు, నాణ్యమైన ఆర్థిక సేవలు, మెరుగైన ఆదాయ మార్గాలు, వైద్య సదుపాయాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సూచీని రూపొందించింది. ఈ సూచీలో భారత్ 43వ స్థానంలో నిలిచింది. బ్రిక్స్ దేశాల్లోనూ భారత్ అట్టడుగున ఉంది. తొలి మూడు స్థానాల్లో స్విట్జర్లాండ్, నార్వే, ఐస్‌లాండ్‌లు నిలిచాయి. గతేడాదితో పోలిస్తే వివిధ అంశాల్లో భారత్ కొన్ని స్థానాలు దిగజారడం విశేషం. అవసరమైన వస్తువులు అందుబాటులోకి(41వ స్థానం), ఆరోగ్యం(43వ స్థానం) అనే అంశాల్లో దిగజారగా, ఆర్థిక(39), జీవన ప్రమాణాలు(43) అనే అంశాల్లో మెరుగవ్వడం విశేషం. అయితే తలసరి ఆదాయంలో అట్టడుగున నిలిచినట్లు సూచీ తెలిపింది.

8 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై బహిష్కరణ వేటు

న్యూఢిల్లీ: గుజరాత్ నుంచి మంగళవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పార్టీ విప్‌ను ధిక్కరించిన ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆ పార్టీ వేటు వేసింది. పార్టీ వారిని బహిష్కరించింది. మరో ఆరుగురిని కూడా త్వరలోనే పార్టీ నుంచి బహిష్కరిస్తామని కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జీ అశోక్ గెహ్లాట్ తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ వేటుకు గురైన వారంతా శంకర్ సిన్హ్ వాఘేలా వెంట బిజెపిలోకి చేరిన వారే కావడం గమనార్హం.

అమెరికా అనుచిత జోక్యంపై వెనిజులా ఆగ్రహం

కారకాస్: వెనిజులా అంతర్గత వ్యవహారాల్లో అమెరికా తరచు జోక్యం చేసుకుంటూ దురాక్రమణ ధోరణితో వ్యవహరిస్తోందని ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ (ఒఎఎస్)లో వెనిజులా రాయబారి శామ్యూల్ మోన్‌కాడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన వెనిజులా జాతీయ అసెంబ్లీని నిర్లక్ష్యం చేస్తున్న ధోరణిని ఆయన ట్విట్టర్‌లో తప్పుపట్టారు. గత నెల 30న జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను వ్యతిరేకిస్తూ అమెరికా అహంకారంతో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. వెనిజులా ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును తప్పుపడుతున్న దేశాలన్నీ ప్రజాస్వామ్యానికి ద్రోహం చేస్తున్నవేనన్నారు. తమ దేశంలో ఇతరులు జోక్యం చేసుకోవటానికి వీల్లేదంటున్న అమెరికా ప్రభుత్వం ఇతర దేశాల వ్యవహారాలలో అనుచిత జోక్యం చేసుకుంటూ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని ఆయన మండిపడ్డారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ అటార్నీ జనరల్‌ను తొలగిస్తే అది చట్టబద్ధమంటున్న అమెరికా, వెనిజులాలో అధ్యక్షుడు తన రాజ్యాంగ పరిధిలో అదే పనిచేస్తే చట్టవిరుద్ధమని వాదించటం విడ్డూరంగా వుందన్నారు. ట్రంప్ సర్కారు కేవలం అమెరికానే పాలిస్తోంది తప్ప వెనిజులాను కాదని ఆయన స్పష్టం చేశారు. అమెరికా నిఘా సంస్థ సిఐఎ, జాతీయ భద్రతా మండలి, విదేశాంగ శాఖతో పాటు అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలి కాలంలో చేపడుతున్న చర్యలన్నీ వెనిజులా ప్రజలపై దురాక్రమణ యత్నాలేనన్న విషయాన్ని స్పష్టం చేస్తున్నాయన్నారు.

రక్కా స్వాధీనం క్రమంలో అమెరికా పాశవికత

సిరియా విమర్శ

డెమాస్కస్: ఇప్పటి వరకూ ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) మిలిటెంట్ సంస్థ ఆధీనంలో వున్న రక్కాను స్వాధీనం చేసుకునేందుకు చేసే ప్రయత్నాలలో అమెరికా అత్యంత పాశవికంగా అనేక యుద్ధ నేరాలకు పాల్పడుతోందని సిరియా విమర్శించింది. రక్కా పట్టణం నుండి ఐఎస్ మిలిటెంట్లను తరిమికొట్టేందుకు రెండు నెలల పాటు జరిగిన భీకర పోరులో అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో మహిళలు, చిన్నారులతో సహా అనేక మంది సిరియన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని లండన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వే టరీ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ వెల్లడించింది. రక్కా పట్టణంపై జరిగిన దాడుల్లో కనీసం 50 మందికి పైగా పౌరులు మరణించారని సిరియాలో బషర్ అల్ అసద్ సర్కారును తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఈ సంస్థ వెల్లడించింది. తాజాగా మంగళవారం నాడు జరిగిన వైమానిక దాడిలో మహిళలు, చిన్నారులతో సహా 13 మంది పౌరులు మరణించారని, మరో 30 మందికి పైగా గాయపడ్డారని తెలిపింది.

ట్రంప్‌కు నానాటికీ తగ్గుతున్న ప్రజాదరణ



తాజా ఒపీనియన్ పోల్‌లో వెల్లడి

వాషింగ్టన్: అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తనకు గత ఎన్నికల్లో లభించిన ప్రజాదరణను వేగంగా కోల్పోతున్న వైనాన్ని తాజా ఒపీనియన్ పోల్స్ కళ్లకు కడుతున్నాయి. గాలప్ వంటి మీడియా సంస్థలతో పాటు పలు టెలివిజన్ నెట్‌వర్క్‌లు, అటు డెమొక్రాట్లతో పాటు, ఇటు రిపబ్లికన్లకు సన్నిహితంగా వున్న పోలింగ్ సంస్థలు నిర్వహిస్తున్న సర్వేలన్నింటిలోనూ ఒకే రకమైన ఫలితాలు వెల్లడవుతున్నాయి. ట్రంప్‌కు గత ఎన్నికల్లో లభించిన మద్దతు ముఖ్యంగా అల్పాదాయ శ్వేతజాతీయుల నుండి లభించిన మద్దతు గణనీయంగా తగ్గిపోయినట్లు అధ్యయన ఫలితాలు చెబుతున్నాయి. ఇప్పటికే అత్యంత తక్కువ స్థాయిలో వున్న మైనార్టీ ఓటర్ల మద్దతు నాటకీయంగా పడిపోయిందని ఈ ఫలితాలు వెల్లడిస్తున్నాయి. అధ్యక్షుడిగా ట్రంప్ పనితీరుపై ప్రతి అధ్యయనంలోనూ అత్యంత తక్కువ స్థాయి మద్దతు వ్యక్తమవుతోంది. ఇన్వెస్టర్స్ బిజినెస్ డైలీ పోల్‌లో 32 శాతం, క్విన్నిపాక్ యూనివర్శిటీ పోల్‌లో 33 శాతం, సిబిఎస్ సర్వేలో 37 శాతం మేర మద్దతు పడిపోగా రాయిటర్స్ వార్తాసంస్థ పోల్‌లో 38 శాతం తగ్గుదల నమోదయింది. ఒక అమెరికన్ అధ్యక్షుడికి తొలి ఏడాదిలో లభించే మద్దతుకు సంబంధించి ఇవన్నీ రికార్డు స్థాయి తిరోగమన ఫలితాలేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. సాధారణంగా ఒక యుద్ధంలో ఓటమి, లేదా ఆర్థిక వ్యవస్థ పతనం, సామాజిక విపత్తులు, లేదా భారీ కుంభకోణాలు జరిగితే ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, అపనమ్మకం పెరిగి, ఇటువంటి ఫలితాలు నమోదవుతాయని నిపుణులు చెబుతున్నారు. రిపబ్లికన్ పార్టీని బాగా అభిమానించే వారే ట్రంప్‌కు 41 శాతం మేర మద్దతు తెలుపుతున్నారు. వీరి అసంతృప్తి రేటు 57 శాతం మేర వుంది. ప్రాంతాలు, రాష్ట్రాల వారీగా జరిగిన సర్వేల్లో సైతం ట్రంప్‌కు లభిస్తున్న ప్రజాదరణ నానాటికీ దిగజారుతోందన్న విషయాన్ని అనేక సర్వేలు వెల్లడిస్తున్నాయి.

చైనా భూకంపంలో 13కు పెరిగిన మృతుల సంఖ్య



- సత్వర సహాయానికి అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పిలుపు

బీజింగ్: చైనా నైరుతి ప్రాంతంలో వున్న సిచువాన్ ప్రావిన్స్‌లో మంగళవారం రాత్రి సంభవించిన భారీ భూకంపంలో మృతుల సంఖ్య 13కు చేరినట్లు ప్రావిన్షియల్ ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రిక్టర్ స్కేల్‌పై 7.0 పాయింట్ల తీవ్రతను నమోదు చేసిన ఈ భూకంపంలో మరో 175 మందికి పైగా గాయపడినట్లు ఈ వర్గాలు వివరించాయి. మంగళవారం రాత్రి 9.19 గంటల సమయంలో సంభవించిన ఈ ప్రకంపనల ధాటికి ఈ ప్రాంతంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన జియుఝైగో దద్దరిల్లింది. క్షతగాత్రులను వైద్య చికిత్స నిమిత్తం ఝైగో నగరంలోని ప్రజా వైద్యశాలలకు తరలించారు. సిచువాన్ ప్రావిన్స్‌లో సంభవించిన భూకంప బాధితులకు సత్వర సాయం అందించేందుకు అన్ని వర్గాల ప్రజలు ముందుకు రావాలని అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. భూకంప ప్రభావాన్ని అంచనా వేస్తున్న అధికారులు నిర్వాసితులైన ప్రజలను, సందర్శకులను అక్కడి నుండి సురక్షిత ప్రదేశాలకు తరలించే ప్రక్రియను చేపట్టారు. క్షతగాత్రులకు, నిర్వాసితులకు వీలయినంత త్వరగా సాయం అందించి వారిని ఆదుకోవాలని సీ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇటీవలే ప్రారంభమైన పర్యాటక సీజన్, వరదల తరుణంలో ఈ భూకంపం సంభవించిన నేపథ్యంలో ప్రజలు, వారి ఆస్తులను కాపాడేందుకు అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేయాలని ఆయన సూచించారు. బాధిత ప్రజలకు సహాయ, పునరావాస కార్యక్రమాలను సత్వరమే అందచేసేందుకు ప్రయత్నించాలని ప్రధాని లీ కెకియాంగ్ స్థానిక అధికారులకు సూచించారు. సహాయ కార్యక్రమాల పర్యవేక్షణ, మార్గదర్శకత్వం కోసం చైనా ప్రభుత్వం జాతీయ సహాయక బృందాన్ని భూకంప ప్రభావిత ప్రాంతాలకు పంపింది. స్థానిక ప్రభుత్వాలు సైతం సహాయ కార్యక్రమాలు ముమ్మరం చేశాయి.

రక్షణ రంగంపై జపాన్ తాజా శ్వేతపత్రం

సైనిక విస్తరణపై సాకులు చెబుతోందంటున్న చైనా నిపుణులు

బీజింగ్: జపాన్ తన రక్షణ రంగంపై తాజాగా విడుదల చేసిన శ్వేతపత్రంలో చైనా నుండి ముఖ్యంగా తూర్పు, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాల నుండి ముప్పు ఎదురవుతోందంటూ తన సైనిక విస్తరణపై కుంటి సాకులు చెబుతోందని చైనా నిపుణులు చెబుతున్నారు. 2017 రక్షణ రంగ శ్వేతపత్రానికి జపాన్ కేబినెట్ మంగళవారం ఆమోదముద్ర వేసింది. దాదాపు 34 పేజీలున్న ఈ శ్వేతపత్రంలో తూర్పు, దక్షిణ చైనా సముద్ర ప్రాంతాలలో చైనా నౌకాదళ కార్యకలాపాలను విమర్శించేందుకు ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది మార్చి వరకూ ఈ ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో చైనా యుద్ధ విమానాల దాడులను తాము ఎదుర్కొన్నామని, ఇటీవలి కాలంలో ఇవి రికార్డు స్థాయిలో పెరిగాయని ఈ శ్వేతపత్రంలో పేర్కొన్నారు. ఇప్పటి నుండి జపాన్ సముద్రంలో చైనాకు చెందిన నౌకాదళ, వాయుసేనల కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం వుందని, చైనా నౌకాదళ కార్యకలాపాలను నిశితంగా గమనించాల్సిన అవసరం వుందని ఈ శ్వేతపత్రం వివరిస్తోంది. ఈ శ్వేతపత్రంపై స్పందించిన చైనా తమ జాతీయ రక్షణ వ్యవస్థపై జపాన్ బాధ్యతా రహితంగా విమర్శలు చేస్తోందని, తమపై బురదజల్లుతోందని చైనా అధికార వార్తా సంస్థ సిన్హువా విమర్శించింది. చైనాతో ముప్పు పొంచి వుందని, దాన్ని బూచిగా చూపుతూ అమెరికాతో అంటకాగటం ఈ ప్రాంత శాంతి, సుస్థిరతలకు తీవ్ర విఘాతం కలిగిస్తుందని సిన్హువా వ్యాఖ్యానించింది.

అమెరికా వైమానిక స్థావరంపై క్షిపణి దాడికి ప్రణాళిక సిద్ధం

ఉ.కొరియా ప్రకటన



ప్యాంగ్‌యాంగ్: అమెరికా తమ దేశంపై కొనసాగిస్తున్న కవ్వింపు చర్యల నేపథ్యంలో గువాంలోని అమెరికా వైమానిక స్థావరంపై దాడి చేసేందుకు అవసరమైన ప్రణాళికను సిద్ధం చేసినట్లు ఉ.కొరియా ప్రకటించింది. అమెరికా యుద్ధ విమానాలు తమ దేశంపై జరిపిన విన్యాసాలను తీవ్రంగా ఖండించిన ఉ.కొరియా సైనిక ప్రతినిధి ఇవి 'అణుయుద్ధ విన్యాసాల' తరహాలో వున్నాయని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరహా విన్యాసాల ద్వారా అమెరికా ప్రాంతీయంగా ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని ఆయన విమర్శించారు. ఈ విన్యాసాల నేపథ్యంలో గువాంలోని అమెరికా వైమానిక స్థావరంపై మధ్యశ్రేణి ఖండాంతర రాకెట్ హ్వాసాంగ్–12 తో దాడి చేసే అంశాన్ని తాము నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను ఇప్పటికే సిద్ధం చేశామని, దీనిని అమలు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఈ ప్రతిపాదనను అధ్యక్షుడు కిమ్‌జోంగ్ ఉన్‌కు త్వరలోనే సమర్పిస్తామని, ఆయన నిర్ణయం తీసుకుంటే 'ఏ క్షణానైనా' తాము దాడి చేస్తామని ఆయన వివరించారు. తమ దేశం స్వర్గధామమని, దుర్భేద్యమని అమెరికా పగటి కలలు కంటున్నదని ఆయన విమర్శించారు. తమ దేశంపై సైనిక పరమైన కవ్వింపు చర్యలకు వెంటనే తెరదించాలని, లేకుంటే తాము సైనిక ప్రతిచర్యపై నిర్ణయం తీసుకోవటం అనివార్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. తమ వైమానిక దళానికి చెందిన రెండు బి–1బి బాంబర్ విమానాలు ద.కొరియా, జపాన్ యుద్ధ విమానాలతో కలిసి కొరియా ద్వీపకల్పంపై పది గంటల పాటు యుద్ధ విన్యాసాలు నిర్వహించినట్లు అమెరికా పసిఫిక్ వాయుసేనలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటనలకు మరింత ఆజ్యం పోసిన ట్రంప్ మంగళవారం మరింత ఘాటు పదజాలంతో ఉ.కొరియాను హెచ్చరించారు. ఉ.కొరియా తన కవ్వింపు చర్యలను కొనసాగిస్తే తాము వాటిని ధీటుగా ఎదుర్కొంటామని, ఆ పరిణామాలు ప్రపంచం ఇంతకు ముందెన్నడూ చూడని రీతిలో వుంటాయని ఆయన వ్యాఖ్యానించారు.

మొదటి పేజీ తరువాయి

పని ఫుల్.. సిబ్బంది నిల్

ఎలా అనేది ఆందోళన కలిగిస్తోంది. గత మార్చిలో నిర్వహించిన బడ్జెట్ సమావేశాల్లో కూడా ఈ సమస్య కొట్టొచ్చినట్లు కనిపించిందని ఉన్నతాధికారులు గుర్తు చేస్తున్నారు. విభజన నేపథ్యంలో ఎసి శాసనసభకు 218 పోస్టులు కేటాయించారు. కానీ వాటిలో 179 పోస్టుల్లో ఉద్యోగులు లేరు. పోస్టుల కన్నా ఉద్యోగుల సంఖ్య బాగా తక్కువగా ఉండడంతో పాలనపరంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా రిపోర్టర్ల ఖాళీలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ రిపోర్టర్లు శాసనసభ జరుగుతున్నంతసేపూ సభ్యుల మాటలను తూచా తప్పకుండా షార్ట్‌హ్యాండ్‌లో రాయాల్సి ఉంటుంది. ప్రతి రిపోర్టర్ పది నిముషాల చొప్పున రాసి వేరే వాళ్లకు బాధ్యత అప్పగించాల్సి ఉంటుంది. ఇంగ్లీష్ రిపోర్టర్ పోస్టులు 12 ఉండగా, వాటిలో ఏకంగా పది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. తెలుగు రిపోర్టర్ పోస్టులు 21 ఉంటే, ఇందులోనూ పది పోస్టులు ఖాళీయే. ఇందువల్ల సభ్యుల ప్రసంగాలను రాయడంలో రిపోర్టర్లకు పని భారం పెరిగిపోతోంది. చౌకీదార్లు కూడా 22 మందికిగాను 15 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చివరకు ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు 67 ఉండగా, 57 పోస్టులు ఖాళీగా ఉండడం, టైపిస్ట్–అసిస్టెంట్ పోస్టులు 16 ఉండగా, అవన్నీ ఖాళీగానే ఉండడం శాసనసభ విధులపై ప్రభావం పడుతోంది.

దైనందిక విధుల్లో రీసెర్చ్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు కూడా కీలకమే. ఏడు రీసెర్చ్ అధికారుల పోస్టుల్లో ఆరు, ఏడు డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుల్లో ఏడు ఖాళీగానే ఉన్నాయి. ఇతర పోస్టుల్లోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది. ఈ నేపథ్యంలోనే పోస్టుల భర్తీ కోసం మరోసారి శాసనసభ సచివాలయ అధికారులు ఆర్థిక శాఖను ఆశ్రయించారు. ఆర్థిక మంత్రే శాసనసభా వ్యవహారాలనూ చూస్తుండడంతో పోస్టుల భర్తీకి అనుమతి వస్తుందని అసెంబ్లీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పోస్టులు భర్తీ చేయకపోతే విధి నిర్వహణ సాధ్యం కాదని ఆర్థిక శాఖకు పంపించిన ప్రతిపాదనల్లో అసెంబ్లీ అధికారులు ఘాటుగానే స్పష్టం చేయడం గమనార్హం. ప్రస్తుతం కొద్దిపాటి మందితో పాటు, మరో 50 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో నెట్టుకు వస్తున్నామని, తక్కువ సిబ్బందితోనే రాజ్యసభ, ఎమ్మెల్సీ, రాష్ట్రపతి ఎన్నికల వంటివీ నిర్వహించాల్సి వస్తోందని ఈ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఉన్న క్యాడర్ పోస్టులకు అదనంగా 91 మందిని ఔట్ సోర్సింగ్ ద్వారా నియమించుకునేందుకు అనుమతించాలని అసెంబ్లీ అధికారులు ఆర్థిక శాఖను కోరుతున్నారు. వీరిని అసెంబ్లీ, శాసన మండలి, హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే వసతి గృహాల్లోను వినియోగించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నవ్య అరకుకు నాంది

(మొదటి పేజీ తరువాయి)

వాసులకు సహకరించేలా తయారు కావాలన్నారు. గిరిజన ప్రాంతంలో విద్య, వైద్య, ఆరోగ్య పరిస్థితులను మెరుగుపర్చేందుకు కొట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారని, ఈ అవకాశాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అరకులో ప్రకృతి వైద్యశాలలను ఏర్పాటు చేస్తే పర్యాటక పరంగా మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని చెప్పారు.

గిరిజనులకు అటవీ భూములపై పట్టాలిస్తాం : సిఎం

ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అరకులో ప్రయివేటు, ప్రభుత్వ భాగస్వామ్య (పిపిపి) పద్ధతిలో రూ.110 కోట్లతో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఫారెస్టు రీసార్ట్స్ వంటి ప్రాజెక్టులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. అరకు బెలూన్ ఫెస్టివల్, ఎల్లోఫ్లవర్, వాటర్‌ఫాల్స్‌పై ప్రత్యేక క్యాలెండర్ వేయనున్నట్లు చెప్పారు. అరకును మోడల్ టూరిజంగా తయారు చేసే వరకు గిరిజన ప్రాంతానికి తాను అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. విద్య, వైద్యం, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. విశాఖపట్నం నుంచి హెలికాప్టర్లో అరకు వచ్చి పోయేలా టూరిజం అభివృద్ధి చెందాల్సి ఉందని అన్నారు. గిరిజనుల మనోభావాలను గౌరవించి బాక్సైట్ తవ్వకాలను నిలిపివేశామంటూనే సహజ, ప్రకృతి సంపదను వినియోగించుకోవాల్సి ఉందని చెప్పుకొచ్చారు. జిసిసి సబ్బుల తయారీ కంపెనీలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.6 వేలు కనీస వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖ మన్యంలో ఐదు లక్షల ఎకరాల్లో కాఫీ పంట వేసుకొనేలా ప్రణాళిక తయారు చేసుకోవాలని సూచించారు. గిరిజనులకు అటవీ భూములపై పట్టాలిస్తామన్నారు. అరకును టూరిజం హబ్‌గా తయారు చేసి ఇక్కడ యువత ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లకుండా ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదర్శంగా తయారు చేసేందుకు పెదలబుడును తాను దత్తత తీసుకున్నానని ముఖ్యమంత్రి చెప్పారు. మంచి భవిష్యత్ ఉన్న అరకును మెడికల్ అండ్ హెల్త్ హబ్‌గా తయారు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. వైద్యుల ఖాళీలను కూడా భర్తీ చేసి వైద్య సదుపాయం మెరుగుపర్చనున్నట్లు తెలిపారు. డిఐసి తరపున అపరెల్ పార్కు ద్వారా అనుసంధానం చేసి 120 పంచాయతీల్లో ఒక్కో పంచాయతీలో పదివేల రూపాయల ఆదాయం వచ్చేలా ఆలోచిస్తున్నామన్నారు.

రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి నక్కా ఆనందబాబు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సిహెచ్.అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలాం భవానీ, జిసిసి ఎమ్‌డి ఎస్‌పిఎస్ రవిప్రకాష్, గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఆర్‌పి.సిసోడియా, ప్రత్యేక కమిషనర్ డాక్టర్ ఎం.పద్మ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సృజన, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి రవిసుభాష్ పఠాన్‌శెట్టి, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ తదితరులు పాల్గొన్నారు.



.అరకు కాఫీ తాగుతున్న గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబు

మా పోటీతోనే నిధులు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల కురుక్షేత్రానికి నంద్యాల ఉపఎన్నిక నాంది కావాలన్నారు. ఓటుకు రూ.5వేలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని చెప్పారు. ఇలాంటి దుర్మార్గుడికి ఓటు ద్వారా ఇంటికి పంపాలని ప్రజలను కోరారు. చంద్రబాబు నాయుడులా అబద్దాలు చెప్పి ఉంటే తానే ముఖ్యమంత్రి సీటులో ఉండేవాడినని అన్నారు. ఎన్నికల ముందు అబద్దాల వాగ్ధానాలు ఇచ్చినట్లుగానే ముఖ్యమంత్రి అయ్యాక కూడా అన్నీ తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నంద్యాలను జిల్లాగా మార్చడంతో పాటు మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతానని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందేలా తమ పార్టీ నవరత్నాలను రూపొందించిందని పేర్కొన్నారు. నంద్యాల నియోజకవర్గంలో మంచి వ్యక్తిగా, సౌమ్యుడిగా పేరు ఉన్న శిల్పా మోహన్ రెడ్డిని గెలిపించి, టిడిపికి బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు.

నినాదం మారింది

(మొదటి పేజీ తరువాయి)

మతతత్వ సిద్ధాంతాలతో పనిచేసే శక్తుల చేతిలోకి భారత దేశం వెళ్లిపోకుండా కాపాడుతామని పేర్కొన్నారు. ప్రస్తుతం లౌకికవాదం, భావప్రకటనాస్వేచ్ఛ ప్రమాదంలో పడ్డాయని, స్వాతంత్ర్యసమరయోధులు సాధించిపెట్టిన స్వేచ్ఛను కాపాడుకోవాలంటే విచ్ఛిన్నశక్తులను ఓడించాలని సోనియాగాంధీ అన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జైలు జీవితం గడిపారని, చాలా మంది కాంగ్రెస్ నేతలు జైల్లోనే మరణించారని, నిరసనకారులపై అనేక అణిచివేత చర్యలకు బ్రిటీష్ పాలకులు దిగారని, అయినప్పటికీ వెన్ను చూపకుండా స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టిన వారి త్యాగాలను మరువకూడదని ఆమె వివరించారు. కొన్ని సంస్థలు క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాయని, స్వాతంత్ర్యసంగ్రామంలో వాటి పాత్రే లేదని ఆరెస్సెస్‌ను ఉద్దేశించి పరోక్షంగా ఆమె విమర్శలు గుప్పించారు.

పెత్తందారు పైశాచికం

(మొదటి పేజీ తరువాయి)

గురయ్యేలా చేశాడు. అయితే గోపిని పట్టుకుని ఉన్న బోసుకు కూడా షాక్ తగలడంతో ఒక్కసారిగా గోపీని వదిలి వేశాడు. అక్కడి నుండి గోపీని ఈడ్చుకుంటూ పశువుల చావడిలోకి తీసుకెళ్లాడు. అనంతరం చావడిలో ఉన్న వాసానికి ఉరివేసి చంపేశాడు. అక్కడి నుండి గోపి ఇంటికి వెళ్లి "నీ కొడుకును చంపా.. ఇంట్లో చావడికి వేళ్లాడుతున్నాడు" అని బోసు చెప్పి హడావుడిగా వెళ్లిపోయాడు. దీంతో గోపి తల్లి నాగలక్ష్మి పరుగున బోసు ఇంటికి వెళ్లి చూసేసరికి గోపి చావడిలో వాసానికి వేళాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న స్థానికులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గోపి మృతిచెంది ఉండడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోసు వచ్చేంత వరకూ మృతదేహాన్ని అక్కడి నుండి తరలించేదిలేదంటూ భీష్మించుకుని కూర్చున్నారు. సమాచారం అందుకున్న తూర్పు జోన్ ఎసిపి విజయభాస్కర్, సిఐ కె.శ్రీధర్ కుమార్, ఎస్ఐ హనీష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. గోపిని కొట్టుకుంటూ ఇంట్లోకి తీసుకురావడం చూసిన ఆకునూరి లక్ష్మి, దుర్గ, మరో మహిళ నుండి వివరాలు సేకరించారు.

పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్న స్థానికులు

గోపి మృత్యువాతపడిన విషయాన్ని తెలుసుకున్న స్థానికులు పెద్ద సంఖ్యలో బోసు ఇంటి వద్దకు చేరుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకునేంత వరకూ ఇక్కడి నుండి మృతదేహాన్ని తరలించేదిలేదన్నారు. గొడవర్రు సర్పంచి కోనేరు భానుప్రసాద్, మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలతో పోలీసులు మంతనాలు జరుపుతున్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం కోసం తరలిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని, అందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోరుతున్నారు. అయితే హత్యకు కారణమైన బోసును అరెస్టు చేయాలని మృతుడి బంధువులు డిమాండ్ చేస్తున్నారు.



ఏం పాపం చేశాడు

'నా కొడుకు ఏం పానం చేశాడు. రెండేళ్లుగా నమ్మకంగా పనిచేస్తున్న కారణానికి నా కొడుకు ప్రాణం తీశాడు' అంటూ మృతుడి తల్లి నాగలక్ష్మి బోరున విలపించింది. 'నా కొడుకును హత్యచేసిన బోసును అరెస్టు చేయాలి. అప్పటి వరకు నా కుమారుడి మృతదేహాన్ని ఇక్కడి నుండి తరలించేదిలేదు" అని తెగేసిచెప్పింది.

– మృతుడు తల్లి నాగలక్ష్మి

మోడీ సర్కార్ విధానాలతో ఉపాధి నిర్వీర్యం

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పార్లమెంట్‌కు భారీ ర్యాలీ నిర్వహించారు. రామ్‌లీల మైదానం నుండి ప్రారంభమైన ర్యాలీ బారకంబా రోడ్డు, కన్నాట్ ప్లేస్ మీదుగా పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది వ్యవసాయ కార్మికులు ర్యాలీలో పాల్గొన్నారు. దారి పొడవునా కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వ్యవసాయ కార్మికుల ఆందోళనకు సిపిఎం ఎంపిలు ఎ.సంపత్, శ్రీమతి టీచర్, పి.కె బిజూ, ఎం.బి రాజేష్ తదితరులు సంఘీభావం ప్రకటించారు. ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు జ్ఞాన శంకర్ మజుందార్‌లు పాల్గొని మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి విజయ రాఘవన్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరుతో దేశంలో పేదరికం పెరుగుతోందని, గ్రామీణ ప్రజానీకం మరింత దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. మోడీ ప్రతి సభలో నినదించే 'సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్' అంటే ఇదేనా అని ఎద్దేవా చేశారు. కొద్ది మందిగా వున్న కార్పొరేట్ల కోసమే మోడీ నిరంతరం ఆలోచిస్తున్నారని, అత్యధికులైన పేదల గురించి మాత్రం మొసలికన్నీరు కారుస్తున్నాడని ధ్వజమెత్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉద్యోగాలు లేక, ఇల్లు లేక అనేక మంది ఇబ్బంది పడుతున్నారని గుర్తు చేశారు. 1951లో భూమి లేని గ్రామీణులు 28.1శాతముంటే, 1971నాటికి 37.8 శాతానికి పెరిగిందని, 1991 నాటికి 40.3 శాతం, 2011 నాటికి 55 శాతానికి ఇళ్లు లేని గ్రామీణుల సంఖ్య పెరిగిందని వెల్లడించారు. దేశంలో వలసలు నియంత్రించేందుకు వామపక్షాల మద్దతుతో గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంజిఎన్‌ఆర్‌జిఎను ఎన్‌డిఎ సర్కార్ నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. వంద రోజుల పనిని కల్పించాల్సి ఉండగా, కేవలం ఒక కుటుంబానికి 37 రోజులు మాత్రమే పనిని కల్పిస్తున్నారని, అలాగే వారికిచ్చే వేతనాలు నామమాత్రంగా ఉన్నాయని తెలిపారు. పని దినాలు పెంచాలని, కనీసం రూ.250 వేతనం ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎడబ్ల్యుయు జాతీయ అధ్యక్షుడు ఎస్.తిరునవక్కురసు, జాతీయ సహాయ కార్యదర్శి సునీత్ చోప్రా, ఎన్.కె శుక్లా, ఏపి, తెలంగాణ ప్రధాన కార్యదర్శులు వి.వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటరాములు, ఏపి కార్యదర్శి టి.కాంత్రి, ఏపి మహిళ కన్వీనర్ శివ నాగరాణి, కోట కళ్యాణ్(కృష్ణా), ఎ.రవి(తూర్పు గోదావరి), ఈమని అప్పారావు(గుంటూరు), యాదగిరి(నెల్లూరు), నారాయణ(కర్నూల్), టిఎస్ సత్యన్నారాయణ(పశ్చిమ గోదావరి), తెలంగాణ నేతలు వేదగిరి శ్రీను, పెద్ది వెంకట రమణ, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏపి, తెలంగాణ సిఎంలకు తగిన బుద్ధి చెబుతాం: వి.వెంకటేశ్వర్లు

వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులకు తగిన బుద్ధి చెబుతామని ఏపి ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో పేదల భూములను లాక్కొంటున్నాయని విమర్శించారు. ఏపిలో ప్రతి కుటుంబానికి 35 కిలోల రేషన్ ఇస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, అనతి కాలంలోనే ఉన్న రేషన్ కార్డులను తీసేశారని తెలిపారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు 2013 భూ సేకరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరిగాయని అన్నారు. వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉభయ రాష్ట్రాల్లో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సంఘటితంగా ఉద్యమిస్తాయన్నారు.

లై... ఓ డిఫరెంట్ ఫిల్మ్

నితిన్



ప్రజాశక్తి-తిరుపతి సిటి

'లై' ఓ డిఫరెంట్ ఫిల్మ్ అని, హాస్యభరితమైన కుటుంబ కథాచిత్రమని, ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఆ చిత్ర హీరో నితిన్ తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఓ ప్రయివేట్ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో హీరో మాట్లాడారు. తనకు తిరుపతి అంటే చాలా ఇష్టమని, తన తొలిచిత్రం 'జయం' తిరుపతి పాకాల పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ చేశామని గుర్తు చేశారు. అప్పటి నుంచి తన ప్రతి చిత్రం విడుదలకు ముందు తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఆనవాయితీ అని, అందులో భాగంగానే తిరుపతికి వచ్చామన్నారు. లై చిత్రం అబద్ధంతో ప్రారంభమవుతుందని, ఆ తర్వాత జరిగిన పరిణామాలు, అందులోని సన్నివేశాలు అందర్నీ ఆకట్టుకుంటాయన్నారు. సినిమాటోగ్రఫి, ఫోటోగ్రఫీ, కాస్టమ్స్ చాలా కొత్తగా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు తాను చేసిన సినిమాల్లో చాలా డిఫరెంట్ చిత్రంగా ఇది నిలుస్తోందన్నారు. 'శ్రీఆంజనేయం' తర్వాత తాను అర్జున్ దర్శకత్వంలో ఈ సినిమా తీశామన్నారు. హీరోయిన్ మేఘా ఆకాష్ మాట్లాడుతూ ఈ సినిమాలో తన పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉంటుందన్నారు. ప్రతి ఒకర్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దారని, ప్రతి ఒకరూ చూసి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిత్ర నిర్మాత ఆచంట గోపినాథ్, యాక్టర్ మధునందన్ తదితరులు పాల్గొన్నారు.



'నేనొక ఇడియట్ లాంటి లవర్‌ను'


నవీన్ చంద్ర, నివేదా థామస్ జంటగా నటిస్తున్న చిత్రం 'జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్'. కొత్తపల్లి అనురాధ సమర్పణలో అనురాగ్ ప్రొడక్షన్స్ పతాకంపై కొత్తపల్లి ఆర్. రఘుబాబు, కె.బి. చౌదరి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అజయ్ వోధిరాల దర్శకుడు. ఈ సినిమా టీజర్ విడుదల హైదరాబాద్‌లో జరిగింది.

నవీన్‌చంద్ర మాట్లాడుతూ... ప్రతి లవర్ ఒక ఇడియట్టే. టైటిల్‌లో ఉన్నట్లే నేనొక ఇడియట్ లాంటి లవర్‌లా సినిమా కనపడతాను. దర్శకుడు అజయ్ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించాయి. డైలాగ్స్ చాలా బావున్నాయి. గిరీష్ గంగాధర్, ఆర్థర్ ఎ.విలన్స్ ఇద్దరూ సినిమాటోగ్రాఫర్‌లు ఈ సినిమా కోసం పనిచేశారు. పెద్ద టెక్నీషియన్స్‌తో పనిచేయడం అదష్టంగా భావిస్తున్నాను. నివేదా థామస్ చాలా ప్రొఫెషనల్. ఈ సినిమాలో కొత్తగా కనపడుతుంది. షూటింగ్ పనులన్నీ పూర్తయ్యాయి. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. చాలా విలువలున్న ప్రేమకథ. కామెడి సహా అన్ని ఎలిమెంట్స్ ఉండే సినిమా అని తెలిపారు. కొత్తపల్లి ఆర్.రఘుబాబు మాట్లాడుతూ...కథ విన్న తర్వాత నవీన్ చంద్ర అయితే సరిపోతాడనిపించి, ఆయనకు కథ చెప్పడం, ఆయన ఓకే చెప్పడం జరిగాయి. నివేదా థామస్, నవీన్ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరిందన్నారు.

దర్శకుడు మాట్లాడుతూ... సుకుమార్ దగ్గర 'ఆర్య' నుండి '100% లవ్' వరకు పనిచేశాను. సబ్జెక్ట్ బావుంటుంది. ఓ జూలియట్, ఓ ఇడియట్ లవ్ చేస్తే ఎలా ఉంటుందని ఆలోచించి కథ తయారు చేశాం. సీన్స్ అన్నీ బాగా వచ్చాయి. కామెడి, ఎమోషన్స్ అన్ని చక్కగా ఉంటాయి. ఇప్పటికీ నవీన్ అందరూ 'అందాలరాక్షసి' నవీన్ అంటుంటారు. ఈ సినిమాతో జూలియట్ లవర్ ఆఫ్ ఇడియట్ నవీన్‌చంద్ర అంటారని భావిస్తున్నానని అన్నారు.

సమాజానికి ఇలాంటోడు అవసరం

బోయపాటి శ్రీను



నటుడిలోని నటనాకౌశల్యాన్ని గుర్తించి బయటకు రాబట్టేవాడే దర్శకుడు. అలా 'భద్ర' నుంచి 'సరైనోడు' వరకు విపే నటుల్ని వారిలోని ప్రతిభను గుర్తించి తనకనుగుణంగా మార్చుకుని వారిని హైలైట్ చేసిన దర్శకుడు బోయపాటి శ్రీను. ప్రతీ నటులు ఆరోజు ఏం చేయబోతున్నారనేది ముందుగా శిక్షణ ఇచ్చి వారిని మూడ్‌లోకి తీసుకెళ్ళడం తన బాధ్యత అనీ, ఇది ఎన్‌టిఆర్, ఎఎన్ఆర్ కాలంనుంచి వస్తుందనీ.. దాన్ని 'జయ జానకి నాయక'కు అప్లయి చేశానని.. తెలియజేస్తున్నారు. మి॰ా రవీందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడు. ఈ శుక్రవారమే విడు లకానున్న ఈ చిత్రం గురించి ఆయన పలు విషయాలు తెలియజేశారు.

- ఇందులో స్టార్ హీరో లేకపోయినా.. కథను బట్టే వెళ్ళాను. కాస్త ఒత్తిడి అనిపించినా కథ నన్ను లాక్కెల్లింది. ఇప్పటి వరకు చేసిన ప్రతి సినిమాలో సమాజానికి వుపయోగపడే అంశాన్ని ఇస్తూనే వచ్చాను. అలాగే ఈ సినిమాలో మహిళలకు సంబంధించి చక్కటి సందేశం ఉంటుంది. నిజమైన ప్రేమేంటి? మనం అమ్మాయిలను ఎలా కాపాడుకోవాలనేది ఈ సినిమాలో చూపించాను. ఇందులో శ్రీను పలికేడైలాగ్‌లో చాలా పవర్ వుంటుంది. చిరంజీవి, బాలయ్యబాబు నోటివుంచి వస్తే బాటుంటుంది. అలాంటిది 24 కుర్రాళ్ళు అనేశాడు. అసలు లవ్వంటే. ఏమిటి? ఆడపిల్ల అంటే ఏమిటి? అనేది చెబుతాడు. ఇదే సినిమాకు కీలకం. ఈ కథలోని సన్నివేశాలు నా జీవితంలో జరిగిన సంఘటనలూ వున్నాయి. కానీ ఎక్కడా ఆ పేర్లు వాడలేదు. కథానాయకుడిని చూస్తే ఇలాంటి కుర్రాడు సమాజానికి అవసరం. మా ఇంట్లో ఇలాంటివోడు వుండాలని అనుకుంటారు.
- రకుల్‌ప్రీత్‌సింగ్‌తోపాటు ఆరుగులు హీరోయిన్లు నటించారు. కథప్రకారం కొత్తదనం కోసం వారిని ఎంచుకోవడం జరిగింది. క్యాథరిన్, హీరో వదినగా ఎస్తేర్, హీరో ఫ్రెండ్‌గా ధన్యబాలకృష్ణ, సోదరిగా వాణివిశ్వనాథ్ ఇలా ఎవరికి వారు అద్భుతమైన పాత్రలు పోషించారు.
- యాక్షన్ అనేది నాలో భాగమైంది. అందుకే అలాంటి సినిమాలు నా నుండి వస్తాయి. 'జయజానకినాయక' చిత్రం ప్రతి ఒక్కరి గుండెను కదిలించే సినిమా అవుతుంది. 'భద్ర'ను మంచి లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్ ఇలా అన్నింటిని కలగలిపి అందమైన ప్రేమకథగా ఎలా మలిచానో అలాంటి కథే 'జయజానకినాయక'. ఇందులో కూడా ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్ని ఉంటాయి. కొత్తగా ఉండాలనే ఆలోచనతోనే టైటిల్ విషయంలో కొత్తగా ఉండేలా ప్లాన్ చేసుకున్నాను.
- మనకొక క్యారెక్టర్ ఉండాలి. మన మాటకు ఒక విలువుండాలి. అలా 'సరైనోడు తర్వాత బెల్లంకొండ శ్రీనివాస్‌తో సినిమా చేస్తానని మాటిచ్చాను. ఆ మాట కోసం ఈ సినిమా చేశాను. అలాగని ఏదో సినిమా చేయాలని కాకుండా నేను చేసిన ఆరు సినిమాలకంటే ఓ పాయింట్ ఎక్కువగానే ఈ సినిమాను తెరకెక్కించాను.
- 'లెజెండ్' తర్వాత అల్లు అర్జున్‌తో 'సరైనోడు' సినిమా చేస్తుంటే.. ఇది మీకెలా సరిపోతుందని చాలా మంది అన్నారు. అయితే సరైనోడు సినిమాను బన్ని బాడీ లాంగ్వేజ్‌కు తగినట్లుగానే తెరకెక్కించాను. అలాగే బెల్లంకొండ శ్రీనివాస్ బాడీ లాంగ్వేజ్‌కు తగినట్లుగా ఈ సినిమాను తెరకెక్కించాను. డైలాగ్స్ కూడా తన వయసుకు తగ్గట్టే ఉంటాయి. తను ఈ సినిమా కోసం 26 కిలోల బరువు పెరిగాడు. తర్వాత 17 కిలోల వరకు తగ్గాడు.
- ముందు అనుకున్నట్లే బడ్జెట్ ఎక్కువైంది. బిజినెస్ బడ్జెట్‌ను మించి అయ్యింది. ఎందుకంటే నేను సినిమా చేసేటప్పుడు ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్స్ నా సినిమా ఎలా ఉంటుందోనని ఓ అంచనాతో ఉంటారు. ఆ అంచనాలకు తగ్గకుండా సినిమా చేయాలనుకుంటాను. చేస్తాను. అలాగే ప్రతి సినిమాను మొదటి సినిమాలా ఫీలై చేస్తాను. ఈ సినిమాకు నిర్మాత మిర్యాల రవీందర్‌రెడ్డి 'సార్! నేను జీవితంలో చెప్పుకునే సినిమా ఒకటి చేయాలి. తెలుగు ప్రేక్షకులకు దగ్గరవ్వాలి. డబ్బుతో నాకు సంబంధం లేదు' అని చెప్పాడు. తన మాట ప్రకారం ఎక్కడ ఎంత అవసరమో అంతగా ఖర్చు పెట్టి చేసిన సినిమా ఇది.

చిరు, బాలయ్య, అఖిల్, మహేష్‌బాబు

- ప్రస్తుతం చిరంజీవి 'ఉయ్యాలవాడ నరసింహారెడ్డి' సినిమా చేయబోతున్నారు. తర్వాత ఏ సినిమా చేస్తారో తెలియదు కానీ, ఆయనకు కథ రెడీ చేసేశాను. రెండు నెలలు ఇంకా టైమ్ తీసుకుని ఇంకా బాగా వచ్చేలా రాసుకుంటున్నాను. అలాగే మహేష్‌కూ కథ సిద్ధం చేశా. ఇప్పటి వరకు ఆయన చేయని పాత్ర అది. దానికోసం డేట్స్ ఎక్కువ కావాల్సి ఉంటుంది. అలాగే వచ్చే ఏడాది జూన్, జూలైనాటికి బాలయ్యబాబుతో సినిమా స్టార్ట్ చేసేస్తాను. ఇక అఖిల్ మంచి ఫ్రెండ్. తనకు లైన్ రెడీ చేశాను. తను ఆల్‌రౌండర్. అయితే సమయాన్ని బట్టి ఏది న్యాయం చేయగలనో అని నిర్ణయించుకుని సినిమా ప్రకటిస్తాను.

సృజనాత్మకకు నిర్మాత తోడుకావాలి

హను రాఘవపూడి

'అందాల రాక్షసి', 'కృష్ణగాడి ప్రేమగాథ' చిత్రాల తర్వాత నితిన్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వం వహించిన చిత్రం 'లై'. 14 రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట, అనీల్ నిర్మించిన ఈ సినిమా ఈ శుక్రవారమే విడుదల కాబోతుంది. విదేశాల్లో ఎక్కువశాతం తీసిన ఈ చిత్రం గురించి దర్శకుడు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆవిశేషాలు.



- నా ప్రతీ సినిమాలో లవ్ కామన్‌గా ఉంటుంది. ఆ పాయింట్ తోనే మిగతా కథను అల్లుకుంటా. ప్రేమలో ఒక్కొక్కరిది ఒక్కో స్టయిల్ ఉంటుంది. నా క్రియేటివిటీని వాడి డిఫరెంట్‌గా కథ రాసుకుంటా. 'లై' సినిమా ప్రేమ ప్రధానంగా సినిమానే. అయితే ఇందులో యాక్షన్ కూడా ఉంటుంది. అది భారీ స్థాయిలో నే ఉంటుంది. నాకు తెలిసి లవ్ లేకుండా ఏ సినిమా కూడా ఉండదు. సినిమాను బట్టి స్పాన్ మారొచ్చు, లెవల్ మారొచ్చు.
- మన దేశంలోనే మంచి లోకేషన్స్ ఉన్నాయి. కానీ నా కథకు అవి సరిపోవు. అందుకే అమెరికాలో చేశాం. లోకేషన్స్ అన్నీ నా కథకు బాగా కుదిరియి. తగినట్లుగానే సినిమా అందంగా కన్పిస్తుంది. 95 రోజుల్లో చిత్రీకరణ పూర్తిచేశాం. సినిమాను కొంచెం డిఫరెంట్‌గా షూట్ చేశాం. మేకింగ్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. సన్నివేశాలను రాసుకోవడాన్ని బట్టే మేకింగ్ కూడా డిసైడ్ చేస్తాను.
- అర్జున్‌గారంటే చిన్నప్పటినుంచీ ఇష్టం. ఆయన నటించిన సినిమాలన్నీ చూశాను. ఆయనతో కలిసి ఓ సినిమాకు పనిచేయాలని ఉండేది. ఇన్నాళ్లకు అది వీలైంది. నిర్మాత సుధాకర్‌రెడ్డి ఓనాడు ఆయన్ను కలిపించారు. కథను ఆయనకు వినిపించాను. ఆయనకు నచ్చడంతో చేస్తానని వెంటనే ఒకే చేశారు. ఆయనలా అన్న రోజునే సినిమా హిట్ అవుతుందనే నమ్మకం బలంగా కల్గింది. ఆయన క్యారెక్టర్ చాలా స్టయిలిష్‌గా ఉంటుంది. సినిమాకు హైలైట్ పాయింట్ అవుతుంది.
- కథకు తగ్గట్లు, నితిన్ మార్కెట్ వేల్యూను అనుసరించే సినిమా మేకింగ్ చేశాం. అనీల్ ప్లానింగ్ బాగుంది. రేపు సినిమాను తెరపై చూస్తే 70 కోట్ల సినిమా చూస్తున్నట్లు అనిపిస్తుంది. నిర్మాతలు నాకెంతో స్వేచ్ఛ ఇచ్చారు. అది తెరపై కనపడుతుంది.
- దర్శకుడిగా నా జర్నీని ఎంజాయ్ చేస్తున్నాను. సినిమా హిట్ అయితే పొంగిపోవడం, ఫ్లాప్ అయితే కుంగిపోవడం తెలియదు. స్థిరత్వంతో ఉంటాను. అందుకు కారణం. నా స్నేహితులు. నా చుట్టు ఉన్న వాతావరణం.
- సృజనాత్మకతను బయట పెట్టాలంటే నిర్మాతలు కూడా అలా వుండాలి. వారిలో అంత తపన ఉంటే ఇలాంటి స్టోరీలు బయటకు వస్తాయి. లేదంటే అవి మైండ్‌లోనే ఇంకిపోతాయి. నిర్మాతలు లేనిదే నేను లేను. ఇప్పటివరకూ నేను చేసిన సినిమాలన్నీ వినూత్నంగానే ఉన్నాయి.
- నానితో ఓ సినిమా ప్లాన్ చేస్తున్నాను. ఆర్మీ బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ అది. లడక్‌లో సినిమా రన్ అవుతుంది. కాబట్టి వచ్చే మే వరకు షూటింగ్ చేయలేం. అలాగే నాని కూడా ఇతర సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ గ్యాప్‌లో మరో సినిమా చేయడానికి ప్లాన్ చేస్తున్నా.

సాయిధరమ్ తేజ్‌తో సి.కళ్యాణ్ చిత్రం



సి.కళ్యాణ్, వినాయక్, సాయిధరమ్ తేజ్, సివి. రావ్

ఇటీవలే బాలకృష్ణతో సినిమాను ప్రారంభించిన సి. కళ్యాణ్ ఇప్పుడు చిరంజీవి కుటుంబానికి చెందిన సాయిధరమ్ తేజ్‌తో నిర్మిస్తున్నారు. వినాయక్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం బుధవారం లాంఛనంగా హైదరాబాద్‌లో ప్రారంభమైంది. లావణ్య త్రిపాఠి కథానాయికగా నటిస్తోంది. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై రూపొందనున్న చిత్రానికి చిరంజీవి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. సాయిధరమ్‌తేజ్‌పై తీసిన ముహూర్తపు సన్నివేశానికి రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు క్లాప్ ఇవ్వగా, మరో రచయిత సత్యానంద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ చిత్రానికి కథ, మాటలు అందించిన ఆకుల శివ గౌరవ దర్శకత్వం వహించారు. సాయిధరమ్ తేజ్ అమ్మగారైన విజయదుర్గ స్క్రిప్ట్‌ని అందించారు. ఇప్పటివరకు చేసిన సినిమాలతో ఎనర్జిటిక్ హీరోగా పేరు తెచ్చుకున్న సాయిధరమ్‌తేజ్, వి.వి.వినాయక్ కాంబినేషన్‌లో రూపొందుతున్న మరో పవర్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఇదని నిర్మాత తెలియజేశారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందే ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సెప్టెంబర్ మొదటి వారంలో ప్రారంభమవుతుందన్నారు. సినిమాటోగ్రఫీ: విశ్వేశ్వర్, ఎడిటింగ్: గౌతంరాజు, ఆర్ట్: బ్రహ్మ కడలి, సహనిర్మాతలు: సి.వి.రావు, పత్స నాగరాజా.

బెజవాడలో రానా సందడి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ (విజయవాడ)

నేనే రాజు... నేనే మంత్రి సినిమా గొప్ప విజయం సాధిస్తుందన్న నమ్మకం తనకుందని హీరో దగ్గుపాటి రానా అన్నారు. శుక్రవారం నేనే రాజు.. నేనే మంత్రి సినిమా విడుదల కానున్న సందర్భంగా ప్రమోషన్లలో భాగంగా నగరంలోని ట్రెండ్‌సెట్ మాల్‌లో సినిమా యూనిట్ సందడి చేసింది. ఈ సందర్భంగా రానా మాట్లాడుతూ.. సినిమా పేరు వింటే రాజకీయ నేపథ్యం అనుకుంటారని, కానీ రాజకీయ నేపథ్యం చాలా తక్కువగా ఉంటుదని అన్నారు. కుటుంబ సమేతంగా చూడదగిన గొప్ప చిత్రమని తెలిపారు. సినిమాలో మంచి ప్రేమ కథా ఉంటుందని చెప్పారు. మంచి కథ దొరికితే బాబాయ్ వెంకీతో నటిస్తానని తెలిపారు. తాను కొత్త తరహా పాత్ర పోషించిన ఈ సినిమా చాలా బాగా వచ్చిందన్నారు. సినిమా దర్శకుడు తేజ ఎంతో కష్టపడి సినిమా రూపొందించారని చెప్పారు. కథానాయిక కాజల్ మాట్లాడుతూ.. తన మొదటి సినిమా దర్శకుడు తేజతోనే 50వ చిత్రాన్ని చేయడం విశేషమన్నారు. సినిమాలో తన క్యారెక్టర్ చాలా బాగా వచ్చిందన్నారు. నిర్మాతలు కిరణ్‌రెడ్డి, భరత్‌లు మాట్లాడుతూ.. తాము తీసే తొలి సినిమాను దగ్గుపాటి సురేష్‌బాబు సహకారంతో గొప్ప చిత్రంగా చేశామన్నారు. సినిమాను ప్రేక్షకులు విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ట్రెండ్‌సెట్ మాల్‌లో ట్రైలర్ పాటను ప్రదర్శించారు.



విజయవాడలోని ట్రెండ్‌సెట్ మాల్‌లో 'నేనే రాజు నేనే మంత్రి' చిత్ర నటీనటులు

'రావోయి మా ఇంటికి' గీతాలు



తెలుగు, హిందీ, మలయాళ భాషల్లో పలు చిత్రాలకు సంగీతం అందించిన సాకేత్ సాయిరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'రావోయి.. మా ఇంటికి'. బ్లాక్ పెప్పర్ స్క్రీన్స్ పతాకంపై డాలీభట్ నిర్మిస్తున్నారు. శ్రీధర్, కావ్యాసింగ్, అవంతిక జంటగా నటిస్తున్నారు. సాకేత్ సాయిరామ్ కీలక పాత్ర పోషిస్తూ సంగీతం కూడా అందిస్తున్నారు. పాటల ఆవిష్కరణ బుధవారం ఫిలింఛాంబర్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తొలి సీడిని ఆవిష్కరించి సీనియర్ దర్శకుడు రేలంగి నరసింహారావుకు అందజేశారు. అనంతరం భరద్వాజ మాట్లాడుతూ, సాకేత్ నా చిత్రంతోనే సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యారు. మంచి మ్యూజిక్ డైరెక్టర్. చాలా సినిమాలకు మ్యూజిక్ అందించారు గానీ, అనుకున్నంత గుర్తింపు రాలేదు. థ్రిల్లర్ కామెడీ నేపథ్యంతో సినిమా తెరకెక్కించాడు. బాగా వచ్చిందనుకుంటున్నా. పాటలు, సినిమా విజయం సాధించి అందరికీ మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. రేలంగి నరసింహారావు మాట్లాడుతూ.. సాకేత్ సమకూర్చే బాణీలు కొత్తగా వినసొంపుగా ఉంటాయి. కానీ ఆశించిన గుర్తింపు రాలేదు. ఈ సినిమాతో అన్ని విధాలుగా సక్సెస్ అవుతాడని ఆశిస్తున్నా. టైటిల్ బాగుంది. టైటిల్ లోగో చూస్తుంటే క్రైమ్ స్టోరీలోనే కామెడీని హైలైట్ చేస్తూ తెరకెక్కించినట్లున్నారు. యువతతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా ఇదని అన్నారు.దర్శకుడు సాకేత్ సాయిరాం మాట్లాడుతూ, 30 శాతం థ్రిల్లర్, 70 శాతం కామెడీ అంశాలతో తెరకెక్కించిన సినిమా ఇది. కాన్సెప్ట్‌ను నమ్ముకుని తెరకెక్కించాం. కథే హీరో. ప్రతీ పాత్రలోనూ వైవిధ్యం ఉంటుంది. మొత్తం 5 పాటలున్నాయి. అన్ని వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. సినిమా చాలా క్వాలిటీగా ఉంటుంది. పాటలు, సినిమా పెద్ద విజయం సాధిస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు. తన పాత్రలో మూడు కోణాలు కనిపిస్తాయని' హీరో శ్రీధర్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత కె. దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, ఇష్టపడి తెరకెక్కించాం. మంచి అవుట్ ఫుట్ వచ్చింది. తెలుగు ప్రేక్షకులంతా మా చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాం అని అన్నారు.



శాస్త్రీయ దృక్పథం అంటే ?

ప్రశ్న : శాస్త్రం, శాస్త్రీయ దృక్పథం ఒకటేనా? విజ్ఞాన శాస్త్రం సముపార్జించిన అందరికీ శాస్త్రీయ దృక్పథం వున్నట్లేనా?

– ఎం జగన్మోహన్‌రెడ్డఇ, వరంగల్

జవాబు : శాస్త్రం, శాస్త్రీయ దృక్పథం ఒకటి కాదు. విజ్ఞాన శాస్త్రాన్ని ఆపోసన చేసిన వారందరికీ శాస్త్రీయ దృక్పథం వున్నట్లు భావించకూడదు. అయితే శాస్త్రీయ దృక్పథానికి ఆధారం మాత్రం శాస్త్రమే. అలాగని శాస్త్రీయ దృక్పథం ఉన్న వారందరూ సకల శాస్త్రకోవిదులు కారు. సామాజికంగా చూస్తే శాస్త్రం అందరికీ తెలియకపోయినా పర్లేదుగానీ, పరిమిత సంఖ్యలోనే శాస్త్రజ్ఞుల సంఖ్య దేశంలో ఉన్నా సర్దుకుపోవచ్చును గానీ శాస్త్రీయ దృక్పథం విషయంలో పరిమితికి తావులేదు. ఇది మొత్తం సమాజానికి ఆసాంతం వుండాలి. శాస్త్రీయ దృక్పథం, హేతువాదం సామాజిక సంస్కృతిగా ఉండాలి. ప్రతి జన జీవనంలోను శాస్త్రీయ దృక్పథం తొణికిసలాడాలి. శాస్త్రం అంటే ఏమిటో, శాస్త్రీయ దృక్పథం అంటే ఏమటో? టూకీగా తెలుసుకుందాం.

ప్రకృతి గురించిన, సమాజాన్ని గురించిన నియమాలను అవగాహన చేసుకోవడం, వాటికి సంబంధించిన వాస్తవాలను ప్రాయోగికంగాను, అనుభవాల ద్వారాను తెలుసుకోవడం, తద్వారా మానవ సమాజ జీవితంలో వాటిని ఇముడ్చుకుంటూ నిన్నటికంటే మెరుగయిన, తక్కువ వేదన కలిగిన ప్రజాజీవితానికి ఉపకరించడం– ఇదే శాస్త్రం (శాస్త్ర సాంకేతిక రంగాలు రెండూ శాస్త్రం అనే ఒకే నాణేనికి రెండు పార్శ్వాలు కాబట్టి ఇక మీదట శాస్త్రం అంటే సాంకేతిక శాస్త్రాల్ని కూడా కలుపుకొని భావించినట్టు అర్థం చేసుకోవాలి) ప్రకృతిలో అనంతమైన పదార్థాలు, పదార్థాల తీరుతెన్నులు, వైవిధ్యాలు వున్నాయి కాబట్టి శాస్త్ర పరిజ్ఞానాన్ని వర్గీకరించడం సాధారణం. అందుకే భౌతికశాస్త్రాలు (ఇందులో మళ్లీ సాధారణ భౌతిక శాస్త్రాలు, అందులోని ఉపశాఖలు, సాధారణ రసాయనిక శాస్త్రం, అందులోని ఉపశాఖలు వున్నాయి). జీవశాస్త్రాలు (ఇందులోనూ సాధారణ జంతుశాస్త్రం, దానికి సంబంధించిన ఉపశాఖలు, సాధారణ వృక్షశాస్త్రం, అందులో సంధానించుకొన్న ఉపశాఖలు ఉన్నాయి) అంటూ ప్రధానంగా వర్గీకరించారు. అయితే ఆధునిక విజ్ఞానశాస్త్రం పలు శాఖల మధ్య ఉన్న విడదీయరాని సంబంధాల్ని గుర్తించి, అంతర్విధాన శాస్త్రాల్ని (interdisciplinary sciences) గుర్తిస్తోంది. మొత్తమ్మీద శాస్త్రానికి వర్గీకరణ వుంది. వైవిధ్యం వుంది. ఒక్కో శాస్త్రవేత్త ఒక్కో రంగంలో ప్రావీణ్యత సంపాదిస్తాడు. లేదా ఆసక్తి కనబరుస్తాడు. ఒక్కో విజ్ఞానశాస్త్ర పుస్తకం ఒక్కో రంగానికి పరిచయం చేస్తుంది. ఒక్కో పరిశోధనా పత్రం ఒక్కో లోతైన అంశాన్ని వెలికితీసి విజ్ఞానశాస్త్రమనే స్థూల భాండాగార సంపదను ఇనుమడింపజేస్తుంది. శాస్త్రీయ దృక్పథం అంటే ఇలా చెప్పుకోగలం. ప్రకృతిలో మనకు అవగతమయ్యే ప్రతిఘటన (phenomenon or event)కు చోదకశక్తి. కారణం ఇదే ప్రకృతిలో వుంటాయి. ప్రకృతేతర శక్తిగానీ, వాస్తవ జగత్తు బయటగానీ మరేదో చోదకశక్తి ఈ ఘటనలకు కారణం కాదు. కాబట్టి ఈ ఘటన మనకు ఉపకరించేదయితే ఆ చోదకశక్తిని మచ్చిక చేసుకోవడం ద్వారా ఉపకారాన్ని పొందగలం. ఒకవేళ ఆ ఘటన ప్రమాదకరమైనదయితే ఆ చోదకశక్తికి ఆటంకం కలిగించడం ద్వారా ప్రమాదాన్ని నిరోధించగలం. శాస్త్రీయ దృక్పథం ఉన్న వారందరికీ ఈ అభిప్రాయమే ఉంటోంది. అంతమాత్రాన శాస్త్రీయ దృక్పథపు పరిధి పూర్తవలేదు. శాస్త్రీయ దృక్పథం వున్న వారెపుడూ తమను, తమ భావాల్ని నిరంతరం మార్చుకోవడానికి ఇష్టపడతారు. వాస్తవం అంటే నిజం కాబట్టి, సమాధానం కాబట్టి ప్రశ్నే సమాధానాన్ని రాబడుతుంది కాబట్టి అర్థం బోధపడని ప్రతిఘటనకు కారణం ఏమిటి అని ప్రశ్నిస్తుంటారు. ఎందుకిలా, ఎపుడలా, ఎవరలా, ఎక్కడిలా, ఏ విధంగా అలా, ఏమిటిలా అంటూ ప్రశ్నల్ని అనునిత్యం మనసా, వాచా, కర్మణా సంధించుకొంటారు. ప్రకృతిలోనే అందుకు కారణాలున్నాయన్న ప్రాథమిక నమ్మకం (ఇంతకుమించి మరేవిధమైన కారణం లేదన్న రూఢి ఏర్పడ్డం వల్ల కలిగిన నమ్మకం) వుండడం వల్ల ప్రకృతిని వారు అన్వేషిస్తారు. వారి విజ్ఞాన దాహానికి అంతుండదు. శాస్త్రానికున్న సార్వత్రికత (universality) ను, వస్తు వాస్తవికత (objectivity) ను వారు తమ పరిజ్ఞానాభివృద్ధికి గీటురాయిగా భావిస్తారు. శాస్త్రం ఋజువు చేసిన వాస్తవానికి వ్యతిరేకంగా నమ్మినా, ఆచరించినా మూఢనమ్మకం ఉన్నట్టు అర్థం చేసుకోవాలి. శాస్త్రంలో వైవిధ్యం వున్నట్టు శాస్త్రీయ దృక్పథంలో వైవిధ్యం వుండదు. ఆయనకో శాస్త్రం, ఈయనకో శాస్త్రం, ఆయన డాక్టర్, ఈవిడ ఇంజనీర్, ఆయన ఆర్థిక శాస్త్రవేత్త, ఈయన ఖగోళ శాస్త్రవేత్త అనగలం కానీ, ఆయన ఆ తరగతికి చెందిన శాస్త్రీయ దృక్పథం వున్నవారు, ఈమె ఈ తరగతికి చెందిన శాస్త్రీయ దృక్పథం ఉన్న ఆవిడ అనే వర్గీకరణ వుండదు. ప్రశ్నించడాన్ని ఎంత సహజంగా ప్రవృత్తిగా భావించాలో, ప్రశ్నించబడడానికి అంతే సంసిద్ధత చూపగలిగిన మనోనిబ్బరం, ఆసక్తి ఉన్నవారే నిజమైన, కచ్చితమైన శాస్త్రీయ దృక్పథానికి ఆది, తుది గీటురాయి. శాస్త్రం తెలిసిన శాస్త్రవేత్తలు చాలామందికి శాస్త్రీయ దృక్పథం వుండదు. శాస్త్రం పరిమితంగానే తెలిసినా అపారమైన శాస్త్రీయ దృక్పథం ఉన్నవారు ఉన్నారు. కొన్ని ఉదాహరణలు గమనిద్దాం.



సత్యసాయిబాబాకు లక్షలాదిమంది భక్తులున్నారు. ఆయన చేసిన విద్య, వైద్య సేవలతో ఆకర్షితులవడం ద్వారానో, ఆయనకున్న పౌరాణిక పరిజ్ఞానం పట్ల అభిమానంతోనో ఆయనను శ్లాఘిస్తే ఎవరికీ అభ్యంతరం లేదు. కానీ ఆయన శూన్యం నుంచి వస్తువుల్ని సృష్టించగలడని, ఇది అతీతశక్తి అని భావించి ఆయనను పూజిస్తే అది ఆమోదయోగ్యం కాదు. ఒకవేళ ఆయన చేయగలడని ఎవరైనా నమ్మినా ఆయనా, ఆయన భక్తులు పూర్తిగా ఋజువు చేసుకోవాలి. ఇందుకు పద్ధతులున్నాయి. కానీ ఋజువులకు సిద్ధపడకుండా, ఋజువులు కోరే వారిని తూలనాడుతూ విజ్ఞానశాస్త్రంలో అత్యంత కీలకమైన ద్రవ్యశక్తి నిత్యత్వ సూత్రాని (Conservation of Mass-Energey) కి విరుద్ధంగా ప్రకటిస్తున్న ఆయన క్లెయిమ్‌ను గుడ్డిగా నమ్మే శాస్త్రవేత్తలు, పాలకులు, ప్రజలు, విదేశస్తులు, వ్యాపారవేత్తలకు శాస్త్రం ఎంత తెలిసినా శాస్త్రీయ దృక్పథం పూర్తిగా లేనట్టే. మరో ఉదారహణ: మన అంతరిక్ష పరిశోధనా సంస్థ ISRO ప్రపంచంలో అగ్రస్థాయిలో ఉన్న ఐదారు దేశాల సరసన నిలవదగిన ఘనాపాటి విజయాల్ని సాధించింది. చంద్రయాన్, అంగారక గ్రహ పరిశోధన (Mars Orbit Mission-MOM) వంటి ప్రయోగాల్లో విజయం సాధిస్తోంది. ISRO అధిపతికి ఉన్న ఖగోళ పరిజ్ఞానం, భౌతిక శాస్త్రపుటవగాహన తక్కువ వుంటే ఆ స్థాయికి కచేరుకోవడం కష్టమే. అయితే ఉపగ్రహ ప్రయోగంలో చోటు చేసుకొన్న ప్రతి ప్రక్రియలోను ప్రకృతికి సంబంధించిన, ఋజువు కాబడ్డ సూత్రాలే ఉన్నాయన్న సంపూర్ణ నమ్మకం ఆయనకు ఉన్నట్టు లేదు. ఒకవేళ ఉపగ్రహం ఫెయిలైనా అందుకు కారణాలూ సశాస్త్రీయంగానే వుంటాయి. మరో మాటలో చెప్పాలంటే ఉపగ్రహ జయాపజయాలకు వందకు వంద శాతం కారణం విజ్ఞానశాస్త్రమే. మరేదో అతీతశక్తిగానీన రాళ్లూ, రప్పలూ కావు. ఆ రాళ్లూ రప్పలు కూడా ఈ ప్రకృతిలోని పదార్తాలే తప్ప, వాటికీ ఈ పాదార్థిక ధర్మాలే వుంటాయే తప్ప ప్రకృతేతర పాదార్థిక అంతర్నిర్మాణం, శక్తులు వాటికి లేవు. కానీ ఆ సంస్థాధిపతులు పలుమార్లు ప్రయోగాలకు ముందు పూజలు చేయడం, విజయాలను కాంక్షించడం అశాస్త్రీయం. పైగా ఆ తంతేదో వ్యక్తిగత స్థాయిలో చేయరు. అధికారికంగా చేస్తారు. ఇది రాజ్యాంగ స్ఫూర్తికే వ్యతిరేకం.



ప్రొ॥ ఎ. రామచంద్రయ్య
సంపాదకులు,
చెకుముకి, జనవిజ్ఞాన వేదిక.
email: allikayala@gmail.com



నయా ఫీచర్!

టెక్నాలజీలో పోటీ వాతావరణం అనివార్యంగా మారింది. ప్రతి సంస్థా తమ ఉత్పత్తులను వినియోగదారులకు చేర్చేందుకు రకరకాల ప్రయత్నాలు చేస్తూనే వున్నారు. సాఫ్ట్‌వేర్ దిగ్గజం గూగుల్ సైతం తన యూట్యూబ్ యాప్‌ను మరోసారి అప్‌డేట్ చేసింది. ఈతాజా అప్‌డేట్‌తో యూట్యూబ్ వీడియోలను మరింత సులభంగా షేర్ చేసుకునే వెసలుబాటును కల్పించింది. అంతేకాకుండా, మిత్రులతో ఛాటింగ్ చేసుకునే సౌకర్యాన్ని కూడా అందుబాటులోకి తెచ్చింది. ఇప్పటి వరకు మనకు నచ్చిన యూట్యూబ్ వీడియోను ఇతరులకు పంపించాలంటే వేరే సామాజిక మాధ్యమాలను వినియోగించాల్సి వచ్చేది. దాని గురించి చర్చించాలనుకున్నా వేరే యాప్‌పైనే ఆధారపడాల్సిన పరిస్థితి. దీన్ని దృష్టిలో ఉంచుకుని యూట్యూబ్ తమ వినియోగదారుల సౌకర్యార్థం ఈ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. యాప్‌లోనే వీడియోలను పంచుకోవడం.... ఈ యాప్ లోనే నేరుగా చర్చించుకోవడం వంటి సౌలభ్యాన్ని కల్పించింది. ఇంతకు ముందు దీన్ని కెనడాలో విడుదల చేయగా, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. దీన్ని పరిశీలిస్తున్నామని, వినియోగదారుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పలు మార్పులు చేర్పులూ చేశామని గతేడాది నుంచే యూట్యూబ్ చెబుతూ వస్తోంది. ఇకపై యూట్యూబ్ వీడియోలను నేరుగా మీ స్నేహితులు, కుటుంబసభ్యులతో యూట్యూబ్ యాప్‌లోనే పంచుకోవచ్చని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతానికి ఈ సదుపాయం మొబైల్ వినియోగదార్లకు మాత్రమే వర్తిస్తోంది. ఈ యాప్ ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఉచితంగా పొందవచ్చు. లిమిటెడ్ ఇంటర్నెట్ కనెక్టివిటీలో సైతం యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను మరింత మెరగుపరిచే లక్ష్యంతో అభివృద్ధి చేయబడింది. 2జీ నెట్‌వర్క్‌లో కూడా వీడియోలను సేవ్ చేసుకొని Smart Offline ఫీచర్ ద్వారా వాటిని ఇంటర్నెట్ కనెక్షన్‌తో పనిలేకుండా వీక్షించవచ్చు. ఆఫ్‌లైన్ మోడ్‌లో వీడియోలను వీక్షించేటపుడు వీడియోకు సంబంధించిన క్వాలిటీని కూడా అడ్జస్ట్ చేసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నారు. అంతేకాదు... అందుబాటులో ఉన్న డేటా వనరులతోనే క్వాలిటీ వీడియో బ్రౌజింగ్‌ను ఆస్వాదించే అవకాశం లభిస్తుంది.

యాప్ వినియోగించే విధానం :

ఈ యాప్ ద్వారా మీరు ఏదైనా వీడియోను ఓపెన్ చేసినట్లయితే ఓ పాపప్ స్క్రీన్ పై ప్రత్యక్షమవుతుంది. ఈ పాపప్ పై క్లిక్ చేయటం ద్వారా మీ నెట్ బ్యాలన్స్‌కు సంబంధించిన వివరాలతో పాటు ఆ వీడియోను ఫోన్ ఎస్డీకార్డ్‌లో స్టోర్ చేసుకునే ఆప్షన్ కూడా కనిపిస్తుంది. మీ డేటా లిమిట్‌ను బట్టి ఆ వీడియోను డౌన్‌లోడ్ చేసుకోవాలా వద్దా అనేది మీ నిర్ణయాన్ని బట్టి ఆధారపడి ఉంటుంది. 'యూట్యూబ్ గో' యాప్ ద్వారా వీడియోలను సేవ్ చేసుకుని ఆఫ్‌లైన్ మోడ్‌లో వీక్షించటమే కాదు వాటిని లోకల్ షేర్ ఆప్షన్ ద్వారా మీకు సమీపంలోని వినియోగదారులతో షేర్ చేసుకోవచ్చు.



16న నోకియా 8 ఆవిష్కరణ


నోకియా 8 పేరుతో మరో ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ను హెచ్‌ఎండి గ్లోబల్ విడుదల చేయబోతోంది. ఆగష్టు 16న లండన్‌లో నిర్వహించే ఓ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా ఈ ఫోన్ ప్రపంచం ముందుకు రానుంది. ఈ స్మార్ట్‌ఫోన్‌లో హైలైట్ ఫీచర్స్ చాలానే ఉన్నాయి. వాటిలో డ్యుయల్ లెన్స్ కెమెరా ఒకటి. Carl-Zeiss optics తో వస్తోన్న ఈ డ్యుయల్ కెమెరా క్వాలిటీ విషయంలో వినియోగదారులను ఏమాత్రం నిరుత్సాహపరచదు. మరో ప్రధానమైన హైలైట్ క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్. మార్కెట్‌లోని లీడింగ్ ప్రాసెసర్‌లలో ఒకటైన స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్ ఫోన్ ను మరింత వేగంగా ముందుకు నడిపిస్తుంది. మిగతా స్పెసిఫికేషన్ల విషయానికొస్తే... 5.3 అంగుళాల క్యూహైడెఫినిషన్ డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 7.1.1 నౌగట్ ఆపరేటింగ్ సిస్టం, 4జీబి ర్యామ్, 64జీబి ఇంటర్నల్ స్టోరేజ్, మైక్రోఎస్డీ సపోర్ట్, డ్యుయల్ సిమ్ కనెక్టివిటీలో లభ్యమయ్యే నోకియా 8 ధర భారతీయ మార్కెట్‌లో రూ.40,000 పైనే ఉండొచ్చని సమాచారం.

అనధికారిక సమచారాన్నిబట్టి ఈ ఈవెంట్‌లో భాగంగానే నోకియా 9 స్మార్ట్‌ఫోన్‌ను కూడా హెచ్‌ఎండి గ్లోబల్ ఆవిష్కరించే అవకాశముందని తెలుస్తోంది. దీని స్పెసిఫికేషన్ల విషయానికొస్తే... 5.5 అంగుళాల క్యూహైడెఫినిషన్ OLED డిస్‌ప్లే, క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 835 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 7.1.2 నౌగట్ ఆపరేటింగ్ సిస్టం, 6జీబి ర్యామ్, ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్స్ (64జీబి, 128జీబి), 22 మెగా పిక్సల్ డ్యుయల్ Carl-Zeiss రేర్ ఫేసింగ్ కెమెరా, 12 మెగా పిక్సల్ ఫ్రంట్ ఫేసింగ్ కెమెరా, 3800mAh బ్యాటరీ విత్ క్వాల్కమ్ క్విక్–ఛార్జ్ 4 సపోర్ట్ వంటి ఫీచర్లు వుండే అవకాశముందని తెలుస్తోంది.

మీ చిట్కాలు :

కంప్యూటర్, మొబైల్, యాప్, ఇంటర్నెట్ టెక్నాలజీ వినియోగంలో మీకు మాత్రమే తెలిసిన చిట్కాలను మాకు పంపండి.'సైటెక్' పేజీలో ప్రచురిద్దాం... మన విజ్ఞానాన్ని అందరితో పంచుకుందాం.

పంపించాల్సిన చిరునామా :
సైటెక్ పేజీ
ప్రజాశక్తి
డోర్ నెం: 27-30-4
ఆకులవారి వీధి, గవర్నర్ పేట
విజయవాడ, కృష్ణాజిల్లా, ఎపి
ఇమెయిల్:
scitechpage@gmail.com



పొడుపు కథ

తెలిసి కాయకాస్తుంది..
తెలీకుండా పువ్వు పూస్తుంది..


(జవాబు: తలక్రిందులుగా ముద్రించబడింది)

జోక్స్..

రాజు : మా నాన్న వంద కేజీలు ఒకేసారి ఎత్తగలరు!
రవి : ఓస్ అంతేనా..! మా నాన్న ఒంటిచేత్తో బస్సుల్నీ, లారీలను ఆపేస్తారు. తెలుసా ?
రాజు : ఏంటి మీ నాన్న శక్తిమానా..?
రవి : కాదు, ట్రాఫిక్ పోలీస్!
రాజు : ఆ...!



ఆ తేడా ఎందుకు ?



జీర్ణవ్యవస్థ, శ్వాసవ్యవస్థ వంటి అంశాల్లో మనుషుల మధ్యే కాదు పూర్వం జంతువుల్లోనూ తేడా లేదు. ప్రోటీన్లను జీర్ణం చేసే క్రమంలో అన్ని జంతువుల్లో పెప్సిన్ ఎంజైమ్ సహకరిస్తుంది. అలాగే పిండి పదార్థాల విషయంలో అమైలేజ్ ఎంజైమ్, శ్వాస ప్రక్రియలో వ్యవస్థ రూపు రేఖలు వేర్వేరుగా ఉన్నా గాలిలోని ఆక్సిజన్‌ను గ్రహించడానికి ఎర్ర రక్తమున్న జంతువులన్నీ హీమోగ్లోబిన్ అనే వర్ణ ధాతువునే వాడుకుంటాయి. కానీ మనుషులందరికీ జీర్ణవ్యవస్థ, శ్వాసవ్యవస్థ, నాడీ, ప్రత్యుత్పత్తి వ్యవస్థలు ఒకలాగే ఉంటాయి. అయినా మనుషుల రూపురేఖల్లో, లైంగిక స్వరూపాల తేడా ఎంతో కొంత ఉంది కదా?! స్త్రీ, పురుషుల గొంతుకల ధ్వనిలో తేడాలకు జన్యులక్షణాలు కారణం. కొంతమేరకు జన్యులక్షణాలతో పాటు పురుషుల గొంతుకల ధ్వని అందరిదీ ఒకేలా ఉండకపోవడానికి కారణం వారి కంఠంలో ఉన్న సప్తపద దగ్గరున్న ధ్వనిపేటికలో ఉన్న శబ్దతంత్రుల నిర్మాణాకృతి. దాన్ని బట్టి, ఆహార నియమాల ఆధారంగా, గొంతు సంబంధ ఆరోగ్యాన్ని బట్టి ఎంతో కొంత తేడాలుంటాయి. అవి కూడా తాత్కాలికంగా గానీ లేదా చాలాకాలం పాటు గానీ ఉండటమే! ★

గుర్తించండి!



పిల్లలూ.! పైనున్న చిత్రంలో మొత్తం ఎనిమిది తేడాలు ఉన్నాయి. అవేంటో గుర్తించండి!

సెలెక్టర్లకు రూ. 15 లక్షల నజరాన

- 'ఒలింపిక్స్' నిర్ణయం జనరల్ బాడీకు
- బిసిసిఐ పాలక కమిటీ సమావేశం నిర్ణయాలు

న్యూఢిల్లీ : పురుషుల, మహిళల సెలెక్షన్ కమిటీలోని సభ్యులకు ఒక్కొరికి రూ. 15 లక్షలను నజరానాగా భారత క్రికెట్ కంట్రోల్ బోర్డ్ (బిసిసిఐ) అందచేయనుంది. బుధవారం ఇక్కడ జరిగిన బిసిసిఐ పాలక కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల ఇంగ్లాండ్‌లో జరిగిన మహిళల ప్రపంచకప్‌లో భారత్ రెండో స్థానంలో నిలవడంతో మహిళా సెలెక్టర్లకు నజరానా ఇవ్వాలని ఈ సమావేశంలో ముందుగా అభిప్రాయం వచ్చింది. అయితే ఇటీవల ఐసిసి చాంపియన్‌షిప్‌లో కోహ్లి సేన కూడా రెండో స్థానంలో నిలవడంతో పురుషుల జట్టు సెలెక్టర్లకూ నజరానా ఇవ్వాలని చివరికి నిర్ణయం తీసుకున్నారు. అలాగే ఒలింపిక్స్‌లో క్రికెట్‌ను చేరిస్తే భారత్ ఆడాలా.. వద్దా.. అనే విషయంలో పరిపాలకుల కమిటీ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశంపై నిర్ణయాన్ని జనరల్ బాడీలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని బుధవారం సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అలాగే మాజీ కెప్టెన్ అజహరుద్దీన్, క్రికెటర్ శ్రీశాంత్ అంశాన్ని కూడా జనరల్ బాడీ నిర్ణయానికి వదిలేశారు. బుధవారం సమావేశం వివరాల్ని కమిటీ ఆఫ్ అడ్మినిస్ట్రేటర్స్ (సిఓఎ) సభ్యుడు డైన ఈడ్ల్జి వెల్లడించారు. ఫస్ట్‌క్లాస్ క్రికెటర్ల వేతనంపై అనిరుధ్ చౌదరీ కసరత్తు చేస్తున్నారని, ఈ నెల 23న ముంబయిలో జరిగే తదుపరి సమావేశంలో వేతనాలపై నిర్ణయం తీసుకుంటామని డైన వెల్లడించారు. మాజీ సారథులకు అందచేస్తున్న ప్రయోజనాలను, తనకు రావాల్సిన ఇతర బాకీలను చెల్లించాలని అజాహరుద్దీన్ ఇటీవల లేఖ రాసారు. అజహరుద్దీన్ అంశాన్ని సుదీర్ఘంగా విచారించాల్సి వుందని, అయితే అతనికి అనుకూలంగానే నిర్ణయం వచ్చే అవకాశం వుందని డైనా తెలిపారు.

సింధూ, సైనాలకు తొలిరౌండ్ బైలు

న్యూఢిల్లీ : ఈ నెల 21 నుంచి జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో పివి సింధూ, సైనా నెహ్వాల్‌కు తొలి రౌండ్ బైలు లభించాయి. దీంతో వీరద్దరూ మహిళల సింగిల్స్‌లో రెండో రౌండ్ నుంచి బరిలోకి దిగుతారు. సింధూ రెండో రౌండ్‌లో కొరియాకు చెందిన కిమ్ హ్యు మిన్ లేదా, ఈజిప్ట్‌కు చెందిన హదియా హాస్నితో సింధూ తలపడుతుంది. అలాగే స్విర్జర్లాండ్‌కు చెందిన సర్బినా జాకెట్ లేదా, ఉక్రెయిన్‌కు చెందిన నటాల్యాతో రెండో రౌండ్‌లో సైనా తలపడుతుంది. అలాగే పురుషుల విభాగంలో తొలిరౌండ్ పోటీలో రష్యాకు చెందిన సెర్గీ సిరాంత్‌తో భారత షట్లర్ కిదాంబి శ్రీకాంత్ తలపడతాడు. హంకాంగ్‌కు చెందిన వె నాన్‌తో సాయి ప్రణీత్, ఆస్ట్రేలియాకు చెందిన లుకా వెబర్‌తో అజయ్ జయరామ్ తలపడతాడు. ఇక ప్రపంచ చాంపియన్‌షిప్‌కు తొలిసారిగా అర్హత సాధించిన సమీర్ వర్మ తొలి రౌండ్‌లో స్పెయిన్ పాబ్లో అబైన్‌తో ఢీ కొంటాడు. మహిళల సింగిల్స్‌లో తొలి రౌండ్‌లో ఫిల్లాండ్‌కు చెందిన అరి మికెలాతో రితుపర్ణ దాస్, ఇంగ్లాండ్‌కు చెందిన చోలో బిర్చ్‌తో తన్విలాడ్ తలపడతారు. అలాగే ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్ నుంచి పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమిత్ రెడ్డి జోడీలు, మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప- సిక్కిరెడ్డి జోడీలు, మిక్సిడ్ డబుల్స్‌లో ప్రణవ్ జెర్రీ- సిక్కి రెడ్డి జోడీలు తలపడుతున్నాయి.



నీరజ్ గురి అదిరేనా..?

జావెలిన్ త్రోలో సంచలనాలు నమోదు చేస్తున్న హర్యానా యవకుడు నీరజ్ చోప్రాపై ప్రస్తుత ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అంచనాలు భారీగా వున్నాయి. గతేడాది జూనియర్ అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డుతో స్వర్ణం కైవసం చేసుకున్న నీరజ్ ఈసారి లండన్‌లో భారత పతాకాన్ని రెపరెపలాడిస్తాడని అభిమానులు ఆశ పడుతున్నారు. ఈ విభాగంలో నీరజ్‌తో పాటు భారత్ నుంచి దేవింద్ర సింగ్ కూడా బరిలో వున్నాడు.

ప్రపంచ అథ్లెటిక్స్‌లో స్వర్ణంపై ఆశలు

నేడు జావెలిన్ త్రో పోటీలు ప్రారంభం

లండన్ : ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఇప్పటి వరకూ బోణీ చేయలేకపోయిన భారత్ గురువారం జరిగే పోటీల్లో నీరజ్ చోప్రాపై భారీగా ఆశలు పెట్టుకుంది. ఈ చాంపియన్‌షిప్‌లో జావెలన్ త్రో విభాగంలో నీరజ్ ఖచ్చితంగా పతకం తెస్తాడని భారత్ బృందం అంచనా వేస్తోంది. గురువారం పురుషుల జావెలన్ త్రో పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ విభాగంలో మొత్తం ముగ్గుర్ని (నీరజ్ చోప్రా, దేవింద్ర సింగ్ కాంగ్, అనురాణి) భారత్ పంపింది. అయితే వీరిలో అనురాణి ఫైనల్ చేరడంలో విఫలమయింది. మహిళల జావెలన్ త్రో విభాగంలో అనురాణి చివరికి 20వ స్థానంలో నిలిచి నిరాశపర్చింది. దీంతో పురుషుల విభాగంపైనే భారత్ ఆశలు పెట్టుకుంది. ఐఎఎఫ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నీరజ్ 14వ స్థానంలోనూ, దేవింద్ర సింగ్ 17వ స్థానంలోనూ వుండగా, వీరిలో 19 ఏళ్ళ నీరజ్‌పై భారీగా అంచనాలు వున్నాయి. జూనియర్ అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డు (86.48 మీటర్లు)తో నీరజ్ అందరి దృష్టిని ఆకర్షించాడు. 2016లో పోలాండ్‌లో జరిగిన అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ప్రపంచ రికార్డుతో పాటు స్వర్ణం సాధించిన నీరజ్ తన సత్తా చాటడంతో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ సాధించిన తొలి భారతీయుడుగా రికార్డు సృష్టించాడు. కేవలం కొన్ని రోజుల ముందు గడువు ముగిసిన కారణంగా ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశాన్ని నీరజ్ కొల్పోయాడు. ఈ తరువాత కూడా నీరజ్ ప్రదర్శన అసాధారణంగా వుంది. అదే ఏడాది జరిగే దక్షిణాసియా గేమ్స్‌లో 82.23 మీటర్ల దూరంతో దేశ జాతీయ రికార్డును సమం చేస్తూ నీరజ్ స్వర్ణం సాధించాడు. ఈ ఏడాది భువనేశ్వర్‌లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లోనూ బంగారు పతకం సాధించాడు. ఈ సీజన్‌లో కూడా నీరజ్ ప్రదర్శన ఆశలు రేకెత్తించేవిధంగా వుంది. ఈ ఏడాది టాప్-10 ఉత్తమ ప్రదర్శన్లో నీరజ్ ఆరవ స్థానంలో వున్నాడు. 2003 ప్రపంచ చాపియన్‌షిప్‌లో అంజూ జార్జ్ పతకం సాధించిన తరువాత భారత్‌కు మళ్లీ పతకం లభించలేదు. నీరజ్ ఈ లోటు తీరుస్తాడని అంత ఆసక్తిగా వున్నారు. భారత కాలమానం ప్రకారం రాత్రి 11:35 గంటలకు ప్రారంభమయ్యే గ్రూప్-ఎలో క్వాలిఫయింగ్ పోటీల్లో నీరజ్ వున్నాడు. ఈ నెల 11న జరిగే గ్రూప్-బి కాల్విఫయింగ్ పోటీల్లో దేవింద్ర సింగ్ వున్నాడు. గత 10 రోజుల నుంచే లండన్‌లో నీరజ్ శిక్షణలో వున్నాడు. చాంపియన్‌షిప్ పోటీలకు బాగా సన్నద్ధమైయ్యానని, 100 శాతం సిద్ధంగా వున్నాని నీరజ్ తెలిపాడు. నేడు జరిగే అర్హతా పోటీల్లో రాణించి నీరజ్ ఫైనల్‌కు చేరుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇటీవల స్వదేశం(భువనేశ్వర్)లో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 11 స్వర్ణాలతో సహా మొత్తం 29 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచిన భారత క్రీడాకారులు ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నిరాశ పరుస్తున్నారు. భారత్ నుంచి మొత్తంగా 25 మంది కూడిన బృందం వచ్చింది. మహిళల 100 మీ పరుగులో ద్యుతీ చంద్, పురుషుల 400 మీ.లో సిద్ధాంత తింగలయ మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించగా, మహిళల 400 మీ రేసులో నిర్మల షరోన్ సెమీ ఫైనల్‌లో ఇంటి ముఖం పట్టింది. మహిళల జావెలన్ త్రోలో అనురాణి నిరాశపర్చగా, హెప్తత్లాన్‌లో స్వప్న బర్మన్ 26వ స్థానంలో నిలిచింది. పురుషుల మారథన్‌లో టి గోపి 28వ స్థానంలోనూ, మహిళల మారథాన్‌లో మోనిక 64వ స్థానంలో నిలిచారు.

కాగా, ఈ ప్రపంచ చాంపియన్‌షిప్‌కు సన్నద్ధం కావడంపై భారత అథ్లెటిక్స్ సమాఖ్య తీరుపై కూడా విమర్శలు వస్తున్నాయి. జావెలన్ నుంచి ముగ్గురు బరిలో వున్నా ఈ విభాగంలో కోచ్‌ను పంపకపోవడంపై జాతీయ మాజీ చాంపియన్, నీరజ్ చోప్రా వ్యక్తిగత కోచ్ గార్యీ కల్వెర్ట్ అగ్రహం వ్యక్తం చేశారు.

బెంగాల్‌పై బెంగళూరు విజయం



నాగ్‌పూర్ : ప్రొ కబడ్డీ లీగ్ 2017లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్‌పై బెంగళూరు బుల్స్ విజయం సాధించింది. మ్యాచ్ అద్యంతం హోరాహోరీగా సాగినా చివరికి 31-25 స్కోరుతో బెంగళూరు విజయం సాధించింది. ఈ సీజన్‌లో బెంగాల్ వారియర్స్‌కు ఇది తొలి ఓటమి కావడం విశేషం. అయితే బెంగాల్ ఇప్పటి వరకూ మొత్తం మూడు మ్యాచులు మాత్రమే ఆడింది. కాగా, మరోవైపు ఈ విజయంతో జోన్ బిలో బెంగళూరు బుల్స్ అగ్రస్థానానికి చేరుకుంది. ఇప్పటి వరకూ మొత్తంగా 6 మ్యాచులు ఆడిన బెంగళూరుకు ఇది మూడో గెలుపు. ఆ జట్టు మొత్తంగా 19 పాయింట్లు సాధించింది. కాగా, బుధవారం మ్యాచ్‌లో ప్రారంభంలో బెంగళూరు ఆధిక్యంలో వుంది. ఈ తరువాత పాయింట్ల ఖాతా ప్రారంభించిన బెంగాల్ ప్రత్యర్థి పాయింట్లను సమం చేసింది. దీంతో ఒక దశలో స్కోర్లు 9-9 సమంగా వున్నాయి. అయితే తొలి అర్థ భాగం ముగిసే సరికి 12-10తో బెంగళూరు అధిక్యంలో వుంది. రెండో అర్థభాగం ప్రారంభంలోనే 12-12తో స్కోరు వారియర్స్ సమం చేసింది. తరువాత నుంచి మ్యాచ్ హోరీహోరీగా సాగింది. కానీ చివరికి బెంగళూరు విజయం సాధించింది. బెంగళూరు జట్టులో అజయ్ కుమార్ 8 పాయింట్లు, రోహిత్ కుమార్ 6 పాయింట్లు, ఆశిష్ కుమార్ 5 పాయింట్లు సాధించి తమ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. బెంగాల్ జట్టులో జాన్ కున్ లీ 8 పాయింట్లు సాధించాడు. కాగా, గురువారంతో నాగ్‌పూర్ వేదికగా మ్యాచ్‌లు ముగుస్తాయి. శుక్రవారం నుంచి అహ్మదబాద్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి.

నేటి మ్యాచులు

పుణేరి పల్టాన్ X జైపూర్ పింక్ పాంథర్స్- రాత్రి 8 గంటలకు
బెంగళూరు బుల్స్ X తమిళ్ తలైవాస్ - రాత్రి 9 గంటలకు



డిప్యూటీ కలెక్టర్‌గా సింధూ బాధ్యతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రముఖ బాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధూ డిప్యూటీ కలెక్టర్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణా జిల్లా గొల్లపూడిలోని ఆంధ్రప్రదేశ్ పరిపాలన (సిసిఎల్ఎ) కమిషనర్ కార్యాలయంలో సిసిఎల్ఎ ప్రధాన కమిషనర్ అనిల్‌కుమార్ పునేతాను కలిసి ఉద్యోగంలో చేరుతున్నట్టు రిపోర్ట్ చేశారు. అయితే ఆమెకు ఎటువంటి బాధ్యతలూ అప్పగించలేదు. మరి కొన్ని రోజుల్లో ఈ అంశం పై స్పష్టత వచ్చే అవకాశముంది. గతేడాది ఆగస్టులో జరిగిన ఒలింపిక్స్‌లో బ్యాట్మింటన్ విభాగంలో రజత పతకం సాధించిన సింధూకు గ్రూప్-1 ఉద్యోగం ఇవ్వనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఇటీవలే ఆమెకు డిప్యూటీ కలెక్టర్‌గా నియామక పత్రాన్ని సిఎం చంద్రబాబు అందజేశారు.

గ్యాంగ్‌రేప్ కేసులో ఇద్దరికి 20 ఏళ్ల జైలు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

తొమ్మిదో తరగతి చదువుతున్న మైనర్‌పై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఇద్దరు యువకులకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.55 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు ఒకటో అదనపు జిల్లా జడ్జి నందికొండ నరసింగరావు బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కొండముట్లపాలేనికి చెందిన 17 ఏళ్ల బాలిక వినుకొండలో తొమ్మిదో తరగతి చదువుతోంది. బతుకుదెరువు కోసం ఆమె తల్లిదండ్రులు గుంటూరులో కూలీ పనులు చేసుకునేందుకు వెళ్లగా ఆమె గ్రామంలోని సోదరి సంరక్షణలో ఉంటోంది. ప్రతిరోజూ బస్సులో వినుకొండ వెళ్లి పాఠశాల ముగిసిన తరువాత ఇంటికి చేరుకుంటోంది. అదే గ్రామానికి చెందిన రొక్కరొక్కల సతీష్ ఆమెను ఎలాగైనా లోబరుచుకోవాలనే 2017 నవంబర్ 25న సాయంత్రం కొండ్రముట్ల పాలెంలో పుస్తకాలు కొనిపిస్తానని చెప్పి మోటర్‌సైకిల్‌పై ఎక్కించుకుని పుస్తకాలు దుకాణం వద్ద ఆపకుండా తీసుకెళ్లాడు. మార్గ మధ్యలోని కొచ్చర్ల వద్ద స్నేహితుడు బీసపోగు మరియబాబును అదే ద్విచక్ర వాహనంపై ఎక్కించుకున్నాడు. మధ్యలో బాలికను కూర్చోబెట్టుకుని ఆమె కేకలు వేయకుండా అడ్డుకున్నారు. ద్విచక్రవాహనంపై అగ్ని గుండాల అడవుల్లోకి తీసుకెళ్లి సతీష్ తన సోదరుడైన గోపీని కూడా అక్కడికి రమ్మని ఫోన్ చేశాడు. దీంతో గోపి తన స్నేహితుడైన గుర్నాథంతో కలసి సతీష్ వద్దకు వెళ్లాడు. తరువాత ముగ్గురూ అత్యాచారానికి పాల్పడ్డారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై ఈపూరు ఎస్ఐ ఉజ్వల్‌కుమార్ కేసు నమోదు చేయగా నరసరావుపేట డిఎస్‌పి కె.నాగేశ్వరరావు చార్జిషీటు దాఖలు చేశారు. సతీష్, మరియబాబుపై ప్రాసిక్యూషన్ నేరం రుజువు చేయడంతో వీరిద్దరికీ 20 ఏళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.55 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నరసింగరావు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు వాదించారు. నిందితులకు విధించిన రూ.1.10 లక్షల జరిమానా మొత్తాన్ని బాధితురాలికి ఇవ్వాలని, న్యాయసేవాధికార సంస్థ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని న్యాయమూర్తి తీర్పులో వెల్లడించారు.

ఎపిపి కట్టా కాళిదాసుకు అభినందనల వెల్లువ

నిందితులకు కఠిన శిక్ష విధించేలా, బాధితురాలికి న్యాయం జరిగేలా చిన్న పిల్లలపై జరిగే లైంగిక నేరాలు (ఫోక్సో చట్టం) ప్రాసిక్యూషన్‌ను బాధ్యతతో నిర్వర్తించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసును వివిధ మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు, సహచర న్యాయవాదులు ఒక ప్రకటనలో అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్ధవంతమైన న్యాయవాదిని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంపై పలువురు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

రాజధానిలో ఫార్ములావన్ రోడ్డు

- గృహ నిర్మాణాలకు రూ.1991 కోట్లు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 300 ఇళ్లు
- సిఆర్‌డిఏ సమీక్షలో సిఎం చంద్రబాబు
- అమరావతిలో సిఆర్‌డిఏకు శాశ్వత భవనం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధానిలో నిర్మించబోయే రోడ్లలో ఒకదాన్ని ఫార్మలా వన్‌రోడ్డుగా నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. బుధవారం సాయంత్రం వెలగపూడిలోని సచివాలయంలో సిఆర్‌డిఏ సమావేశంలో ప్రభుత్వ గృహ నిర్మాణం, విద్యా, వైద్య సంస్థలు, పర్యాటక ప్రణాళిక, పనుల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాజధానిలో నిర్మించే ప్రతి నిర్మాణం ఐకానిక్‌గా ఉండాలని సూచించారు. 2018 చివరినాటికి రాజధాని ప్రాంతంలో రెండు లక్షల మందికి నివాసాలను నిర్మించాల్సి ఉందన్నారు. ప్రభుత్వ ముఖ్యులు, చట్టసభల ప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ అధికారులు, ఇతర ఉద్యోగులకు 4016 యూనిట్లు అవసరమవుతాయని, వీటిల్లో 3820 యూనిట్లు బహుళ అంతస్థుల భవనాలుగా నిర్మిస్తున్నామన్నారు. దీనికోసం రూ.1991 కోట్లు అవసరమవుతాయన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు 300 యూనిట్లకు రూ.386 కోట్లు, అఖిల భారత సర్వీసు అధికారులకు 130 యూనిట్లకు 167 కోట్లు, టైప్-1 గజిటెడ్ అధికారులకు 380 యూనిట్లకు రూ.215 కోట్లు, నాన్ గెజిటెడ్ అధికారులకు 1960 యూనిట్లకు రూ.694 కోట్లు, గ్రూప్-డి ఉద్యోగులకు 710 యూనిట్లకు 188 కోట్లు, ఇతర గృహాలకు రూ.180 కోట్లు వ్యయమవుతుందని అంచనావేసినట్లు సిఎంకు సిఆర్‌డిఎ కమిషనర్ వివరించారు. ఎస్‌పివి కింద ప్రభుత్వ హౌసింగ్ ప్రాజెక్టు చేపడతామని వివరించారు. ఈ ప్రాజెక్టు కోసం వివిధ మార్గాల ద్వారా సేకరించే నిధులను తిరిగి చెల్లించేందుకు అవసరమైనట్లు ఆర్థికసాయం స్వయం సమృద్ధి సాధించాలని, అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. జర్నలిస్టులకు నిర్మించే బహుళ అంతస్థుల భవనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమరావతి నగరంలో సిఆర్‌డిఏకు శాశ్వత భవనాన్ని నిర్మించేందుకు సిఎం అంగీకరించారు. అలాగే అత్యుత్తమ విద్యాలయాలు, విశ్వ విద్యాలయాలు, ఆసుపత్రుల స్థాపనతోనే అమరావతికి అంతర్జాతీయస్థాయి వస్తుందన్న అభిప్రాయాన్ని ముఖ్యమంత్రి వ్యక్తం చేశారు. నూతనంగా నిర్మించే రహదారుల్లో ఎక్కడా రాజీ పడొద్దని తెలిపారు. రాజధాని అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్న శక్తులకు ప్రజలే బుద్ధిచెబుతారని, దానికి ఇటీవల తుళ్లూరులో జరిగిన సంఘటనే తార్కాణమన్నారు. ఈ సందర్భంగా అమరావతిలో బ్రిటీష్ జియోలాజికల్ సర్వేతో సిఆర్‌డిఏ అవగాహనా ఒప్పందం చేసుకుంది. సిఎం సమక్షంలో సిఆర్‌డిఏ బిజిఎస్ ప్రతినిధులు ఎంఓయుపై సంతకాలు చేశారు.

ఉపాధ్యాయ విద్యకూ జాతీయ స్థాయి పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలుగు రాష్ట్రాల్లో ఉపాధ్యాయ విద్యకు గిరాకీ తగ్గిపోయింది. బిఎడ్, డిఎడ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదు. డిమాండ్‌కు మించి సీట్లు అందుబాటులో ఉండటంతో సీట్లలో కోత పెట్టినా, ఏటా భారీగా మిగిలిపోతున్నాయి. దీనికి తోడు 2015-16 విద్యా సంవత్సరం నుంచి బిఎడ్, డిఎడ్ కోర్సుల కాల వ్యవధిని రెండు, నాలుగు సంవత్సరాలకు పెంచడం వల్ల కూడా విద్యార్థులు ఉపాధ్యాయ విద్యపై మొగ్గుచూపడం లేదు.

ప్రభుత్వం కూడా మూడేళ్లలో ఒకే ఒక్క డిఎస్సీ ఇచ్చి చేతులు దులుపుకొంది. ఫలితంగా ఈ వృత్తి విద్యతో ఉద్యోగావకాశాలూ సన్నగిల్లాయి. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ విద్యను ప్రక్షాళన చేసే దిశగా కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రాష్ట్రాల పరిధి నుంచి పూర్తిగా ఈ విద్యను తన ఆధీనంలోకి తీసుకోవాలని నిర్ణయించింది. ఇప్పటికే ఒకే తరహా సిలబస్‌ను అమలులోకి తీసుకొచ్చిన కేంద్రం, ప్రవేశ పరీక్షల నుంచి అడ్మిషన్ల వరకు అన్నీ కేంద్ర పరిధిలోనే జరిగేలా చర్యలు తీసుకుంది. జెఇఇ, నీట్ తరహాలో ఇక నుంచి ఉపాధ్యాయ విద్యకూ జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించాలని కేంద్రం నిర్ణయించింది. వాస్తవానికి ఈ ఏడాది జనవరిలోనే ఈ నిర్ణయం తీసుకున్నప్పటికీ, దేశ వ్యాప్తంగా కళాశాలల వివరాలు సేకరించడంలో జాప్యమైంది. ఈ బాధ్యతను తొలుత న్యాక్ అప్పగించింది.

న్యాక్‌పై అదనపు భారం పడుతోందని గుర్తించి, క్వాలిటీ కౌన్సిల్‌కు ఈ బాధ్యతలను కేంద్రం అప్పగించింది. క్వాలిటీ కౌన్సిల్ రాష్ట్రాల వారీగా కళాశాలల వివరాలు, సిబ్బంది, అర్హతలను సేకరించే పనిలో పడింది. ఇప్పటికే తమిళనాడు, కేరళ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఉపాధ్యాయ శిక్షణ, కళాశాలల పనితీరుపై కేంద్రానికి నివేదికలు కూడా సమర్పించాయి. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కూడా తన నివేదికను సమర్పించే అవకాశం ఉంది. ఇప్పటికే ఉన్నత విద్యా మండలి ద్వారా రాష్ట్రంలోని కళాశాలల వివరాలు, సిబ్బంది, మౌలిక వసతులకు సంబంధించి వివరాలు సేకరిస్తోంది.

అంతర్‌రాష్ట్ర బదిలీల్లో అందరికీ అవకాశం : యుటిఎఫ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అంతర్‌రాష్ట్ర బదిలీల్లో అందరకీ అవకాశం కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర విభజనతో వందలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల్లో బదిలీలు కోరుకుంటున్నారని, వారందరికీ ఒక సారైనా అవకాశం ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ వెంకటేశ్వరరావు, పి బాబు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కేవలం స్పౌజ్, పరస్పర అంగీకార బదిలీలకు మాత్రమే అవకాశం ఇవ్వడం వల్ల కుటుంబంలో ఒక్కరే ఉద్యోగం చేస్తున్న వారికి అవకాశం రాదని, అనేక మంది భార్యా భర్తల్లో ఒకరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తుంటే, మరొకరు ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారని, ఇటువంటి వారు కూడా స్వంత రాష్ట్రానికి వెళ్ళే అవకాశం కల్పించాలన్నారు. విభజన అనంతరం చేస్తున్న బదిలీలు కావున కేడర్, సబ్జెక్టులు, మేనేజ్‌మెంట్ వంటి షరతులు లేకుండా కోరుకున్న వారందరికీ అవకాశమివ్వాలని వారు సిఎంను కోరారు.

బిసి గురుకులాల్లో రిటైర్డ్ అధ్యాపకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బిసి గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ పోస్టుల్లో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల్ని నియమించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పలు చర్చలకు దారి తీస్తోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆ శాఖ అధికారులు కూడా తప్పుపడుతున్నారు. రాష్ట్రంలో అర్హత పొందిన అభ్యర్థులెంతో మంది ఉండగా రిటైర్డ్ వారితో ప్రాముఖ్యత కలిగిన ప్రిన్సిపాల్ పోస్టుల్ని భర్తీ చేయడం అన్యాయమంటున్నారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68